తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 22.06.2026 | సంపుటి : 12 సంచిక : 333 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## అయోధ్యను వీడి వెళ్లొద్దు

### ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

లక్నో(జనంసాక్షి): ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను

మిగతా 9లో..

## టీజీ-20 లీగ్‌కు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం

: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్(జనంసాక్షి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీజీ-20 క్రికెట్ లీగ్ మంచి కార్యక్రమమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం నుంచి దీనికి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.

వివరాలు లోపలి పేజీల్లో..

# అమెరికా ఇరాన్‌లు ఒప్పందానికి సిద్ధం

## పాక్ ప్రకటన

### స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు

యూఎస్ తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, స్టీవ్ విట్‌కాఫ్.. ఇరాన్ తరఫున హాజరైన స్పీకర్ మహమ్మద్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హాజరు




బెర్న్(జనంసాక్షి): పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని లేక్ ల్యూసెర్న్‌లో చర్చలు జరుగుతున్నాయి. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ చర్చల్లో పాల్గొంటున్నారు. ఇరాన్ తరఫున ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తదితరుల బృందం వచ్చింది. పాక్, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు అధికారికంగా ప్రారంభమైనట్లు ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ చర్చలు

మిగతా 2లో..

## ఒప్పందం కుదరకపోతే కాల్పుల విరమణ ఉండదు



- ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు చేస్తాం
- 60 రోజుల్లో తుది ఒప్పందం కుదరకపోతే
- హర్మూజ్‌లో టోల్ వసూల్ చేస్తాం
- ట్రంప్ బెదిరింపులు

వాషింగ్టన్(జనంసాక్షి): ఇటువైపు అమెరికా ఇరాన్‌ల మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లో సమస్యలు సృష్టించకుండా అక్కడి 'ప్రాక్సీ'లను వెంటనే నిలువరించాలని సూచించారు. లేనిపక్షంలో ఇరాన్‌పై మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడతామని 'ట్రూత్ సోషల్'లో పోస్టు

మిగతా 2లో..

## లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు






నీట్ రీ టెస్టు కోసం పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు

## ప్రశాంతంగా పూర్తైన నీట్ రీ టెస్ట్

- దేశవ్యాప్తంగా 551 నగరాల్లో 5,440 కేంద్రాల్లో పరీక్ష
- విదేశాల్లోని 14 సెంటర్లు
- 20 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరు



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట 2026 రీ-ఎగ్జామ్ విజయవంతంగా ముగిసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారికంగా ప్రకటించింది. మన దేశంలోని 5,440 కేంద్రాలతో పాటు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. హిందీ, ఇంగ్లీష్‌తోపాటు మొత్తం 13 భాషల్లో ఈ పరీక్ష జరిగిందని ఎన్‌టీఏ పేర్కొంది. దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి వల్లే ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించగలిగామని ఎన్‌టీఏ తెలిపింది. ఈ పరీక్షలో 10వేల మందికిపైగా దివ్యాంగులైన అభ్యర్థుల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశామంది. అలాగే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న సుమారు 81 మంది అభ్యర్థుల కోసం ప్రత్యేక నిబంధనలు అమలు చేసినట్లు వెల్లడించింది. వీరిలో రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుంటున్న ఒక విద్యార్థి, అలాగే కీమోథెరపీ చికిత్స పొందుతున్న మరొక విద్యార్థి కూడా పరీక్షకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొంది.

**భారీ భద్రత ఏర్పాట్లు**

పరీక్షను పారదర్శకతను పెంచేందుకు, భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్, ముఖ గుర్తింపు విధానాన్ని ఉపయోగించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీటీవీ మానిటరింగ్, సిగ్నల్ జామర్లు, రాష్ట్ర పోలీసుల సహకారంతో రెండు అంచెల తనిఖీలను అమలు చేశారు. సీసీటీవీ విజువల్స్‌ను నిరంతరం

మిగతా 2లో..

# నా సీటు చోరీ జరిగింది

## నాపై లీగల్ కేసులేమీ లేవు



- తిరస్కరణ వ్యవహారంలో భాజపా కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోంది
- ఆ పార్టీ చేస్తున్న కుట్రలు సమాజానికి తెలియజేయాలనే పోరాడుతున్నాం
- తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్

హైదరాబాద్(జనంసాక్షి): తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో భాజపా కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. తనపై లీగల్ కేసులేమీ లేవని చెప్పారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం తెలిసిందే. ఓ కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే కారణంతో ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ స్పందించారు. భాజపా, ఈసీ లాలూచీపడి తన నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. "నా సీటు చోరీ జరిగింది. భాజపా చేస్తున్న కుట్రలు సమాజానికి తెలియజేయాలనే పోరాడుతున్నాం. నాకోసం మరొకరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేను. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టే

మిగతా 9లో..

## ఓటును ప్రాథమిక హక్కుగా మార్చాలి

- ఆ సమయం ఆసన్నమైంది
- కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కాంగ్రెస్ నేత జైరాం రమేశ్
- మోదీ, షా ఆదేశాల మేరకు ఈసీ పనిచేస్తోందని వ్యాఖ్య

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మార్చాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో వివిధ రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో జరుగుతున్న ఓటర్ల తొలగింపు, అక్రమ అనర్హతలను అడ్డుకోవడానికి ఈ

మిగతా 2లో..



ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అంటే వయస్సు పైబడినా సామర్థ్యం తగ్గకూడదు. యోగా మన జీవితం నిరంతర వృద్ధి చెందేలా చేస్తుంది. 20 ఏళ్ల వయసులో ఉన్నదానికంటే 40 ఏళ్లలో మరింత శరీర సౌలభ్యాన్ని కలిగి ఉండాలి. 30 ఏళ్ల వయసుతో పోలిస్తే 50 ఏళ్లలో మరింత ఉత్సాహంగా ఉండాలి. 50ఏళ్లలో కంటే 70ఏళ్ల వయసులో మరింత రోగ నిరోధకత కలిగి ఉండాలి. అందుకు యోగా సహాయపడుతుంది. మన శరీరాన్ని అనువుగా, మన శక్తిస్థాయులు అధికంగా ఉండేందుకు యోగా సాయపడుతుంది. అలాగే ప్రశాంతమైన, ఒత్తిడి లేని జీవితం గడపడానికి కూడా సాయపడుతుంది. జీవనశైలి వల్ల వచ్చేరోగాలను దూరం చేస్తుంది.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,

# ప్రపంచ శాంతికి యోగా మార్గం చూపుతుంది

## అన్ని వయసుల వారు ఆచరించాలి

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపు
- కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగాసనాలు



కోల్‌కతా(జనంసాక్షి): యోగా ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక ఉత్సవంగా మారిందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ఏడాదిలో సుదీర్ఘమైన రోజు అయినందునే జూన్ 21న ప్రపంచ యోగాదినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. యోగాను కేవలం కొన్ని ప్రత్యేక సందర్భాలకే పరిమితం చేయకుండా జీవితంలో భాగంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలోని రెడ్ రోడ్

మిగతా 2లో..



## మన సాగర తీరం మరింత శత్రుదుర్భేద్యం

ఒకే రోజు మూడు యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

9లో..



## రొయ్యల పరిశ్రమలో గ్యాస్ లీక్..

### ఏడుగురు మహిళలు మృతి
### తమిళనాడు తిరువళ్లూర్‌లో ఘటన

చెన్నై(జనంసాక్షి): తమిళనాడు తిరువళ్లూర్‌లోని ఓ ప్రైవేటు రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్‌లో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. అమ్మోనియా గ్యాస్ లీకైన ఘటనలో ఏడుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి పైగా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే, వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా ప్రాంతంలో పర్యటించిన స్థానిక కలెక్టర్ బాధిత కార్మికులను పరామర్శించారు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను

మిగతా 2లో..

## కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్‌ను సీఎం రేవంత్ కాపాడుతున్నారు

### భాజపా ఎదురుదాడి

- గ్యారంటీలు, హామీల అమలులో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది
- ఈ విషయమై చర్చించేందుకు 'రాహుల్‌తో సమావేశం ఏర్పాటు చేయండి'
- ముఖ్యమంత్రి రేవంత్‌కు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా.. ఆరు గ్యారంటీలు, హామీల అమలులో దారుణంగా విఫలమైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై నిలదీసేందుకు, తెలంగాణ ప్రజల గోడు వినిపించేందుకు.. లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో తమకు అత్యవసరంగా అపాయింట్‌మెంట్ ఇప్పించాలని లేఖలో

మిగతా 2లో..



## రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

### అప్పటి వరకు ఓపిక పట్టండి : కేటీఆర్

రాజేంద్రనగర్(జనంసాక్షి): అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను "గుంపు మేస్త్రి" అని చెప్పుకుంటూ నిర్మాణాలు చేయాల్సింది పోయి ప్రజల ఇండ్లను కూల్చే పనిలో పడ్డాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

మిగతా 2లో..

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

### నాది నిరసన మాత్రమే..చట్టవిరుద్ధమెలా అవుతుంది? : సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కే

- రెండో రోజుకు చేరిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన
- పరీక్షల అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల బలవన్మరణాలపై ఆగ్రహం

న్యూఢిల్లీ(జనంసాక్షి): విద్యార్థుల బలవన్మరణాలపై ఎవరూ బాధ్యత వహించకపోతే, నిరసనను మాత్రమే చట్టవిరుద్ధమని ఎలా చెబుతారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన ఆదివారం రెండో రోజుకు చేరగా, పోలీసుల ప్రకటనపై

మిగతా 2లో..



## ఓటును ప్రాథమిక హక్కుగా మార్చాలి

చర్చ ఉపయోగపడుతుందని తెలిపింది. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ఆదేశాల మేరకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) పూర్తిగా పక్షపాతంతో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఓటు హక్కుకు రక్షణ కల్పించేలా దానిని ప్రాథమిక హక్కుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన నొక్కి చెప్పారు. దీనివల్ల, ఎన్నికల సంఘం పనితీరుపై సుప్రీంకోర్టు పర్యవేక్షణ కూడా పెరుగుతుందని వ్యాఖ్యానించారు.మరోవైపు, సర్దార్? వల్లభాయ్? పటేల్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్ 'ప్రాథమిక హక్కుల సలహా కమిటీ'ని ఏర్పాటు చేసిందని జైరాం రమేశ్ గుర్తు చేశారు. అయితే, 1947 ఏప్రిల్ 21–22, తేదీల్లో జరిగిన ఆ కమిటీ సమావేశంలో ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మార్చడంపై విస్తృతంగా చర్చ జరిగిందని చెప్పారు. అంతేకాదు, అప్పట్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ దీనికి అనుకూలంగా గట్టిగా వాదించారని గుర్తుచేసుకున్నారు. అయితే, ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మారిస్తే స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో చేరడానికి వెనకాడవచ్చునని సర్దార్ పటేల్, సి. రాజగోపాలాచారి అభిప్రాయపడ్డారని తెలిపారు. అలాగే, సార్వత్రిక వయోజన ఓటు హక్కు అనేది అంతర్లీనంగా ఒక ప్రాథమిక హక్కు అని స్వయంగా సర్దార్ పటేల్ భావించారని జైరాం రమేశ్? చెప్పారు. ఈ నేపథ్యంలోనే సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆర్టికల్ 326 చేర్చారని ఆయన పేర్కొన్నారు.

ఏడు దశాబ్దాలుగా ఈ చర్చ జరుగుతోంది!

గత ఏడు దశాబ్దాలుగా ఓటు హక్కు అనేది 'ప్రజా ప్రాతినిధ్య చట్టం (1951) కల్పించిన చట్టబద్ధమైన హక్కా లేక స్పష్టమైన ప్రాథమిక హక్కా అనే అంశంపై చర్చ జరుగుతూనే ఉందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీనిపై భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయని చెప్పారు. అయితే, 2023 మార్చిలో 'అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పులో జస్టిస్ అజయ్ రస్తోగి తన భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ఓటు హక్కు ఒక ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు. అభ్యర్థుల నేర చరిత్ర, వారి ఆర్థిక ప్రయోజనాలు, రాజకీయ నిధుల మూలాల గురించి తెలుసుకునే ప్రాథమిక హక్కు ఓటర్లకు ఉందని సుప్రీంకోర్టు స్వయంగా గుర్తించిందని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, బ్యాలెట్ రహస్యాన్ని కాపాడటంతో పాటు నోటా హక్కును కూడా సుప్రీంకోర్టు గుర్తించిందని కాంగ్రెస్? నేత చెప్పారు. అయితే, 'ఓటుకు సంబంధించిన మిగిలిన అన్ని అనుబంధ హక్కులను ప్రాథమిక హక్కులుగా ప్రకటించి, అసలైన ఓటు హక్కును మాత్రం కేవలం చట్టబద్ధమైన హక్కుగానే ఉంచడం వింతగా ఉంది' అని జైరాం రమేశ్ అన్నారు.

## కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్‌ను రేవంత్ కాపాడుతున్నారు

పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం ఈ అపాయింట్‌మెంట్ ఇప్పించడంలో విఫలమైతే.. అది తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ చేసిన మహా ద్రోహంగా నిర్ధరణ అవుతుందని విమర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా, ప్రియాంకా గాంధీలు తెలంగాణ వ్యాప్తంగా పర్యటించి, స్వయంగా ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను నమ్మే జనం కాంగ్రెస్‌కు ఓటేశారని రామచందర్‌రావు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఇంతకాలమవుతున్నా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, పేద కుటుంబాలు నేటికీ ఆ పథకాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కాంగ్రెస్ నెరవేర్చని హామీలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి నిలదీయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం వెంటనే స్పందించి రాహుల్‌తో సమావేశాన్ని ఖరారు చేయించాలని డిమాండ్ చేశారు.

## రొయ్యల పరిశ్రమలో గ్యాస్ లీక్..

పర్యవేక్షించాలని సంబంధిత మంత్రులను ఆదేశించారు. ఈ ఘటనలో ఫ్యాక్టరీ యజమానితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

## రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్‌లో నిర్వహించిన "బస్తీ బాట" కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న తమను బలవంతంగా తరలించి, ఆ భూములను ప్రభుత్వం అమ్మేసుకోవాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బస్తీవాసులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పట్టాలను కూడా రద్దు చేసి, తమ భూములను లాక్కోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరూ రాలేదని తెలిపారు. ఈ ప్రభుత్వానికి సగం కాలం పూర్తయింది. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో లూటీలు జరుగుతున్నాయి.. కానీ హైదరాబాద్ నగరంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. హనుమాన్ నగర్ బస్తీ మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలివితేటలు కూడా లేవని కేటీఆర్ అన్నారు. ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి? మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాదని హామీ ఇచ్చారు. ఈ ఒక్క సంవత్సరం పాటు మీ ఇండ్లను మీరే కాపాడుకోండి? కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దని సూచించారు. పెద్దలకు ఒక నీతి పేదలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి, ప్రస్తుతం స్థానిక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మేమంతా మీకు అండగా ఉంటాం? ఎవ్వరూ భయపడకండని భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు.

# ఇరాన్ అమెరికాలు ఒప్పందానికి సిద్ధం

విజయవంతమై గతంలో కుదిరిన అవగాహన ఒప్పందంలోని అన్ని అంశాలను పొందుపరుస్తూ ఒక సమగ్ర, శాశ్వత ఒప్పందానికి దారితీస్తాయని ఆశిస్తున్నట్లు పేర్కొంది. అవగాహన ఒప్పందంలోని అంశాల వారీగా తుది ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఖతార్ వెల్లడించింది. శాంతి చర్చల లక్ష్యాలను సాధించేలా పాకిస్థాన్, ఇతర మధ్యవర్తులతో కలిసి ఖతార్ నిరంతరం పనిచేస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరించింది.

**పాక్ బృందంతో చర్చలు**

ఇరాన్ ప్రతినిధి బృందంతో చర్చలకు ముందు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ పాక్ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమెరికా ప్రతినిధులు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌లతో



కరచాలనం చేశారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపనే లక్ష్యంగా అమెరికా– ఇరాన్ మధ్య జరగనున్న చర్చలకు పాక్ ప్రతినిధుల బృందం మధ్యవర్తిత్వం వహిస్తోంది.అమెరికా–ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం అమలును వేగవంతం చేసేందుకు ఇరాన్ ప్రతినిధి బృందం ఖతార్ మధ్యవర్తులతో సమావేశమైంది. ఆ తర్వాత పాక్ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. ఈ నెల 18న కుదిరిన ఇస్లామాబాద్ మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాడింగ్‌పై మళ్లీ సంతకాలు చేసే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయీ స్పష్టం చేశారు. ఇకపై చర్చలన్నీ కేవలం ఈ ఒప్పందాన్ని క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేయాలి, ఏ విధంగా ఉండాలి అనే అంశాలపైనే కేంద్రీకృతమవుతాయని వెల్లడించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో స్విట్జర్లాండ్ విదేశాంగ మంత్రి ఇగ్నాసియో కాసిస్ సమావేశమయ్యారు.యుద్ధ విరమణ అవగాహన ఒప్పందం ప్రకారం శాంతి పునరుద్ధరణకు చర్చలు జరిపి 60 రోజుల్లో తుది ఒప్పందానికి రావాల్సి ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల కారణంగా శుక్రవారం ప్రారంభం కావాల్సిన చర్చలు ఆలస్యమయ్యాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడిని నిరసిస్తూ హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. అయితే రవాణా కోసం హర్మూజ్ తెరిచే ఉందని జేడీ వాన్స్, అమెరికా సెంట్రల్ కమాండ్ చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఒప్పందం కుదరకపోతే కాల్పుల విరమణ ఉండదు

పెట్టారు.చర్చల ప్రారంభానికి ముందు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపు పలకడం వంటివన్నీ ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. "మనం ఇంకా ఎంత సాధించగలం? పశ్చిమాసియాకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించగలమా? ఇక్కడి సంబంధాలను శాశ్వతంగా మార్చగలమా? లేదా పాత పద్ధతిలోనే వెళ్లడమా?" అనే ప్రశ్నలు తమందరి ముందు ఉన్నాయన్నారు. ఈ చర్చలను చరిత్రాత్మకంగా పేర్కొంటూ.. ఇరుదేశాల మధ్య ఇంతటి ఉన్నత స్థాయి సమావేశం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పారు.అమెరికా ఇరాన్ మధ్య రెండు రోజుల క్రితమే చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా.. వాయిదా పడ్డాయి. తాత్కాలిక ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మధ్య పోరాటం తీవ్రతరమైంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పదుల కొద్ది స్థానికులు మృతి చెందారు. ఈ దాడులను నిరసిస్తూ ఇరాన్ ప్రతినిధులు స్విట్జర్లాండ్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. చర్చలు కొనసాగాలంటే లెబనాన్‌పై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. అయితే, తాజాగా చర్చలు ప్రారంభమైన వేళ లెబనాన్‌ను ఉటంకిస్తూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

హర్మూజ్‌లో టోల్ వసూల్ చేస్తాం: ట్రంప్

హర్మూజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 60రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని హెచ్చరించారు. పశ్చిమాసియా దేశాలకు యూఎస్ అందించిన రక్షణ సేవలకుగానూ ఆ డబ్బును తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం 60రోజుల పాటు టోల్–రహిత ప్రయాణం ఉండాలన్నారు. మరోవైపు హర్మూజ్ ప్రస్తుతం ఇరాన్ నియంత్రణలో లేదని.. రవాణా నిరంతరాయంగా కొనసాగుతోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ వెల్లడించారు. పరిస్థితి ఇలాగే ఉండేలా అమెరికా దళాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. శనివారం 17మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురుతో 55 వాణిజ్య నౌకలు జలసంధిని దాటినట్లు తెలిపారు.

## లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు

బీరూట్(జనంసాక్షి):ఓ వైపు అమెరికా–ఇరాన్ ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు మొదలుకానుండగా.. మరో వైపు ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. సరిహద్దుల వద్ద పలువురు ఇజ్రాయెల్ ప్రజలు పాలస్తీనీయులపై దాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఎదుర్కోవడానికి తాము ఎదురు దాడులు చేయాల్సి వస్తోందని హెజ్‌బొల్లా ఆరోపించింది. శనివారం లెబనాన్‌లోని 100కు పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని.. అనేక పౌర నివాసాలు ధ్వంసమయ్యాయని తెలిపింది.

# ప్రశాంతంగా పూర్తైన 'నీట్ రీ టెస్ట్

పర్యవేక్షించేందుకు ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయం, విద్యామంత్రిత్వశాఖ, ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 34 కేంద్ర విద్యా సంస్థలు, అలాగే అన్ని రాష్ట్రాలు, జిల్లా కలెక్టరేట్లలో 'కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు' ఏర్పాటు చేశారు.

**20 లక్షలకు పైగా హాజరు**

నీట్ పేపర్ లీక్ తర్వాత రీ–ఎగ్జామ్?ను కేవలం 37 రోజుల వ్యవధిలోనే ప్లాన్ చేసి నిర్వహించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా పోలీసులు, అబ్జర్వర్లు, పరీక్ష సిబ్బందితో కలిపి దాదాపు 7 లక్షల మంది అధికారులను రంగంలోకి దించినట్లు ఏజెన్సీ వెల్లడించింది. దాదాపు 20 లక్షలకు పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని పేర్కొంది. సాధారణ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15గంటల వరకు పరీక్ష జరగ్గా దివ్యాంగులకు సాయంత్రం 6.20గంటల వరకు పరీక్ష నిర్వహించామని తెలిపింది. కాగా, నీట్ రీ–ఎగ్జామ్‌పై అభ్యర్థుల నుంచి భిన్నమైన స్పందనలు వచ్చాయి. ఓవరాల్?గా ప్రశ్నాపత్రం సాధారణంగానే ఉందని చాలా మంది విద్యార్థులు తెలిపారు. అయితే గత పరీక్షతో పోలిస్తే, ఈసారి ఫిజిక్స్ సెక్షన్ చాలా కఠినంగా ఉందని మరికొందరు విద్యార్థులు పేర్కొన్నారు. "పరీక్ష సాధారణంగానే ఉంది. కాకపోతే ఫిజిక్స్ పేపర్ కాస్త లెంగ్తీగా ఉంది. గతంలో కంటే కొంచం కఠినంగా అనిపించింది. అయితే బయాలజీ బాగుంది. కెమిస్ట్రీ ప్రశ్నలు సాధారణంగానే ఉన్నాయి" అని చాలా మంది చెప్పారు.మరొక అభ్యర్థి మాట్లాడుతూ, "గత పరీక్ష కంటే ఇది కొంచెం కష్టంగా అనిపించింది. ఇది నా మొదటి ప్రయత్నం. నాకు దాదాపు 500 మార్కులు వచ్చే అవకాశం ఉంది. పరీక్ష కేంద్రం లోపల ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి" అని చెప్పాడు.

**పేపర్ లీక్ వివాదం**

మే 3న నిర్వహించిన నీట్–యూజీ పరీక్ష పేపర్ లీకైంది. దీంతో ఆ పరీక్షను రద్దు చేసి ఇవాళ మళ్లీ నిర్వహించింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్ష సజావుగా సాగేందుకు జాతీయ పరీక్షల సంస్థ–ఎన్?టీఏ భారీ ఏర్పాట్లు చేసింది. 1.38 లక్షలకుపైగా సీసీ కెమెరాలు, 51వేలకుపైగా జామర్లను ఏర్పాటు చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిల్లీ ఓఖ్లాలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయంలో ఉండి పరీక్ష నిర్వహణపై నిరంతరం సమీక్ష జరిపారు.

**నీట్ పరీక్ష కోసం ప్రయాణం వాయిదా వేసుకున్న ప్రధాని మోదీ**

దేశవ్యాప్తంగా నీట్ రీటెస్టు జరుగుతోంది. దీనికోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ సైతం సమయానుకూల నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్ పర్యటన అనంతరం మధ్యాహ్నం దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. అధికారిక నివాసానికి వెళ్లేందుకు తన ప్రయాణాన్ని కాసేపు వాయిదా వేసుకున్నారు. నీట్ పరీక్ష కోసం ఎగ్జామ్ సెంటర్లకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.నీట్ రీటెస్టు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. అయితే, ప్రధాని మోదీ మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన వెంటనే అక్కడి నుంచి అధికారిక నివాసానికి బయల్దేరాలి. కానీ.. తన ప్రయాణాన్ని కాసేపు వాయిదా వేసుకున్నారు. నీట్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు దేశ రాజధానిలో ట్రాఫిక్ సజావుగా సాగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత ఎయిర్‌పోర్ట్ నుంచి తన నివాసానికి బయలుదేరినట్లు చెప్పారు. నీట్ రీటెస్టును ఎన్‌టీఏ కట్టుదిట్టంగా నిర్వహిస్తోంది. 22 లక్షల మందికిపైగా విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా 5,440, విదేశాల్లో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఏఐ ఆధారిత నిఘా సహకారంతో 1.38 లక్షల సీసీటీవీ కెమెరాల ద్వారా 95 వేలకుపైగా పరీక్షా గదులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరిగే మోసాలను అరికట్టేందుకు 51 వేలకుపైగా సిగ్నల్ జామర్లను ఏర్పాటు చేశారు.

## రష్యా నుంచి ఆగని కొనుగోళ్లు

### భారీగా చమురు దిగుమతి

న్యూఢిల్లీ(జనంసాక్షి):రష్యా నుంచి భారత్‌కు చమురు సరఫరా భారీగా పెరుగుతోంది. మే నెలలో రష్యా నుంచి భారత్ రోజుకు 1.91 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకోగా.. జూన్ 19 నాటికి సగటున రోజుకు 2.66 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకున్నట్టు డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ వెల్లడించింది. అదే సమయంలో యూఏఈ నుంచి దిగుమతులు దాదాపు రికార్డు స్థాయికి చేరుకున్నాయని కెప్లర్ తెలిపింది. జూన్ 19నాటికి యూఏఈ నుంచి రోజుకు 6,36,000 బ్యారెళ్ల చమురు దిగుమతి నమోదైనట్లు తెలిపింది. సౌదీ అరేబియా నుంచి 3,84,000 బ్యారెళ్ల చమురు కొనుగోలు చేస్తుండగా.. వెనెజువెలా నుంచి రోజుకు సగటున 2,09,000 బ్యారెళ్లు దిగేమతి చేసుకుంటున్నట్లు నివేదికలు వెల్లడించాయి. దీంతో వెనెజువెలా భారత్‌కు నాల్గో అతిపెద్ద చమురు సరఫరాదారుగా అవతరించింది. కాగా అమెరికా నుంచి దిగుమతులు మే నెలలో 2,52,000 బ్యారెళ్లు ఉండగా..జూన్ 19 నాటికి 91,000 బ్యారెళ్లకు పడిపోయాయి. అధిక రాయితీల కారణంగా కేంద్రం రష్యా నుంచి విస్తృతంగా చమురు కొనుగోళ్లు చేపడుతోంది. అయితే ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్‌ను తిరిగి తెరవడంతో గల్ఫ్ దేశాల నుంచి కూడా భారత్‌కు చమురు సరఫరా ప్రారంభమైంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఇంధన దిగుమతి దారు అయిన భారత్ ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ కోసం సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాలపై ఆధారపడు తోంది.కాగా చమురు ఎగుమతిదారులు ఇచ్చే పోటీతత్వ రాయితీలతో జూన్ చివరి నాటికి దేశ దిగుమతులు రోజుకు 2.35 మిలియన్ బ్యారెళ్లను మించి.. రికార్డు నెలకొల్పే అవకాశం ఉందని కెప్లర్ అంచనా వేసింది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ చమురు కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ రష్యా నుంచి కూడా సరఫరా కొనసాగుతుందని తెలిపింది.

# ప్రపంచ శాంతికి యోగా మార్గం చూపుతుంది

వేదికగా జరుగుతున్న కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే పరిమితం కాదని, ప్రపంచ శాంతికి కూడా మార్గం చూపగలదని, అన్ని వయసుల వారు యోగాను ఆచరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.'జూన్ 21 భూమిపై కొంతభాగంలో ఏడాదిలోనే సుదీర్ఘమైనరోజు. అంతర్జాతీయ యోగా దినోత్సవం కారణంగా ఈ రోజు విశ్వంలోనే అతిపెద్ద సామూహిక కార్యక్రమంగా నిలుస్తోంది. విశ్వంలోని వేర్వేరు భాగాల్లో యోగాకు సంబంధించి ఒకదానిని మించి మరొకటి అనే విధంగా అద్భుతచిత్రాలు వస్తున్నాయి. దేశంలో హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు, తూర్పున బంగాల్ నుంచి పశ్చిమాన సౌరాష్ట్ర వరకు దేశమంతా యోగాశక్తితో చైతన్యవంతంగా కనిపిస్తోంది. యోగాను కేవలం ప్రత్యేక సందర్భాలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జీవనశైలి వ్యాధులు, మానసిక ఒత్తిడి, అంటురాని వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో యోగ ఆరోగ్యకరమైన జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తోంది'



అని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ తదితరులు పాల్గొన్నారు. వేలాది మంది యోగా సాధకులతో కలిసి ప్రధాని మోదీ ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉండాలనే థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మోదీ తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా 2,500 ప్రాంతాల్లో వేడుకలు

ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,500 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. 210కు పైగా భారత రాయబార కార్యాలయాలు, దౌత్య మిషన్లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. ఆరోగ్యం, సామరస్యం, సమష్టి సంక్షేమానికి యోగ ఒక ప్రపంచ ఉద్యమంగా మారిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రపంచ జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యవంతమైన, చురుకైన జీవనశైలిపై అవగాహన పెంచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంది.ప్రధాని నరేంద్ర మోదీ 2014లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతు తెలిపాయి. అనంతరం 2015 జూన్ 21న తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించబడింది. అప్పటి నుంచి యోగ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, సమగ్ర జీవనానికి ప్రతీకగా మారి కోట్లాది మందిని ఒకే తాటిపైకి తీసుకొస్తోంది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

స్పందిస్తూ ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల మరణాలు, పరీక్షల అవకతవకలపై తీవ్ర ఆందోళనలు ఉన్నప్పటికీ సంబంధిత మంత్రి పదవిలో కొనసాగడానికి ఏ నిబంధనలు అనుమతిస్తున్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!**

అయితే నిరసనకు ఇచ్చిన అనుమతి గడువు ముగిసిందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం ధర్నా చట్టవిరుద్ధంగా పరిగణిస్తామని దిల్లీ పోలీసులు పలుమార్లు ప్రకటించారు. అయినప్పటికీ నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో పోలీసులను విద్యార్థుల బలవన్మరణాలపై ఎవరూ బాధ్యత వహించకపోతే, నిరసనను మాత్రమే ఎలా చట్టవిరుద్ధమని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల బలవన్మరణాలు వంటి అంశాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేశారు.సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన ఉద్యమం ఇప్పుడు సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు, యువకులు, ఉద్యమానికి మద్దతు తెలిపే ప్రజలు దిల్లీకి చేరుకుని తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పరిపాలనా యంత్రాంగం నిరసనను విరమించుకోవాలని సూచించినప్పటికీ, నిరసనకారులు వెనక్కి తగ్గకుండా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలకు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని సీజేపీ నాయకులు చెప్పారు.శనివారం నిరసనను అనుమతి గడువు తర్వాత కొనసాగించేందుకు పోలీసులు అనుమతించక పోవడంతో అభిజిత్ దిప్కే తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు తాను జంతర్‌మంతర్‌ను విడిచిపెట్టబోనని ప్రకటించారు. తమ ఆందోళన పూర్తిగా శాంతియుతంగా కొనసాగుతోందని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పోరాటం సాగిస్తామని చెప్పారు. శాంతియుత నిరసన చేపట్టడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని దీప్కే పేర్కొన్నారు. ప్రతిసారి అనుమతులు తీసుకోవాలని నిబంధనలు విధించడం ప్రజాస్వామ్య స్వేచ్ఛలను పరిమితం చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమం ఏ ఒక్క సంస్థకో, రాజకీయ పార్టీకో సంబంధించినది కాదని, విద్యార్థుల భవిష్యత్తు కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సాగుతున్న ప్రజా ఉద్యమమని వివరించారు. పోలీసు సిబ్బందిని ఉద్దేశించి కూడా అభీతే దీప్కే వ్యాఖ్యలు చేశారు. ఆ అంశాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగా కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంగా చూడాలని ఆయన కోరారు. విద్యా రంగంలో సంస్కరణలు అవసరమని, విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమంజసమేనని చాలా మంది పోలీసు సిబ్బంది వ్యక్తిగతంగా అంగీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తమ ఉద్యమానికి ప్రధాన లక్ష్యం విద్యాశాఖ మంత్రిపై బాధ్యత నిర్ధరించి, ఆయన రాజీనామా చేయించడం మాత్రమేనని మరోసారి




స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, శనివారం రాత్రి నిరసనను బలహీనపర్చేందుకు అధికారులు కొన్ని చర్యలు తీసుకున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. నిరసన స్థలంలో నీరు, విద్యుత్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను నిలిపివేశారని వారు పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకుండా చేశారని అభిజిత్ దిప్కే ఆరోపించారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లు తప్పుగా అనిపిస్తే బహిరంగంగా చర్చించాలని, కానీ సౌకర్యాలను నిలిపివేసి ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. నిరసనను అణచివేసే ప్రయత్నాల కంటే విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

పోలీసులు పూర్తిగా నిష్పాక్షికంగా వ్యవహరించాలని దిప్కే విజ్ఞప్తి చేశారు. పోలీసులు రాజ్యాంగాన్ని, పౌరుల హక్కులను కాపాడతామని ప్రమాణం చేస్తారని, ఏ రాజకీయ పార్టీకి సేవ చేయడానికి కాదని గుర్తుచేశారు. తన కుటుంబానికి పోలీసు శాఖతో అనుబంధం ఉన్నందున సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడిని తాను అర్థం చేసుకోగలనని, అయినప్పటికీ రాజ్యాంగ సూత్రాలు, పౌర హక్కుల పరిరక్షణకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మరోవైపు, ఉద్యమం ద్వారా విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశవ్యాప్తంగా వినిపించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యా రంగంలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# కానరాని 'నైరుతి'

- **తగ్గని ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి**
- **ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో నమోదవుతున్న భారీ ఉష్ణోగ్రతలు**
- **23 మండలాల్లో 40.4 నుంచి 43.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్(జనంసాక్షి):ఓ వైపు రాష్ట్రంలో రుతుపవనాలు విస్తరిస్తుంటే, మరోవైపు వడగాలుల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. పైపెచ్చు రోజురోజుకూ పెరుగుతుండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని ప్రజలు ఉక్కపోతను ఎదుర్కొంటున్నారు. తెలంగాణలోని 25 జిల్లాల పరిధిలోని 290 మండలాల్లో వడగాలులు వీస్తున్నాయి. వాటిలో 194 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు నమోదయ్యాయి. కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని మూడొంతుల మండలాల్లో దీని ప్రభావం కనిపించింది.పలు మండలాల్లో 43 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత : నిజానికి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఈ సమయానికి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్? కంటే తక్కువగానే నమోదు కావాలి. అయితే అందుకు భిన్నంగా ఈ సంవత్సరం అంతకంతకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని జిల్లాల్లో ఎక్కువ మండలాల్లో ఈ ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 23 మండలాల్లో ఉష్ణోగ్రతలు 40.4 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు : అయితే ఉత్తర, దక్షిణ ద్రోణుల ప్రభావంతో నేడు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచించింది. ఇవాళ చాలా ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. రేపు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొంది.11 నుంచి కదలని నైరుతి : నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న తెలంగాణలోకి ప్రవేశించాయి. 11వ తేదీ నాటికి భద్రాచలం, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల వరకూ విస్తరించాయి. అయితే ఈ నెల 11 నుంచి ఉన్నచోటే ఉన్నాయని, ముందుకు కదలడం లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## పాస్ ఫోటో మరచిన విద్యార్థిని

**నీట్ పరీక్ష రాసేందుకు విద్యార్థినికి అండగా నిలిచిన భీమారం ఎస్ఐ**



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 21 (జనంసాక్షి) :** విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎంతో ఒత్తిడి ఉంటుంది. ఓ నీట్ విద్యార్థిని పాస్ ఫోటో మర్చిపోయి పరీక్షా కేంద్రానికి వచ్చి తీవ్ర ఆందోళనకు గురైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రం వద్ద ఓ విద్యార్థిని పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకురావడం మరిచిపోయింది. పరీక్షా కేంద్రం నిబంధనల ప్రకారం ఫొటో తప్పనిసరి కావడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. భీమారం ఎస్సై రాజేందర్ సకాలంలో స్పందించి విద్యార్థినికి సహాయం చేసి పరీక్ష రాయడానికి సహాయం అందించారు .నీట్ పరీక్ష రాయడానికి వచ్చిన పరీక్ష రాయలేనేమోనన్న భయంతో పరీక్షా కేంద్రం బయటకు వచ్చిన ఆ విద్యార్థి పరిస్థితిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విధులు నిర్వహిస్తున్న భీమారం ఎస్సై రాజేందర్ గమనించారు.విద్యార్థిని ఆందోళనను అర్థం చేసుకున్న ఎస్సై రాజేందర్ వెంటనే స్పందించి,పోలీసు వాహనంలో సమీపంలోని ఫొటో స్టూడియోకు తీసుకెళ్లి ఫొటో తీయించి, అనంతరం ఆమెను సకాలంలో తిరిగి పరీక్షా కేంద్రానికి చేర్చారు.దీంతో విద్యార్థిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షకు హాజరైంది.విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే స్పందించి సహాయం చేసిన ఎస్సై రాజేందర్‌ను అక్కడ ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అభినందించారు. పోలీసుల మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## ఒలింపిక్సే లక్ష్యంగా తెలంగాణలో 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవకాశాలు లేక మరుగున పడిపోతున్న ప్రతిభాపాటవాలను (ఆణిముత్యాలను) వెలికితీసి, వారికి సరైన శిక్షణనిచ్చి ప్రపంచానికి పరిచయం చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో ఒలింపిక్స్ బరిలో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సరికొత్త 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నాం" అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఉప్పల్ స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభమైన 'టీజీ 20 క్రికెట్ లీగ్' మెగా టోర్నమెంట్‌కు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ఈ లీగ్ ఒక బలమైన పునాది కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'గతంలో క్రికెట్ అంటే కేవలం నగరాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ, ఆ పరిస్థితులను మారుస్తూ మొదటిసారిగా మా ప్రభుత్వం ప్రతి జిల్లా నుంచి క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించింది. జిల్లాల వారీగా జట్లను (టీమ్‌లను) ఎంపిక చేసి గ్రామీణ యువతకు ఈ మెగా వేదికను కల్పించాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలను పెద్దపీట వేస్తూ, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉంది" అని భట్టి విక్రమార్క తెలిపారు. ?గతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫుట్‌బాల్ స్టార్ 'మెస్సి' ఆడిన ఈ ఉప్పల్ స్టేడియం సాక్షిగా.. హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి వసతులు, అన్ని హంగులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఒలింపిక్స్ స్థాయి శిక్షణ ఇచ్చేలా తెలంగాణలో ఒక బలమైన క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 21 రోజుల పాటు సాగనున్న ఈ 'టీజీ 20 క్రికెట్' హంగామా.. రాష్ట్రంలోని క్రీడాభిమానులకు ఒక పెద్ద పండుగ వాతావరణాన్ని తీసుకురానుంది. ఈ టోర్నీ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## నీళ్ల నుండి నిప్పులు పుట్టించిన 'జయశంకర్'

- తెలంగాణ ఆకాంక్ష తన అక్షరస్వేదం
- పాస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆరు దశాబ్దాల పాటు ఉద్యమ జ్వాలను ఆరిపోనివ్వకుండా తన అక్షర స్వేదాన్ని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను తెలియజేసిన నిత్య చైతన్య శీలి ఆచార్య జయశంకర్ అని పూలే ఆశయ సాధన సమితి (పాస్ ) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ మల్లేశ్వర్ అన్నారు. ఈరోజు ఆచార్య జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం క్రాస్ రోడ్స్ లోని తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించి మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ వాక్పటిమను వాద్యంగా మార్చి నీళ్ల నుండి నిప్పును పుట్టించి యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల సత్యనారాయణ, డాక్టర్ వంగల సుధాకర్, పాస్ నాయకులు తాళ్లపల్లి నరేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఎల్‌బీ నగర్, మూసారాంబాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు బలమైన సిద్ధాంతపరమైన పునాదులు వేసిన గొప్ప మేధావి అని పేర్కొన్నారు. జయశంకర్ గారి ఆశయాలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. ఈ కార్యక్రమంలో సల్వ చారి, స్వామి , తెలంగాణ ఉద్యమకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి విషయంలో గొడవపడ్డ ఇరువురిపై కేసు

**చెన్నారావుపేట, జూన్ 21( జనం సాక్షి):** భూమి విషయంలో గొడవపడ్డ ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన బానోతు రాంచందర్, బానోతు శంకర్, హరిలు భూమి విషయంలో గొడవ పడి కొట్టుకున్నారు. రాంచందర్ ఫిర్యాదు మేరకు శంకర్, హరిల పై శంకర్ ఫిర్యాదు మేరకు రాంచందర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

## సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో గ్యాస్ లీక్

- ఇద్దరు మృతి, 50 మందికిపైగా అస్వస్థత

**చెన్నై (జనంసాక్షి) :** సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్ అయ్యింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో 50 మందికిపైగా అస్వస్థత చెందారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పెరియపాలయం సమీపంలోని కన్నిగైపైర్‌లో ఉన్న సెయింట్ పీటర్స్ అండ్ పాల్ సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్స్ కేంద్రంలో ఆదివారం అమ్మోనియా గ్యాస్ లీక్ అయ్యింది. కాగా, ఈ సంఘటన వల్ల అందులో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు మరణించారు. సుమారు 46 మంది వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. వారిని వెంటనే అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు కొందరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఏడుగురికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. బాధిత కార్మికుల్లో చాలా మంది ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారేనని పోలీస్ అధికారి తెలిపారు. సీఎం విజయ్ ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

## 'పిట్టగూడు' కవితల సంపుటి సమీక్ష



**నర్సంపేట (జనంసాక్షి) :** తెలంగాణ రచయితల సంఘం (హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖ) 24వ 'కవిత్వంతో కలుద్దాం' కార్యక్రమాన్ని ఆదివారం నర్సంపేటలో నిర్వహించింది. లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ సహకారంతో సాగిన ఈ కార్యక్రమంలో ముందుగా విజ్డం హై స్కూల్ లో విద్యార్థుల మధ్య పుస్తక సమీక్ష సెషన్ జరిగింది. ఇందులో భాగంగా కవి తండ హరీష్ గౌడ్ ఇటీవల రచించిన 'పిట్టగూడు' కవితల సంపుటిని కవి కార్తీక రాజు సమీక్షించాడు. కవిత్వం ఎలా రాయాలి? పుస్తకాల్ని ఎలా సమీక్షించాలి? అనే విషయాల పట్ల కవులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం లీడ్ లైబ్రరీలో కవిత్వ పఠనం సెషన్ జరిగింది. ఇందులో కవులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్, రాపాక శ్రీనివాస్, కుంజా కళ్యాణి తదితరులు తమ కవిత్వాన్ని వినిపించారు.

## కార్మిక హక్కులపై దాడే లేబర్ కోడ్లు




- హైర్ అండ్ ఫైర్ విధానాలకు కేంద్రం ప్రోత్సాహం
- కనీస వేతనం రూ.32 వేలు అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్

**సంగారెడ్డి, జూన్ 21 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మిక హక్కులను బలహీనపరిచి, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు విమర్శించారు. ఆదివారం సంగారెడ్డిలో జరిగిన తెలంగాణ స్టేట్ ఫిక్స్‌డ్ టర్మ్ అండ్ నాన్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) తొలి మహాసభలో ఆయన, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడారు. లేబర్ కోడ్ల ద్వారా హైర్ అండ్ ఫైర్ విధానాలను అమలు చేస్తూ శాశ్వత ఉద్యోగాల స్థానంలో ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులను నియమించే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నడుస్తున్నాయని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.32 వేలు నిర్ణయించాలని, ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, చట్టబద్ధ సెలవులు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, కార్యదర్శులు పద్మశ్రీ, మల్లేశం, బీరం మల్లేష్, కూరపాటి రమేష్, పుప్పాల శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న, జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు మాణిక్, ప్రవీణ్, యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ భూములు ఉద్యమకారులకు కేటాయించాలి

- తెలంగాణ రక్షణ సమితి



**రాజేంద్రనగర్, జూన్21 (జనంసాక్షి) :** ఉప్పల్ భగాయత్‌లో మిగిలిన భూములను తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని తెలంగాణ రక్షణ సమితి రాజేంద్రనగర్ ఇంచార్జ్ చలసాని విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రాజేంద్రనగర్ డైరీ ఫామ్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనతో పాటు పలువురు ఉద్యమ నాయకులు మాట్లాడుతూ, ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు అమరవీరుల కుటుంబాలకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, తమ డిమాండ్లు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు జి. సదానంద్, రామకోటి, అర్జున్, శేఖర్, వంశీ గురుమీత్ సింగ్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టులు కమీషన్లకే మూడేళ్లు గడిచాయి

- తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం
- ప్రపంచం మెచ్చిన అవినీతి రహిత పాలన మోదీకే సాధ్యం
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 21(జనం సాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల విశ్వాసం, అభివృద్ధి, సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తూ ప్రపంచ నాయకుడిగా ఎదిగారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఆదివారం నారాయణపేటలో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అవినీతి రహిత పాలనను అనుభవిస్తోందని, గత ప్రభుత్వాల మాదిరిగా అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు లేవని పేర్కొన్నారు. స్వదేశీ సాంకేతికతతో రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రహదారుల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోందన్నారు. కోవిడ్ సమయంలో స్వదేశీ వ్యాక్సిన్ తయారు చేసి దేశ ప్రజలను కాపాడటమే కాకుండా ఇతర దేశాలకు కూడా అందించిందని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, కాంట్రాక్టులు, కమిషన్లకే పరిమితమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కొండయ్య, రతంగ్ పాండు రెడ్డి, పగుడాకుల శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, అమర్ దీక్షిత్, కె. శ్రీనివాసులు, లక్ష్మీ శ్యామ్‌సుందర్, బలరాం రెడ్డి, భాస్కర్, కొండా శ్వేత సత్య యాదవ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు

- యోగతో ఆరోగ్యం... ఆరోగ్యంతో అందమైన జీవితం
- దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జూన్ 21(జనంసాక్షి) :** ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని, యోగతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఆదివారం ములుగు పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు... శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ" అని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని తెలిపారు. గతంలో మన పూర్వీకులు ప్రత్యేకంగా వ్యాయామాలు చేయకపోయినా రోజువారీ జీవితంలో చేసే సహజమైన శారీరక శ్రమ, క్రమబద్ధమైన జీవనశైలి కారణంగా ఆరోగ్యంగా జీవించగలిగారని అన్నారు. కానీ ఆధునిక జీవన విధానంలో సాంకేతిక సౌకర్యాలు పెరగడం, ఇంటి పనులు తగ్గిపోవడం, ఎక్కువ సమయం ఒకే చోట కూర్చోవడం వంటి కారణాలతో శరీరానికి అవసరమైన సహజ కదలికలు తగ్గిపోయాయని తెలిపారు. ఈ మార్పుల వల్లే నేటి సమాజంలో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యంతో పాటు విద్య కూడా ప్రతి మనిషి భవిష్యత్తును నిర్మించే ప్రధాన శక్తి అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం కొంత సమయాన్ని నడక, యోగ, ఇతర శారీరక వ్యాయామాలకు కేటాయించాలని సూచించారు. యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ద్వారానే బలమైన రాష్ట్రం, సుసంపన్నమైన దేశం నిర్మాణం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, ఆరోగ్యకరమైన జీవన విధానానికి పునాది వేస్తుందన్నారు. ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారీ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ కొంత సమయాన్ని శారీరక వ్యాయామం లేదా యోగ కోసం కేటాయించాలన్నారు. క్రమశిక్షణ, శారీరక శ్రమ అలవాట్లు జీవితాంతం ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన వృద్ధాప్యాన్ని పొందాలంటే యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వికాస్ మీనా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈఓ సిద్ధార్థ్ రెడ్డి, నోడల్ అధికారి డాక్టర్ సంధ్య, డీఎస్పీ రవీందర్, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం
22 జూన్ 2026

# యుద్ధానికి ముగింపు దొరుకుతుందా?

సంపాదకీయం

పశ్చిమసియాలో మరోసారి యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్ గాజా సంఘర్షణ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కఠినమైన వైఖరి తీసుకున్నారు. ఒప్పందానికి కట్టుబడకపోతే కాల్పుల విరమణ ఉండదని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఈ హెచ్చరిక ఒక్క గాజాకే కాదు, మొత్తం పశ్చిమసియా దేశాలకు పరోక్ష సందేశంగా పరిణమించింది. అమెరికా మద్దతు లేకుండా ఎటువంటి శాంతి చర్చలూ ముందుకు వెళ్ళలేవని చాలా దేశాలు గ్రహిస్తున్నాయి.

"ఒప్పందం లేకుండా కాల్పుల విరమణ సాధ్యం కాదు.. ట్రంప్"

వాషింగ్టన్ నుండి వస్తున్న సంకేతాలు అస్పష్టంగా ఉన్నాయి. ఒత్తిడి ద్వారా ఒప్పందం చేయించాలన్న అమెరికా వ్యూహం ఒకవైపు, మానవతా దృక్పథం మరొకవైపు.. ఈ రెండింటి మధ్య సమన్వయం కుదరడం లేదని నిపుణులు చెప్తున్నారు. యుద్ధవిరమణకు అమెరికా, ఐరోపా దేశాలు నెలల తరబడి దౌత్య ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పరిస్థితి చక్కబడటం లేదు. ఒత్తిడి ద్వారా మొదలైన చర్చలు, శాంతి దూతల ప్రయత్నాల తర్వాత కూడా ఒప్పందం కుదరడం లేదు. ఏ పక్షమూ తమ డిమాండ్లు తగ్గించుకోవడానికి సిద్ధంగా లేదు. ఒక వైపు ఇజ్రాయెల్ భద్రత అవసరాలు చెప్పుకుంటోంది. మరో వైపు హమాస్ సంస్థ పూర్తి వెనుదలను అంగీకరించడం లేదు. మధ్యలో చిక్కుకున్న పాలస్తీనా పౌరులు అత్యంత దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రతిపాదనలు మెజారిటీ సభ్యులు ఆమోదించినా అమలు జరగడం లేదు. ప్రపంచ దేశాల నేతలు ఈ చిక్కుముడిని విప్పలేక తమ పరిమితులను బహిర్గతం చేసుకుంటున్నారు.

"దౌత్య ప్రయత్నాలకు అర్థమైనా ఆచరణలో అడుగు ముందుకు పడటం లేదు" ఈ నేపథ్యంలో పాకిస్తాన్ కొత్త పాత్ర పోషించడానికి ముందుకు వచ్చింది. ఇస్లామిక్ సహకార సంస్థ ద్వారా మధ్యవర్తిత్వం చేపట్టాలని పాకిస్తాన్ ప్రభుత్వం దౌత్య కార్యకలాపాలు మొదలుపెట్టింది. పాక్ విదేశాంగ మంత్రి ఇటీవల వివిధ అరబ్ దేశాలను సందర్శించి, అన్ని పక్షాలను చర్చల వేదిక దగ్గరకు తీసుకు రావడానికి కృషి చేస్తున్నారు. ఇస్లామిక్ ఐకమత్య ముద్రతో ఆ దేశం ఈ పాత్రను సహజంగా క్లెయిమ్ చేసుకుంటోంది. అయితే పాకిస్తాన్‌కే అంతర్గత సంక్షోభాలు ఉన్న సమయంలో ఈ మధ్యవర్తిత్వం ఎంతవరకు సఫలమవుతుందో అని కొందరు విశ్లేషకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఖతర్, ఈజిప్ట్ మాదిరిగా నిరంతర దౌత్య మౌలిక సదుపాయం పాక్‌కు ఉందా అన్న ప్రశ్న కూడా ఉంది.

శాంతి కేవలం ఒప్పందం కాదు.. అది ప్రతి పౌరుని హక్కు. యుద్ధం ఆగాలంటే రాజకీయ సంకల్పం కావాలి; అది అన్ని పక్షాల నుండి, ఒకే సమయంలో రావాలి. అమెరికా నిర్దేశించిన నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. గాజాలో కాల్పుల విరమణకు బదులుగా హమాస్ బందీలను విడుదల చేయాలని, సంస్థ ఆయుధాలు వదులుకోవాలని షరతులు విధించారు. హమాస్ ఈ షరతులను యుద్ధంలో లొంగిపోవడంగా భావిస్తోంది. రెండు పక్షాల మధ్య అవిశ్వాసం తగ్గడం లేదు. మధ్యవర్తులు ఏ చర్చ జరిపినా చివరకు అదే స్తబ్ధతకు చేరుకుంటోంది. అంతర్జాతీయ న్యాయం, మానవతా చట్టాలు, సైనిక లక్ష్యాలు ఈ మూడూ వేర్వేరు దిశల్లో లాగుతున్నాయి. అందువల్ల సమగ్ర పరిష్కారానికి మార్గం కనిపించడం లేదు.

ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా ఈ మూడు దేశాలు శాంతి చర్చల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఏ పక్షాన్నీ పూర్తిగా సమర్థించకుండా సమతూకంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాయి. ఖతర్ ఇప్పటికే అనేక అనధికారిక చర్చలకు వేదికగా ఉంది. ఖతర్ ఈజిప్ట్ సమన్వయంతో కొంత పురోగతి కనిపించినా తుది ఒప్పందానికి అది చాలడం లేదు. తురకీయే, ఇరాన్ వంటి దేశాలు కూడా ఈ ప్రక్రియలో పాల్గొంటున్నాయి. అయితే వారి సొంత ప్రయోజనాలు కూడా చర్చల్లో ప్రతిఫలిస్తున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. యుద్ధవిరమణ కేవలం సైనిక నిర్ణయం కాదు.. అది రాజకీయ సాహసం. అన్ని పక్షాలు తమ అహాన్ని పక్కన పెట్టి మానవత్వాన్ని ముందు నిలిపితే మాత్రమే శాంతి సాధ్యం. ఒత్తిడి మార్గాలు, దౌత్య ప్రయత్నాలు రెండూ ఒంటరిగా పని చేయడం లేదని రుజువైంది. ఇప్పుడు అవసరం.. నిజమైన రాజనీతి, చిత్తశుద్ధి, మానవీయ దృక్పథం. అమెరికా, అరబ్ దేశాలు, ఐక్యరాజ్యసమితి, ప్రాంతీయ శక్తులు కలిసి సమన్వయంతో ముందుకు సాగితేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.

# వామపక్ష ఐక్యత : చారిత్రక ఆటంకాలు - వర్తమాన సవాళ్లు




భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి శతాబ్ద కాలపు ఘనమైన చరిత్ర ఉంది. కార్మికులు, రైతులు, విద్యార్థులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఈ ఎర్రజెండా సాగించిన పోరాటాలు సామాన్యమైనవి కావు. ఎందరో మహానుభావుల త్యాగాలు, రక్తాశ్రువుల మీదుగా నిర్మితమైన ఈ ఉద్యమం.. కాలక్రమంలో అనేక చీలికలు, సిద్ధాంతపరమైన ఘర్షణలను కూడా చవిచూసింది. నేడు భారత వామపక్ష రాజకీయాల్లో ప్రధానంగా మూడు ధోరణులు కనిపిస్తున్నాయి: ఒకటి సిపిఐ, రెండు సిపిఎం, మూడు సిపిఐ ఎంఎల్ వర్గాలు. ఈ మూడు ప్రవాహాలు 'మార్క్సిజం' అనే ఒకే తత్వశాస్త్రం ఆధారంగా పని చేస్తున్నప్పటికీ, నేటికీ పూర్తి ఐక్యత సాధ్యం కాలేదు. అసలు ఈ చారిత్రక విభజనకు కారణాలేమిటి..? వర్తమాన పరిస్థితుల్లో ఐక్యత సాధ్యమేనా..? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన అత్యంత కీలకమైన సమయం ఆసన్నమైంది.

**విభజనల నేపథ్యం - సిద్ధాంతాల ఘర్షణ**

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం (1920 లేదా 1925) గురించిన భిన్నాభిప్రాయాల నుండే భేదాలు మొదలయ్యాయి. స్వాతంత్ర్యానంతరం దేశ స్వభావం ఏమిటి..? నెహ్రూ నేతృత్వం లోని కాంగ్రెస్ పట్ల ఎలాంటి వైఖరి అవలంబించాలి..? భారత విప్లవ వ్యూహం ఎలా ఉండాలి..? పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనాలా, వద్దా..? అనే అంతర్గత చర్చలు చివరకు 1964లో పెద్ద చీలికకు దారితీసి సిపిఐ నుండి సిపిఎం ఆవిర్భవించింది. ?ఈ చారిత్రక చీలిక వెనుక మూడు ప్రధాన కారణాలుగా చూడొచ్చు.

ఒకటి అంతర్జాతీయ ప్రభావం : నాటి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం సోవియట్ యూనియన్ (రష్యా) పంథా, చైనా పంథాగా విడిపోయింది. సిపిఐ నాటి సోవియట్ వైఖరిని సమర్థించగా, సిపిఎం దానిని తీవ్రంగా విమర్శించింది. ?రెండోది రాజ్యం పై భిన్న విశ్లేషణ : భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉంటూ ప్రజల ప్రయోజనాల కోసం పోరాడవచ్చని సిపిఐ భావిస్తే.. ఇక్కడి రాజ్యాంగం పాలకవర్గాల ప్రయోజనాల కోసమే ఉందని, మరింత తీవ్రమైన ప్రజాపోరాటాలు అవసరమని సిపిఎం నమ్మింది. మూడోవది, ?నక్సల్‌బరీ ఊపు – ఎంఎల్ వర్గాల పుట్టుక : 1967లో పశ్చిమ బెంగాల్‌లోని 'నక్సల్‌బరీ' గ్రామంలో జరిగిన తిరుగుబాటు ఉద్యమంలో మరో కొత్త మలుపు వచ్చింది. కేవలం ఎన్నికల రాజకీయాల ద్వారా మార్పు సాధ్యం కాదని, సాయుధ పోరాటం ద్వారా 'గ్రామాలతో నగరాలను చుట్టుముట్టడమే' మార్గమని నమ్మిన విప్లవకారులు సిపిఐ (ఎంఎల్)గా అవతరించారు.

?ఆ విశ్లేషణే నేటికీ పెద్ద ఆటంకంగా ఉన్నాయని చెప్పవచ్చు. భారత సమాజ స్వభావంపై నేటికీ ఈ మూడు పార్టీలకూ భిన్నమైన అంచనాలు ఉన్నాయి. భారతదేశం పెట్టుబడిదారీ అభివృద్ధి దిశలో ఉందనేది సిపిఐ వాదన. పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడినా భూస్వామ్య అవశేషాలు ఇంకా ఉన్నాయనేది సిపిఎం విశ్లేషణ. అసలు దేశం ఇప్పటికీ 'అర్ధ సామంత, అర్ధ వలస' సమాజంగానే ఉందనేది సిపిఐ ఎంఎల్ వర్గాల నమ్మకం. సమాజ స్వభావాన్ని చూసే చూపులోనే తేడా ఉన్నప్పుడు, వారి పోరాట వ్యూహాలు కూడా భిన్నంగా ఉండడం సహజం. దీనికి తోడు దశాబ్దాలుగా పేరుకు పోయిన పరస్పర అవిశ్వాసం, ఒకరినొకరు 'సవరణవాదులు', 'అతివాదులు' అని విమర్శించుకోవడం సంస్థాగత సంస్కృతిలో భాగమైపోయింది.

**వర్తమాన సంక్షోభం - ముంచుకొస్తున్న సవాళ్లు**

గతాన్ని నెమరువేసుకోవడం ఎలా ఉన్నా, నేటి నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, శరవేగంగా పెరుగుతున్న కార్పొరేటీకరణ వామపక్షాల ముందు మునుపెన్నడూ లేని సవాళ్లను నిలిపాయి.

ఆర్థిక రంగంలో కాంట్రాక్టు వ్యవస్థ, గిగ్ ఎకానమీ పెరిగిపోవడం, నిరుద్యోగం, కార్మిక చట్టాల నిర్వీర్యం పాత తరహా ట్రేడ్ యూనియన్ పోరాటాలను దెబ్బతీశాయి. సామాజిక, రాజకీయ రంగాల్లో ఒకవైపు కుల వివక్ష, మహిళలపై హింస, ఆదివాసీల హక్కుల హరణ కొనసాగుతుండగానే.. మరోవైపు కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తులు చేతులు కలిపి దేశాన్ని శాసిస్తున్నాయి. ఒకప్పుడు కమ్యూనిస్టులకు బలంగా ఉన్న పశ్చిమ బెంగాల్, త్రిపుర చేజారిపోవడం, కేరళలో పరిమితమవ్వడం వామపక్షాల బలహీనతను సూచిస్తోంది. ప్రజలకు, శ్రమ సంస్కృతికి కమ్యూనిస్టులు కొంత దూరమవ్వడమే నేడు వారు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. ఇలాంటి ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్షాల మధ్య తక్షణమే 'పూర్తి విలీనం' సాధ్యం కాకపోవచ్చు. సిద్ధాంత భేదాలు, సంస్థాగత ప్రయోజనాలు అందుకు అడ్డురావచ్చు. కానీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా కింది అంశాలపై కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ఐక్యంగా పోరాడడం సాధ్యమే. గతాన్ని వీడి.. వర్తమానంలోకి రావాలనే ఆలోచన బలంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. 1960లలో జరిగిన చర్చల చుట్టూనే ఇంకా తిరగడం వల్ల ప్రయోజనం లేదు. గత చరిత్రలో ఇరుక్కుపోకుండా, నేటి తరం ఎదుర్కొంటున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, విద్యా రంగాల ప్రైవేటీకరణ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

ఇక మార్క్స్ – అంబేద్కర్ దృక్పథాల కలయిక అత్యంత కీలకమైన విస్మరించరాని అంశం. భారతదేశంలో వర్గ సమస్యతో పాటు కుల సమస్య అత్యంత ప్రధానమైనది. అందుకే బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను, మార్క్సిస్టు దృక్పథంతో కలిపి కార్యాచరణ రూపొందించాలి.కేవలం పైస్థాయి నాయకుల మధ్య ఒప్పందాల కంటే.. కార్మిక, రైతు, విద్యార్థి, మహిళా సంఘాలు క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయడం ద్వారానే అసలైన ఐక్యత బలపడుతుంది. గతంలో ఏ.బి. బర్ధన్ (సిపిఐ), పుచ్చలపల్లి సుందరయ్య (సిపిఎం), మద్దికాయల ఓంకార్ (ఎంసిపిఐ), సీతారాం ఏచూరి, తెలంగాణలో తమ్మినేని వీరభద్రం వంటి నాయకులు ఈ దిశగా గట్టి కృషి చేశారు. భారత వామపక్ష ఉద్యమం ముందున్న అసలు ప్రశ్న.. 1964లో ఎవరు సరైన వారు..? లేదా 1967లో ఎవరు తప్పు చేశారు..? అనేది కాదు. అసలైన ప్రశ్న ఒక్కటే, "నేటి భారతదేశంలో కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, దళితులు, ఆదివాసీలు, మహిళల సమస్యలపై వామపక్షాలన్నీ సమిష్టిగా ఒక ప్రత్యామ్నాయాన్ని చూపగలవా..?" ఈ ప్రశ్నకు సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్, ఇతర వామపక్ష శక్తులు కలిసికట్టుగా కార్యాచరణ ద్వారా సమాధానం చెప్పగలిగితే.. పార్టీల పూర్తి విలీనం జరగకపోయినా, భారతదేశంలో ఒక నూతన వామపక్ష పునరుజ్జీవనం ప్రారంభం కావడం ఖాయం..!



**- మాలోతు సాగర్**
సెల్ : 70138 05411

## జ్ఞాన బోధకులు!

జ్ఞానోదయం
బుద్ధం శరణం!
ధర్మం శరణం!
సంఘం శరణం!
చిన్నప్పటి నుంచి
వింటున్నమాటలే!
బుద్ధుడికి జ్ఞానోదయం
'గయ'లో రావిచెట్టు!
నేను 'గయ'వెళ్లాను
రావిచెట్టు వెతికాను
ఆ చెట్టు స్థానంలో
ఒక'స్తూపం'కట్టారు!
చుట్టూ రావిచెట్లు
చాలాఉన్నాయి!
రావిచెట్టుకి జ్ఞానానికి
సంబంధం ఏంటి?
అలాంటిదేమీలేదు!
దైవలీల కాదు!
రావిచెట్టు వల్ల
జ్ఞానం రాలేదు!

మానవసంబంధాల
పరిశీలనా దృష్టి!
తర్క వితర్కం నుండి
జ్ఞాన ప్రబోధం!

బుద్ధుడే కాదు
వేమన్న కూడా
సంఘపరిశీలనే
వినుర వేమా!
వేమన్న వైరాగ్యం
జ్ఞాన సంచయమే!
నిస్వార్థ దృష్టితో
విశ్వదాభిరామం!
వీళ్లిద్దరితర్వాత
చాలాకాలానికి
చెప్పినవాడు
కారల్ మార్క్స్!
భౌతికవాదం
హేతువాదం
మనుషులమధ్య
ఆర్థిక బంధాలు!
నిజాయితీ ఉండి
సంఘాన్ని చూపిన
జ్ఞాన ప్రబోధకులు
ఇంకా ఉన్నారు!

వీళ్లంతామనకు
సత్యమార్గం
జ్ఞానమార్గం
బోధించారు!

స్వార్థపరులు
బౌద్ధాన్నితరిమేసి
వేమన్నను
అటకెక్కించారు !

మార్క్స్ ను ఎక్కడా
ఒక్కచోట స్థిరంగా
ఉండనివ్వకుండా
దేశాలు తిప్పారు!
ఇప్పటికీ ఇంతే!
స్వార్థపరులు
పరిష్కారాన్ని
'మతం'లోచూస్తారు!
అబద్ధాలు చెప్పి
పబ్బంగడుపుతూ
రాజ్యకాంక్ష తో
రగిలిపోతుంటారు!
విముక్తి మార్గం
'వాళ్లు' చూపిస్తే
వీళ్లు ముక్తి రక్తి
మార్గంచూపిస్తారు!
జీవిస్తున్నలోకాన్ని
బాగుచేసుకోమని
వాళ్లు బోధిస్తే -వీళ్లు
పైలోకాలుచూపిస్తారు!
మానవులందరి
సంక్షేమమే
ఆనందమార్గం!
అదే జ్ఞానమార్గం!
ఆ మార్గమే శరణ్యం
బుద్ధుడు వేమన్న
మార్క్స్ మనకు
జ్ఞానబోధకులు!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# రోడ్డుకు ట్రంప్ పేరు కాదు... ప్రజాస్వామ్య విలువలకు గౌరవం కావాలి!

*తెలంగాణ స్వాభిమానంపై సామ్రాజ్యవాద నీడలు*

"చరిత్రను నిర్మించిన ప్రజల పేర్లు చెరిపేస్తూ, సామ్రాజ్యవాద నాయకుల పేర్లను ప్రతిష్ఠించడం స్వాభిమానం కాదు; అది రాజకీయ లొంగుబాటు." హైదరాబాద్ నగరంలో అమెరికా కాన్సులేట్ జనరల్ సమీపంలోని రోడ్డుకు అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న ప్రతిపాదన తీవ్ర చర్చకు దారితీసింది. ఇది కేవలం ఒక రోడ్డుకు పేరు పెట్టే పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదు. ఇది భారత విదేశాంగ విధానం, తెలంగాణ అస్థిత్వం, ప్రజాస్వామ్య విలువలు, సామ్రాజ్యవాద రాజకీయాల పట్ల అధికార వర్గాల దృక్పథాన్ని ప్రతిబింబించే రాజకీయ చర్య. ఒక రోడ్డుకు పేరు పెట్టడం అంటే కేవలం గుర్తింపు ఇవ్వడమే కాదు. అది ఒక చారిత్రక, రాజకీయ సందేశం. సమాజం ఎవరిని గౌరవిస్తోంది? ఎలాంటి విలువలను ఆదర్శంగా నిలుపుతోంది? అనే ప్రశ్నలకు అది జవాబు చెబుతుంది. ట్రంప్ పేరు పెట్టాలన్న నిర్ణయాన్ని కేవలం పరిపాలనా కోణంలో కాకుండా, విస్తృత రాజకీయ–సామాజిక కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ట్రంప్ ఎవరి ప్రతీక?

డోనాల్డ్ ట్రంప్ కేవలం అమెరికా మాజీ అధ్యక్షుడు కాదు. ప్రపంచవ్యాప్తంగా మితవాద జాతీయవాదం, మతోన్మాద రాజకీయాలు, వలసదారుల వ్యతిరేక ప్రచారం, కార్పొరేట్–సామ్రాజ్యవాద రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు. అమెరికాలో ట్రంప్ రాజకీయాల వల్ల జాతి విద్వేషాలు, ముస్లిం వ్యతిరేక ప్రచారం, వలసదారులపై దాడులు, ప్రజాస్వామ్య సంస్థలపై అనుమానాలు పెరిగాయి. 2021 జనవరి 6న అమెరికా క్యాపిటల్ భవనంపై జరిగిన దాడి కూడా ట్రంప్ రాజకీయాల చుట్టూ సాగిన ఉద్రిక్తతలతో ముడిపడి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులు ట్రంప్‌ను ఒక ప్రతికూల రాజకీయ ధోరణికి, మితవాద జాతీయవాదానికి, కార్పొరేట్–సామ్రాజ్యవాద రాజకీయాల ప్రతీకగా చూస్తుంటే, హైదరాబాద్ వంటి చారిత్రక నగరంలో ఆయన పేరును ప్రతిష్ఠించడం ఏ సందేశాన్ని ఇస్తుంది? ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నెల్సన్ మండేలా, చె గువేరా, హో చి మిన్, ఫిడెల్ కాస్ట్రో, భగత్‌సింగ్ వంటి విముక్తి యోధుల పేర్లను గౌరవప్రదంగా ఉచ్చరించేవారు. నేడు అదే ప్రజా స్థలాలు కార్పొరేట్ ప్రపంచానికి ప్రతినిధులుగా నిలిచిన రాజకీయ నాయకుల పేర్లతో నింపబడుతున్నాయి. ఇది కేవలం పేర్ల మార్పు కాదు; విలువల మార్పు.

**సామ్రాజ్యవాదానికి ప్రతీకల నిర్మాణమా?**

సామ్రాజ్యవాదం అనేది కేవలం ఒక దేశం మరో దేశాన్ని ఆక్రమించడం మాత్రమే కాదు. అది రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యాల సమాహారం. ప్రపంచ రాజకీయాల్లో అమెరికా ఇప్పటికీ ప్రధాన సామ్రాజ్యవాద శక్తిగా కొనసాగుతోంది. ఆర్థిక సంస్థలు, సైనిక కూటములు, అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థల ద్వారా ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతోంది. భారత పాలక వర్గాలు కూడా గత మూడు దశాబ్దాలుగా అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ట్రంప్ పేరును ఒక ప్రజా స్థలానికి ఇవ్వడం కేవలం మర్యాదపూర్వక చర్య కాదు. అది అమెరికా ఆధిపత్య రాజకీయాల పట్ల ఒక విధమైన రాజకీయ విధేయతను సూచించే ప్రమాదం ఉంది. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన రోడ్లు ప్రజల చరిత్రను ప్రతిబింబించాలి.

**హైదరాబాద్ చరిత్రను మర్చిపోతున్నామా?**

హైదరాబాద్ నగరం అనేక పోరాటాల, సంస్కృతుల, ప్రజా ఉద్యమాల చరిత్రను కలిగి ఉంది. ఈ నేలపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. ఈ నేలపై అమరవీరులు తమ ప్రాణాలను అర్పించారు. ఈ నేలపై దళిత, బహుజన, మహిళా, విద్యార్థి ఉద్యమాలు చరిత్ర సృష్టించాయి. అలాంటి నగరంలో పేరు పెట్టడానికి నాయకుల కొరత ఉందా? రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్, కాళోజీ నారాయణరావు, దాశరథి కృష్ణమాచార్య, కొమురం భీం, వీరనారి చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహనీయుల పేర్లు కాకుండా ట్రంప్ పేరు పెట్టాలనుకోవడం తెలంగాణ చరిత్ర పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. తెలంగాణ ఉద్యమం స్వాభిమానం కోసం జరిగింది. స్వయం నిర్ణయాధికారం కోసం జరిగింది. భారతదేశంలో కూడా ఇటీవలి కాలంలో చరిత్రను పునర్నిర్వచించే ప్రయత్నాలు పెరిగాయి. ప్రజా ఉద్యమాల నాయకులను మరుగునపెట్టి, అధికార వర్గాలకు అనుకూలమైన చరిత్రను నిర్మించే ప్రయత్నం జరుగుతోంది. హైదరాబాద్‌లో ట్రంప్ పేరును ప్రతిష్ఠించడం కూడా ఈ ధోరణిలో భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రజా స్థలాలకు పేర్లు పెట్టడం కూడా ఒక రాజకీయ ప్రక్రియ. ఈ చర్చను కేవలం "ట్రంప్ పేరు పెట్టాలా? వద్దా?" అనే స్థాయిలో పరిమితం చేయలేం. అసలు ప్రశ్న ఏమిటంటే... ప్రజాస్వామ్య సమాజంలో ప్రజా స్థలాలు ఎలాంటి విలువలను ప్రతిబింబించాలి? సామాజిక న్యాయమా? లౌకికతా? సమానత్వమా? ప్రజల పోరాటాల వారసత్వమా? లేక మతోన్మాదం, విద్వేష రాజకీయాలు, కార్పొరేట్ ఆధిపత్యానికి ప్రతీకలైన వ్యక్తుల పేర్లా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా కేవలం అంతర్జాతీయ సంబంధాల పేరుతో ఇలాంటి నిర్ణయాలను సమర్థించడం సరైంది కాదు.

తెలంగాణ ఉద్యమం మనకు ఒక గొప్ప పాఠం నేర్పింది. ప్రజలు సంఘటితమైతే చరిత్ర మారుతుందని, అణగారిన ప్రాంతాలు తమ హక్కులను సాధించగలవని నిరూపించింది. ఆ ఉద్యమంలో విద్యార్థులు ఉన్నారు. రైతులు ఉన్నారు. కార్మికులు ఉన్నారు. మహిళలు ఉన్నారు. దళితులు, ఆదివాసీలు, బహుజనులు ఉన్నారు. అలాంటి ఉద్యమ ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో ప్రజా స్థలాలు కూడా అదే ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించాలి. ట్రంప్ పేరును ప్రతిష్ఠించడం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి, స్వాభిమాన రాజకీయాలకు విరుద్ధం. తెలంగాణ అమరవీరులు తమ ప్రాణాలను అర్పించారు. సామ్రాజ్యవాద నేతల పేర్లను మన రోడ్లపై చూడటానికి కాదు. ప్రజల స్వాభిమానం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వయం ప్రతిపత్తి కోసం. హైదరాబాద్ ఒక ప్రపంచ నగరం కావచ్చు. కానీ అది ముందు తెలంగాణ ప్రజల నగరం. ఆ నగర వీధులు ఈ నేల చరిత్రను, ఈ నేల పోరాటాలను, ఈ నేల ప్రజల ఆశయాలను ప్రతిబింబించాలి.

చరిత్రను కొనుగోలు చేయలేరు. అధికారంతో గౌరవాన్ని ఆదేశించలేరు. ప్రజల హృదయాల్లో నిలిచేది వారి విముక్తి కోసం పోరాడిన వారే. హైదరాబాద్ భవిష్యత్తు ట్రంప్ పేరులో కాదు; తెలంగాణ ప్రజల పోరాట వారసత్వంలో ఉంది. అదే తెలంగాణ ఆత్మ. అదే ప్రజాస్వామ్య భారత భవిష్యత్తు.



**-మామిండ్ల రమేష్ రాజా**
రాష్ట్ర కార్యదర్శి,
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్
78932 30218

# ఊరు వెలివేసింది... నగరం ఒడిచ్చింది

ఒకరోజు శేఖర్ ఆఫీస్ ముందర ఒక పెద్ద కారు ఆగింది. అందు లోంచి శేఖర్ పుట్టిన ఊరి కొత్త సర్పంచ్, మరికొంతమంది ఊరి పెద్దలు దిగి లోపలికి వచ్చారు. వారిని చూడగానే పాత సర్పంచ్ చేసిన అవమానాలని గుర్తుకొచ్చాయి. కానీ శేఖర్ ఏమీ ఎరగనట్టు వారిని కూర్చోబెట్టాడు.

"శేఖర్ బాబూ... నువ్వు మన ఊరి బిడ్డవి. ఊరంతా నీ గురించే చెప్పుకుంటున్నారు. మన ఊరి హైస్కూల్ బిల్డింగ్ గోడలు కూలిపోయేటట్టు ఉన్నాయి. పిల్లలు చెట్ల కింద కూర్చుంటున్నారు. ఊరి బాగు కోసం నీ సహాయం కావాలి. ఒక హాస్పిటల్ కూడా కట్టించాలి బాబూ. పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలి కదా నాయనా! నీ బొడ్డు కోసిన ఊరు అది. నీ పేరు మీద పెద్ద శిలాఫలకం వేయిస్తాం" అన్నారు ఆశగా రశీదు పుస్తకం తీస్తూ.శేఖర్ ముఖంలో ఎటువంటి చలనం లేదు. కళ్లల్లో కోపం లేదు, అలాగని ఆనందమూ లేదు. కూర్చున్న కుర్చీలోంచి వెనక్కి జరిగి, చేతిలోని పెన్ను టేబుల్ మీద గట్టిగా పెట్టేసాడు. . చాలా ప్రశాంతంగా, అంతే గంభీరంగా అన్నాడు:"సారీ పెద్దలారా... నేను ఆ ఊరికి ఒక్క రూపాయి కూడా చందా ఇవ్వను! నేనెందుకు ఆ ఊరికి చందా ఇవ్వాలి చెప్పండి? పుట్టిన ఊరు కేవలం జన్మనిస్తుంది. కానీ నా పుట్టిన ఊరు నాకేమిచ్చింది? కేవలం పేదరికం, తండ్రి చేసిన అప్పులు, బంధువుల అవమానాలు తప్ప! నేను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకునే అర్హత కూడా లేదనే హీనస్థితిని ఇచ్చింది. నన్ను, నా తండ్రిని రచ్చబండ దగ్గర నిలబెట్టి ముఖం మీద ఉమ్మివేసి, కట్టుబట్టలతో ఊరి నుంచి వెళ్లగొట్టినప్పుడు మీ ఊరి రుణం ఏమైంది పెద్దలారా? నా బొడ్డు కోసిన ఊరు నన్ను కనీసం మనిషిగా కూడా చూడలేదు. నన్ను కులం పేరుతో వెలివేసినట్టు చూసింది. ఆ ఊరి పేరు తలచుకుంటే నే నా గుండె మండుతుంది.

" .. నా అసలైన ఊరు హైదరాబాద్! ఏ ఆధారం లేని నన్ను కడుపులో పెట్టుకుని పెంచింది. లక్ష్మమ్మగారి హోటల్‌లో ప్లేట్లు కడిగే స్థితి నుండి నా కాలి చిరిగిన స్లిప్పర్లను మార్చి, నన్ను లగ్జరీ కార్లలో తిరిగేలా చేసింది. తల దించుకుని వలస వచ్చిన నన్ను, సమాజంలో తలెత్తుకుని బతికేలా ఇంత వాణ్ణి చేసింది. ఎంతో మందికి పని కలిపించే స్ఆయికి ఎదిగాను. నా విజయాన్ని చూసి నా తమ్ముడు ప్రకాశ్ లాంటి తెలంగాణ తరం కూడా ఇవాళ విదేశాల వైపు చూడకుండా మన నగరంలోనే వ్యాపారాల్లో ఎదిగింది. నన్ను ఇంత వాణ్ణి చేసిన నా హైదరాబాదులోని పేద పిల్లల చదువులకే నా సంపాదనంతా ఇస్తా కానీ, నన్ను అవమానించిన ఊరికి చందా ఇచ్చే ప్రసక్తే లేదు. సారీ... మీరు రావచ్చు!"

శేఖర్ కరాఖండిగా చెప్పిన మాటలకు అక్కడ ఉన్నవారంతా మూగబోయారు. వారు తెచ్చిన రశీదు పుస్తకం చేతుల్లోనే వణికిపోయింది. సమాధానం చెప్పలేక తలదించుకుని వెనుతిరిగారు.

ఆఫీస్ కిటికీలోంచి విస్తరిస్తున్న హైదరాబాద్ నగరాన్ని చూస్తున్న శేఖర్ భుజం మీద ప్రకాశం నమ్మకంగా చేయి వేశాడు. నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు... నమ్ముకుని వచ్చిన ప్రతి ఒక్కరిని కన్నతల్లిలా ఆదరించే ఒక కల్పవృక్షం అని, అవమానించిన ఊరి కంటే బువ్వ పెట్టి ఆదరించిన నగరమే గొప్పదని ఆ క్షణాన అందరికీ అర్థమైంది.లేచి నిలబడ్డ వాల్లను కూర్చో బెట్టి మర్యాదలు చేసి అన్నాడు శేఖర్. " పెద్ద వారు మీరు. ఎంతో ఆశతో వచ్చారు. మిమ్మల్ని ఖాళీగా పంపడం మర్యాద కాదు. నాకు ఎవరి మీద కోపం లేదు. అంటూ యాభయి వేల రూపాయల కట్ట వారి చేతిలో వుంచి దండం పెట్టాడు శేఖర్. ఊరి పెద్దలు వెళ్ళిపోయిన తర్వాత కూడా ఆఫీస్ గదిలో ఒక రకమైన నిశ్శబ్దం అలుముకుంది. శేఖర్ ఏసీ గదిలో ఉన్నా, అతని మనసు మాత్రం ఆనాటి ఆ పాత ఎండలో, మండుతున్న రచ్చబండ దగ్గరే ఉండిపోయింది.

టేబుల్ మీద ఉన్న గ్లాసుతో నీళ్లు తాగి, కిటికీ వైపు నడిచాడు శేఖర్. బయట నగరం పరుగులు తీస్తోంది.' ' అంబర్‌పేట్ గల్లీల నుండి హైటెక్ సిటీ బిల్డింగుల దాకా ఈ నగరం ఎంత వేగంగా మారిపోయిందో! తన జీవితం కూడా అలాగే మారిపోయింది . ఈ నగరం చల్లని తల్లి. ఒక పచ్చటి మహావృక్షం అందరికీ నీడ నిస్తుంది.' అనుకున్నాడు శేఖర్.

బతుకు చెట్టు


ఇంట్లో కూర్చున్న ప్రకాశానికి వాళ్లమ్మ లక్ష్మమ్మ పెడుతున్న తిట్ల దీవెనలు... విదేశాల చదువు కోసం జరుగుతున్న గొడవ, గిన్నెల చప్పుడు.. మల్లా అమ్మ క్యాసెట్ వేసింది అని చెవులు మూసుకున్నాడు ప్రకాశ్. విసురుగా బయటకు నడిచాడు. మల్లెక్కడికిరా! అని తల్లి అరుస్తున్నా వినిపించుకోలేదు. లక్ష్మమ్మకు కొడుకును చూస్తే లోలోపల బాధగానే ఉంది. పెండ్లి చేస్తే ఏదో పని చేసుకొని పతక వచ్చు అని ఆశ. అందని దానికి నిచ్చెనలు వేయకూడదు అనేది ఆమె తత్వం. అది జీవితం నేర్పిన పాఠం. పల్లెటూరు నుండి ఈ సిటీకి బతుక వచ్చినపుడు ఎన్ని కష్టాలు అనుభవించారో అన్ని యాదికున్నయి. ఎక్కడో అందరితో పాటు రేకుల గుడిసె కున్నారు. " ఇది నీ పెండ్లమేనారా? లేపుక వచ్చినట్టు కనపడుతున్నది " అంటూ చూసే వాల్ల చెడ్డ చూపులకు విల విల వాడి పోయింది. ఆ గూండాలతో ఏ రాత్రి ఏం ముంచుక వస్తుందో అని భయంతో నిద్ర పట్టేది కాదు. చివరకు ఒక హోటల్ వ్యాపారంలో స్థిర పడ్డాక మనసు కుదుట పడ్డది. తమ లాగ సిటీకి వచ్చి ఆశ్రయం లేక అల్లాడే వాల్లను ఎందరినో చూసింది. చేతనైన సాయం చేసింది. బుక్కెడు బువ్వ కాస్త నిద్ర పోయే స్థలం ఇస్తే ఎందరో చల్లని తల్లి అని దీవించారు. అట్లా ఆశ్రయం పొందిన వాల్లలో శేఖర్ ఒకడు. లక్ష్మమ్మ కు శేఖర్ ఒక ఆశా కిరణంలా కనిపించాడు. ఫోన్ కలిపి చాలా సేపు మాట్లాడింది లక్ష్మమ్మ.

శేఖర్ ఇపుడు మంచి స్థితి మంతుడు. బిల్డర్‌గా మంచి పేరున్నది. శేఖర్ సిటీలో అడుగుపెట్టిన కొత్తలో ఎటు వెళ్లాలో తెలియలేదు. ఆకలికి కడుపు నకనకలాడుతోంది. అప్పుడే సికింద్రాబాద్ గల్లీలో లక్ష్మమ్మ నడుపుతున్న ఒక చిన్న హోటల్ కనిపించింది. హోటల్ ముందర నిలబడి ఆశగా లోపలికి చూస్తున్న శేఖర్‌ని చూసి లక్ష్మమ్మే పిలిచింది. "ఏం బాబు... ఎక్కడి నుంచి వస్తున్నావ్? అన్నం తింటావా?" అని అడిగింది."అమ్మ... నా దగ్గర పైసలు లేవు. ఆంధ్ర నుంచి వచ్చాను. ఏదైనా పని ఉంటే ఇవ్వండి అమ్మ. రాత్రి తిని, పడుకోవడానికి చోటు ఇస్తే చాలు" అన్నాడు శేఖర్ దీనంగా.

లక్ష్మమ్మ జాలిపడి హోటల్‌లో ప్లేట్లు కడిగే పని ఇచ్చింది. ప్రతిరోజూ వంద మంది తిన్న ప్లేట్లు కడుగుతున్నప్పుడు శేఖర్ మనసులో ఒకటే కసి రగిలేది. 'నన్ను అవమానించిన ఊరు చూస్తుండాలి... నేను జీవితంలో ఎదగాలి' అనుకునేవాడు. రాత్రి పూట హోటల్ టేబుళ్ల మీద పడుకుని నగరపు ఆకాశాన్ని చూస్తూ నిద్రపోయేవాడు.

ఆ తర్వాత ఒక బట్టల దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా చేరాడు. కస్టమర్లతో ఎలా మాట్లాడాలి, జనాల నమ్మకాన్ని ఎలా గెలవాలి అనేది అక్కడ నేర్చుకున్నాడు. ఎక్కడో ఒకచోట చిన్న జీతం వస్తే చాలనుకోలేదు శేఖర్. అతని కళ్లల్లో ఎదగాలనే జ్వాల ఉంది వై ఏళ్ల క్రితం పుట్టిన ఊరి వాతావరణం, ఆ పల్లెటూరి మనుషుల చూపులు గుర్తొస్తే ఇప్పటికీ శేఖర్ గుండె భారమవుతుంది. తండ్రి చేసిన వ్యవసాయం అప్పుల్లో మునిగిపోయింది. అప్పులిచ్చిన సావుకా ర్లు ఇంటి ముందర నిలబడి నానా మాటలు అంటుంటే, తల దించుకుని నిలబడటం తప్ప తాను ఏమీ చేయలేకపోయాడు. పేదరికం ఒకవైపు అయితే... గుండెల్లో దాచుకున్న ప్రేమ ఇంకోవైపు వాటంతట అవే కరిగిపోసాగాయి.

సర్పంచ్ కూతురు సుజాతను ప్రాణంగా ప్రేమి ంచాడు శేఖర్. అది కులాంతర ప్రేమ. ఒక రోజు రాత్రి ఊరి చివర చింతచెట్టు కింద సుజాత ఏడుస్తూ శేఖర్ చేతులు పట్టుకుంది." మా ఇంట్లో కులం పట్టింపులు ఎలా ఉంటాయో నీకు తెలుసు. నాన్న వేరే సంబంధాలు చూస్తున్నాడు. నాకు నువ్వు తప్ప ఎవరూ లేరు. నువ్వు వస్తానంటే నేను ఇప్పుడే ఈ కట్టుబట్టలతో నీతో వచ్చేస్తా. మనం టౌన్‌కి వెళ్లి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుందాం. నన్ను వదిలేయకు శేఖర్..." అంటూ సుజాత భోరున ఏడ్చింది. శేఖర్ ప్రాక్టికల్‌గా ఆలోచించాడు. అప్పటికే చాలా అవమానాలు ఎదుర్కొన్నాడు. . గుండెను రాయి చేసుకుని ఆమె వైపు చూశాడు.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# ఆధునిక డిజిటల్ స్టూడియో ప్రారంభించిన ఓయూ వీసీ

- ఈఎంఆర్సీలో 45 పరిశోధనా పత్రాల పుస్తకావిష్కరణ
- 11 స్వయం ఆన్‌లైన్ కోర్సుల పోస్టర్ల విడుదల



**సికింద్రాబాద్, జూన్ 21 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ ఎడ్యుకేషనల్ మీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్సీ)లో ఆధునిక సాంకేతికతతో నూతనంగా అభివృద్ధి చేసిన డిజిటల్ స్టూడియోను ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ (సీఈసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పరీక్షత్ సింగ్ మన్హాస్, యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జితేంద్ర కుమార్ త్రిపాఠితో కలిసి ఆయన స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా "రీఎన్విజనింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ డిజిటల్ ఎరా – టువర్డ్స్ వికసిత్ భారత్ 2047" పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాతీయ సదస్సులో ఎంపికైన 45 పరిశోధనా పత్రాలతో రూపొందించిన ఈ గ్రంథాన్ని పరిశోధకులకు అందజేశారు. అలాగే జూలై సెమిస్టర్‌లో సీఈసీ – ఈఎంఆర్సీ అందిస్తున్న 11 స్వయం ఆన్‌లైన్ కోర్సుల వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ కుమార్ మాట్లాడుతూ... డిజిటల్ రంగంలో ఈఎంఆర్సీ అందుబాటులోకి తీసుకొచ్చిన ఆధునిక సాంకేతిక వనరులను వినియోగించి నాణ్యమైన పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం ప్రారంభించిన 11 ఆన్‌లైన్ కోర్సులు యూజీ, పీజీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. అధ్యాపకులు సీఈసీ ప్రాజెక్టులను పొందుతూ మూక్స్ కోర్సుల రూపకల్పనలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈఎంఆర్సీ డైరెక్టర్ పి.రఘుపతి, డాక్టర్ కె.శ్రీరామ్ సంపాదకత్వంలో రూపొందించిన 45 పరిశోధనా పత్రాల గ్రంథం విద్యార్థులు, అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. సీఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పరీక్షత్ సింగ్ మన్హాస్ మాట్లాడుతూ.. దేశంలోని 20 ఈఎంఆర్సీలలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న కేంద్రాల్లో ఓయూ ఈఎంఆర్సీ ఒకటని ప్రశంసించారు. డిజిటల్ విద్యలో పరిశోధనలకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో 45 పరిశోధనా పత్రాలతో కూడిన సమగ్ర గ్రంథాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. పరిశోధనా ప్రాజెక్టులు, మూక్స్ రూపకల్పనలో ఓయూ ఈఎంఆర్సీకి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో ఓయూ ఈఎంఆర్సీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జితేంద్ర కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ... ఓయూ ఈఎంఆర్సీ పురోగతిని అభినందించారు. పరిశోధనా సంస్థలు మెరుగైన పనితీరు కనబరిస్తేనే నిధుల సంస్థలకు విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈఎంఆర్సీ భవన మరమ్మతుల కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు ఈఎంఆర్సీ డైరెక్టర్ పి. రఘుపతి ప్రగతి నివేదికను సమర్పిస్తూ సీఈసీ, యూజీసీ కేటాయించిన ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేసినట్లు తెలిపారు.

## వేద పాఠశాల, పేదల ఇళ్ల మంజూరుకు కృషి చేస్తా..

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 21 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలోని బసవేశ్వరనగర్‌లో గల వీరశైవ సమాజం కళ్యాణ మండపంలో ఆదివారం నూతన అధ్యక్ష, కార్యదర్శుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వేదపాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమాజ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. వీరశైవ సమాజం చేస్తున్న సేవలను కొనియాడుతూ, ఆ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ,ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు ,పంజాగుల శ్రీశైల్ రెడ్డి, వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షుడు గూళి పరమేశ్వర్‌స్వామి, అధ్యక్షుడు తంబాకు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు శెట్టి భాస్కర్, కార్యదర్శి వాలి శ్రవణ్‌కుమార్, సహాయ కార్యదర్శి ఆడ్కి శశాంక్, కోశాధికారి కందనెల్లి ప్రకాశంతో పాటు కార్యవర్గ సభ్యులు గణాపూర్ శంకర్, వాలి శాంత్‌కుమార్, లింగదల్లి రవికుమార్, మద్రిక చంద్రకాంత్, ఆబుళం సంపత్‌కుమార్, గద్ది కిరణ్‌కుమార్, సద్గీ భద్రప్ప, ఆర్. బసవరాజ్, బిబ్బిల్లి గౌరీశంకర్ , వీరశైవ సమాజం సభ్యులు, మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

- జూన్ 23న బంద్‌ను విజయవంతం చేయాలి
- ఎబివిపి తాండూరు నగర అధ్యక్షులు నర్సిములు



**తాండూరు, జూన్ 21 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఎబివిపి పిలుపు .నిచ్చారు.ఈ సందర్భంగా ఏబీవీపీ నగర అధ్యక్షులు నర్సిములు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ లాగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.రేష నాలైజేషన్ పేరుతో 23000 ప్రభుత్వ స్కూల్లో మూసివేతకు కుట్ర నిరసనగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో విద్య నిర్వీణ్యం అవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలలకు ఎత్తివేతకు కుట్ర చేస్తున్నారాని, రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నారు.ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీకి ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచి పరోక్షంగా వారికి సహకరిస్తుందని, ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడిని నియంత్రించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నవీన్ గౌడ్, అజయ్, మారుతి, మధు సుధన్ రెడ్డి, కార్తీక్, జాఫర్ పాల్గొన్నారు.

# మున్నూరు కాపులు ఐక్యతకు కృషి చేయాలి

- మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్



**శామీర్‌పేట, జూన్ 21 (జనం సాక్షి) :** రాజకీయాలకు అతీతంగా మున్నూరుకాపుల ఐక్యతకు అందరం కృషి చేద్దామని రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అలియా బాద్ చౌరస్తాలోని శుభం గార్డెన్స్ లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్నూరుకాపుల యువకమండలి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మున్నూరుకాపు రాష్ట్ర సంఘం అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ పటేల్, ఎన్నికల నిర్వహణ అధికారి ఆకుల సత్యనారాయణ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా కులాన్ని అభివృద్ధి చేసుకోవాలి.కుల ఐక్యత గురించి అందరం కృషి చేయాలి. గతంలో బి ఆర్ ఎస్ ఐదు ఎకరాలు భూమి ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా కార్పొరేషన్ కు 5 కోట్ల రూపాయలు ఇచ్చిందని అని తెలిపారు. పదవి ఇచ్చినప్పుడు మున్నూరుకాపుల ఆకాంక్షలను నెరవేర్చలసిన అవసరం ఉంటదనీ నాకు తెలుసు అందరం కలిస్తేనే అయితది కార్పొరేషన్ కోసం కుల పెద్దలు కృషి చేశారని గుర్తుచేశారు. అవసరం ఉన్నప్పుడు అందరం ఒకటి కావాలని కార్పొరేషన్ ఆఫీస్ ఏర్పాటు చేశాక అందరిని పిలిచి ఒక్క తాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తానని, అందరం ఎకతాటిపైకి రావాలని సూచించారు. కులం బలంగా ఉంటేనే రాజకీయ అవకాశాలు వస్తాయని ఏ కార్యక్రమం అయినా పెన్నుకు సంబంధించిన నాయకులు అన్ని కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళదామని అన్నారు. అనంతరం జిల్లా యువకమండలి అధ్యక్షుడుగా ఎన్నికైన ఆకుల యశ్వంత్ పటేల్, ప్రధాన కార్య దర్శిగా శ్రీనివాస్ పటేల్, ఉపాధ్యక్షులుగా బోగారం నరేష్ పటేల్, పూజారి మహేష్ పటేల్ తది తరులతోపాటు యువకమండలి సభ్యులకు నియామక పత్రం అందజేసిన మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఎన్నికల నిర్వహణ అధికారి ఆకుల సత్యనారాయణ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్ రావు పటేల్ లక్ష్మాపూర్ మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి 30వేల రూపాయలు విరాళం అంద జేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్, పెన్ నిర్వాహకులు పి ఎల్ ఎన్ పటేల్, బేతి శ్రీధర్ పటేల్, కాంగ్రెస్ నాయకులు తూము వినయ్ పటేల్, పెద్దలు ఆకుల రాజు పటేల్ , బుద్ది సత్తయ్య పటేల్ , రాజశేఖర్ పటేల్ , ఆకుల సురేష్ పటేల్, బిక్షపతి పటేల్, వివిధ మండలాల అధ్యక్షులు చిందం మహేందర్ పటేల్, వేల్పుల శ్రీనివాస్ పటేల్, కటికం రాజు పటేల్,జిల్లా కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్ పటేల్, వైల ఎల్లయ్య పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



**ఉప్పల్, జూన్ 21 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు ఫణీంద్ర నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల కష్టార్జిత సంపాదనను ఫీజుల రూపంలో దోచుకుంటున్నాయని విమర్శించారు. సాధారణ ట్యూషన్ ఫీజులతో పాటు డొనేషన్లు, ప్రత్యేక కోచింగ్ ఫీజులు, ఒలింపియాడ్ పరీక్షలు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా తదితర పేర్లతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక విధానం రూపొందించాలని, ఫీజుల వసూళ్లపై పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఉప్పల్ నియోజకవర్గంలో అనేక ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనివల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల అమలులో కూడా అనేక విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం ఆర్టీఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించి, ఉల్లంఘనలకు పాల్పడే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ, ఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం విచారకరమన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, అలాగే ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు.

## ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

- రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
- ప్రభుత్వ ఆస్పత్రి పేదోడి దేవాలయం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 21 (జనంసాక్షి) :** ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని మాతశిశు ఆస్పత్రిని మరియు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తనిఖీ చేశారు.అమ్మా ఆస్పత్రి ఎలా ఉంది? ట్రీట్మెంట్ బాగా అవుతోందా..? భోజనం పెడుతున్నారా..? ఏదైనా ఇబ్బంది ఉంటే నాకు చెప్పండని రోగులతో ఆత్మీయంగా ఎమ్మెల్యే పలకరించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి, రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని ఆరాతీశారు.ఏమైనా సమస్యలున్నాయా అని ఉద్యోగులను, నర్సులను, డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలి.డాక్టర్లు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ వినయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, వైస్ ఛైర్మన్ అబ్దుల్ రజాక్, డాక్టర్లు అనిల్, ఆనంద్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నేటి తరం యువత జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర విద్యావంతుల వేదిక కార్యదర్శి రవీందర్ గౌడ్



**బొంరాస్ పేట, జూన్ 21 (జనం సాక్షి) :** తెలంగాణ సిద్ధాంతకర్త మేధావి,ఉద్యమ స్ఫూర్తిదాత, ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఆవరణంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలోని విగ్రహాలకు తెలంగాణ రాష్ట్ర విద్యావంతుల వేదిక కార్యదర్శి రవీందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితమంత అంకితం చేశాడని,తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.నేటి తరం యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. తెలంగాణ అభ్యున్నతికి పాటు పడాలని జయశంకర్ సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీరేశలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్, కోశాధికారి గౌరారం గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్మికులకు కనీస వేతనం రూ.26 వెలు ఇవ్వాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ డిమాండ్




**చేవెళ్ల, జూన్ 21 (జనంసాక్షి) :** నాలుగు లేబర్ కోడ్ లనును రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వెలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గం లోని నాలుగు మండలాల ఏఐటీయూసీ మండల నిర్మాణ మహాసభలు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతనలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు హాజరై ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన నిర్మాణ మహాసభలలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు కొమ్ము కోస్తూ నాలుగు లేబర్ కోడులను తీసుకొని వచ్చి కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టాన్ని కలుగజేస్తున్నాయని, నాలుగు లెబరు కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇద్దరు గుజరాతీలు అమ్ముతూ ఉంటే, ఇద్దరు గుజరాతీలు కొనుకుంటున్నారని, కార్పొరేట్ శక్తులకు ఆదాని, అంబానీ ఆస్తులు పెంచడంలో మోడీ తీసుకొస్తున్న ఆర్థిక విధానాలే కారణమని దుయపట్టారు. నేటికీ 14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను కార్పొరేట్ శక్తులకు బ్యాంకు రుణాలు మాఫీ చేయడం ఎంతవరకు సమంజసమని, అదేవిధంగా దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయిందని అభివృద్ధి దిశగా పోతుంది అని మోడీ చెప్పిన మాటలకు పొంతన లేదని ఆర్థిక సర్వేలే సాక్షాలుగా నిలుస్తున్నాయని, ఇది వికసితభారత్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి డిమాండ్ చేశారు. అంతరం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కె రామస్వామి మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఈఎస్ఐ పీఎఫ్ ఉద్యోగ భద్రత గ్రాటివిటీ సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, అదేవిధంగా భవన నిర్మాణ రంగా కార్మికులు ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు తీసుకోవాలని లేబర్ అడ్డాల దగ్గర ఐదు రూపాయలకే భోజన వసతి కల్పించాలని, లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. చేవెళ్ల మండల ఏఐటీయూసీ అధ్యక్షులుగా బాబురావు, ప్రధాన కార్యదర్శిగా ఈ.కృష్ణ, షాబాద్ మండల ఏఐటియుసి అధ్యక్షులుగా నక్క జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, మొయినాబాద్ మండల ఏఐటీయూసీ అధ్యక్షులుగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, శంకర్పల్లి మండల ఏఐటీయూసీ అధ్యక్షులుగా బాబురావు, ప్రధాన కార్యదర్శిగా వి బ్రహ్మచారి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం.ప్రబులింగం, ఏం.సాబు, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్. బికేయంయు జిల్లా అధ్యక్షుడు జే.అంజయ్య, శంకర్పల్లి మండల పార్టీ కార్యదర్శి సుధీర్, ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్ల మంజుల. నారాయణ నియోజకవర్గ ఇన్చార్జి డప్పు శివయ్య, భవన నిర్మాణ రంగ కార్మికులు అనెక్స్ గ్లాస్ కంపెనీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ యోగా సాధన చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి) :** యోగాతో ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక దృఢత్వాన్ని సాధించగలరని.. కాబట్టి నిత్యం యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా మర్రికుంటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో యోగా శిక్షకురాలు సుగుణ సుమారు 40 నిమిషాల పాటు యోగా సాధన చేయించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అందరికీ "యోగా డే" శుభాకాంక్షలు తెలిపారు. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు రావడం మన దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. యోగా ఒక్కరోజు నిర్వహించి మానేసే కార్యక్రమం



కాదని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగా లేదా ఏదైనా శారీరక వ్యాయామాన్ని తప్పనిసరిగా భాగం చేసుకోవాలని సూచించారు. శారీరక దృఢత్వం ప్రతి ఒక్కరికీ అవసరమని, రాబోయే రోజుల్లో యోగాతో పాటు ఏదో ఒక ఫిజికల్ యాక్టివిటీని అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ యోగాను ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో కీలకమని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.

### నషా ముక్త్ భారత్ ఏర్పాటుకు ప్రతిజ్ఞ

నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో ఉమాదేవి, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, డీఎస్పీ గిరి ప్రసాద్, యోగ శిక్షకురాలు సుగుణ, జిల్లా రవాణా అధికారి, ఆయుష్ శాఖ అధికారులు వసుంధర , విశ్వశాంతి ప్రతినిధులు, గిరిజన పాఠశాల ప్రిన్సిపాల్ సరస్వతి, ఇతర జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్‌ను తూప్రాన్ రైల్వే స్టేషన్‌గా మార్చాలి

● ఎంపీ రఘునందన్ రావుకు వినతి



**తూప్రాన్, జూన్ 21 (జనం సాక్షి) :** బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ లో ఆన్లైన్ కౌంటర్ చేయాలని బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ ను తూప్రాన్ రైల్వే స్టేషన్గా పేరు మార్చాలని ఎంపీ ప్రత్యేక నిధులతో సహకరించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు నర్సాపురం నుండి వెంకటాపురం వచ్చే దారిని ప్రధానమంత్రి యువజన సడక్ రోడ్డు పేర నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జానకిరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నె వినోద్ కుమార్ గౌడ్



**సంగారెడ్డి, జూన్ 21 (జనం సాక్షి) :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను బలవంతంగా విక్రయించడం వంటి అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నె వినోద్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ), జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓ)కు ఫిర్యాదులు చేసి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. అలాగే మండల, జిల్లా స్థాయి ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సంఘాల అధ్యక్షులు కూడా సహకరించాలని కోరారు. జిల్లాలోని ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థను సందర్శించి సమస్యలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నాయికోటి రాజు, సంతోష్ ముదిరాజ్, లక్ష్మణ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**మెదక్, జూన్ 21 (జనంసాక్షి) :** ఆదివారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య జ్ఞానేశ్వర్ , డిసిహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, ఆయుష్ విభాగం మోహన్ రెడ్డి , జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ,విశిష్ట యోగ గురువు ఆకుల రవి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ ప్రతిమాసింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో,జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ ఇన్చార్జి.అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డీవో రమాదేవి లు స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందనిఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో ముందుకు సాగాలన్నారు మా నవ శక్తులన్నింటినీ ఏకం చేసే ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ అని పిలుపునిచ్చారు. యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ" అని పేర్కొన్నారు. అనంతరం యోగాలో పాల్గొన్న ఆయుష్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, క్రీడాకారులు క్రీడాభిమానులతో కలెక్టర్ ఫోటో సెషన్ లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు,



విశిష్ట యోగ ఇన్స్ట్రక్టర్ దేవేందర్ రెడ్డి, పిడి ఆనందం , నరసింహులు , కొండల్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు , వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళాలు, స్వచ్ఛంద సంస్థలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో నీట్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

● పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ

**గద్వాల నడిగడ్డ, జూన్ 21 (జనం సాక్షి) :** నీట్ పరీక్షల సందర్భంగా గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను, అక్కడి భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణకు నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు భద్రతను కల్పించినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ 163 అమలులో ఉంటుందన్నారు. పరీక్షా సామాగ్రి, ప్రశ్నాపత్రాల తరలింపులో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా



ఉండేందుకు ముందస్తుగా ప్రత్యేక ట్రాఫిక్ చర్యలు తీసుకుని, అదనపు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పోలీసులు అన్ని చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల సి ఐ టంగుటూరి శ్రీను, ఇతర పోలీస్ అధికారులు, పరీక్ష నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

## విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూన్ 21 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో విత్తన మేళాలను నిర్వహిస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రెండు రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలలో సంబంధిత విత్తన ఆధీకృత డీలర్లు వివిధ రకాల విత్తనాలను విక్రయించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వము బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యూజిఎల్ 44 రకాల వరి విత్తనాలకు మాత్రమే బోనస్ చెల్లించడం జరుగుతుందని, రైతులు ఈ రకాలను మాత్రమే కొనుగోలు చేసేందుకు మేళాలో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. వీటితోపాటు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పత్తి, మిరప, వివిధ రకాల కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీలను సరసమైన ధరలకే విక్రయించడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్నదాతలకు తమ పరిధిలోని రైతు



వేదికల్లో నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడమే ఈ మేళాల ప్రధాన ఉద్దేశమన్నారు. మేళాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తారన్నారు. ఈ మేళాలలో ఆయా గ్రామాల సర్పంచులు, అభ్యుదయ రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని, రైతులకు సహకరించి విజయవంతం చేయాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

● రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య

**సంగారెడ్డి, జూన్ 21 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని , 8 ,9 జీవోను రద్దు చేయించి పాత జీవోను పునరుద్ధించాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు ఆదివారం సంగారెడ్డి పట్టణంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభు గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను పూర్తిగా అన్యాయం చేసే విధంగా వివరిస్తుందని ఆయన మనిపడ్డారు , ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి



వచ్చిన తర్వాత ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను రద్దు చేయాలని యోచనలో ఉందని అన్నారు జీవో నెంబర్ 8, 9 జీవోలను తీసుకొచ్చి బకాయిలను పూర్తిగా రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని అన్నారు పాత జీవోను పునరుద్ధరించి, రియంబర్స్మెంట్ బకాలను చెల్లించాలని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం లో బీసీలకు ఆరు మంత్రి పదవులు ఇచ్చారని ఆయన పూర్తి చేశారు కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలైన రెడ్డిలకు ఆదుకోవాలని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. రాష్ట్రంలో పాత పాఠశాలలు మూసి వేయకుండా, నూతన ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రభుత్వం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ బీసీల సమస్యలను పరిష్కరించకపోతే జూలై 1 నుండి ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పి ప్రభు గౌడ్, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాన్ని శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ శేఖర్ శ్రీధర్ మహేందర్, మహిళ నాయకురాలు ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

## యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం



**జడ్చర్ల, జూన్ 21 (జనంసాక్షి) :** యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల స్టేడియం గ్రౌండ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొని యోగా సాధన చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీసాయి నగర్ సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ



**రామచంద్రాపురం, జూన్ 21 (జనం సాక్షి) :** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం కాలనీలో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి ఆలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు కేటాయించిన స్థలాల విషయంలో వివాదాలు తలెత్తడంతో పనులు నిలిచిపోయినట్లు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత వ్యక్తులు, అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, నాయకులు పరమేష్, ఐలేష్, ప్రమోద్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు వీర్‌శెట్టి, మాజీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగతో క్రమశిక్షణతో కూడిన జీవన విధానం

● యోగ నిత్యజీవితంలో ఒక భాగంగా కావాలి
● పిలుపునిచ్చిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
● ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం

**గద్వాల నడిగడ్డ, జూన్ 21 (జనం సాక్షి) :** ప్రతిరోజు యోగ సాధన చేస్తే క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుందని, ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో యోగ ఒక భాగం కావాలని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవంను పురస్కరించుకొని ఆయుష్ ఆధ్వర్యంలో, జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్, పతంజలి యోగ సమితి సహకారంతో గద్వాల ఇండోర్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిరంతర యోగ సాధనతో ఉత్సాహంగా ఉంటామని, ఏ పని తలపెట్టిన విజయవంతం అవుతుందని తెలిపారు. ఏ వృత్తిలో ఉన్న వారైనా నిత్యం యోగసనాలు చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు దృఢంగా ఉండడానికి కారణం వారు క్రమం తప్పకుండా ఎక్సర్సైజ్, యోగ, ధ్యానం సాధన చేస్తారని




పేర్కొన్నారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకొని నిరంతరం వ్యాయామం చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా మారతారని, ఫలితంగా చదువులో చురుకుదనం పెరుగుతుందన్నారు. యోగ గొప్పతనం గురించి ఎంత చెప్పినా తక్కువేనని పేర్కొంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలందరికీ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రపంచానికి యోగ ప్రాముఖ్యత తెలిసేలా ఐక్యరాజ్య సమితి ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం జరుపుకునేందుకు గుర్తించిందన్నారు. మన దేశం ప్రపంచానికి అందించిన గొప్ప కానుక యోగ అని, యోగ వలన కలిగే లాభాలు తెలుసుకొని ప్రతి ఒక్కరూ నిరంతరం సాధన చేయాలని సూచించారు. యోగతో మనసుకు, శరీరానికి దృఢమైన బంధం ఏర్పడుతుందని ఒత్తిడి లేని జీవన విధానం అలవడుతుందన్నారు. సామరస్యంతో జీవించడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలతో కలిసి ముఖ్య అతిథులు పలు యోగసనాలు చేశారు. అనంతరం పలువురు విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణ ప్రత్యేక ఆసనాలతో అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, ఎస్ జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఆయుష్ మెడికల్ అధికారి క్రాంతి కుమారి, స్టేడియం ఇన్చార్జి బషీర్ అహ్మద్, యోగ శిక్షకులు దేవదాస్, మధుగోపాల్, శ్వేత, వేణు, విశ్రాంత పిడి ప్రభాకర్, పలువురు కౌన్సిలర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యకరమైన జీవనం

▫ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా అని, ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని భూపాలపల్లి గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. 12వ అంతర్జాతీయ యోగాదినోత్సవం 2026 సందర్భంగా ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్ లో యోగా ఫర్ హెల్దీ ఏజింగ్ అనే ఇతివృత్తంతో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ఎఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యోగ ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరంతర యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, ఆరోగ్య, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి తోడ్పడుతుందని అన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నరేష్ కుమార్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు. వయోభేదం లేకుండా అన్ని వయస్సుల వారు యోగా సాధన చేయాలని సూచించారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డా. రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఆయుష్ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం, హోమియోపతి తదితర వైద్య సేవల ప్రాముఖ్యతను వివరించారు. యోగాను ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. అనంతరం యోగా గురువు కుమార్ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను చేయిస్తూ, ప్రతి ఆసనం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డా. కె. కృష్ణవేణి, మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, కొడవటంచ, కన్వీనర్ డా. ప్రేమ్ సాగర్, డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డా. జగదీష్ ఖన్నా, డా. సదానందం, డా. అజయ్ తదితర ఆయుష్ వైద్యులు, యోగా గురువులు, ఆయుష్ సిబ్బంది, అడ్వకేట్ మాతంగి రమేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యువత నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

▫ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 21(జనంసాక్షి):** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నాడు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. జిల్లా అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు యోగా సాధకులతో కలిసి కలెక్టర్ హరిత యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయస్సు అనేది శరీరానికి సంబంధించింది కాదని, అది మనిషి యొక్క మనస్సుకు సంబంధించినదని పేర్కొన్నారు. ఏదైనా ఒక పనిని అసలు ప్రయత్నించకుండానే వదిలేయడం ముసలితనానికి సంకేతమని, శారీరక దృఢత్వం లేకపోయినా కనీసం యోగా చేయడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని అన్నారు. మీరు ఎంత పెద్ద చదువులు చదివినా, రేపు డాక్టర్లు అయినా మీ ఆరోగ్యం బాగుండకపోతే సమాజానికి సేవ చేయలేరు అని,మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవడమే మనం దేశానికి చేసే అతిపెద్ద సేవ అని కలెక్టర్ అన్నారు. యోగా వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. యోగా మాస్టర్ చెప్పిన ఆసనాలన్నీ పూర్తిగా చేయలేకపోయినా, అందులో కొన్నింటినైనా రోజూ సాధన చేయాలని కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఈ వేడుకల్లో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్ వైస్ చైర్మన్ ఎండి హైమద్ యోగా ఆచార్యులు అశోక్ ఆచార్య, కళాశాల ప్రిన్సిపాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు

▫ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట (జనంసాక్షి) :** రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం దౌడేపల్లి (చందారం) లో చందారం గ్రామ రైతు పొదుపు, పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ విత్తన ఉత్పత్తి – విత్తన శుద్ధి కేంద్రాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని రైతుల కొరకు విత్తన ఉత్పత్తి – విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందు కొరకు అవసరమైన మెటీరియల్, ఎక్విప్మెంట్ సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా 12 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవసరమైన లారీలను సమకూర్చడం జరిగిందని, సింగరేణి సంస్థ, ఇసుక తరలింపు సంబంధిత లారీలను ధాన్యం కొరకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. వర్షాలు రాకముందే ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలో చెల్లింపులు చేయడం జరిగిందని, దాదాపు 98 శాతం ధాన్యం కొనుగోలు సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల నమోదు ప్రక్రియ చేపట్టడం జరిగిందని, రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆధార్ లింకేజీ ద్వారా యూరియా, విత్తనాలు, ధాన్యం విక్రయ బుకింగ్ చేయడం జరుగుతుందని, సాదా బైనమా దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అధికారుల సమన్వయంతో సర్వే ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఆధార్, భూధార్ ప్రక్రియ పరిశీలన పకడ్బందీగా చేపట్టే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పంట సాగులో రైతులు లబ్ది పొందే విధంగా పంట మార్పిడి విధానం, సాగు మెలకువలు, లాభాలు, భూసారం పరిరక్షణ, నానో యూరియా వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు తో పాటు దాదాపు 22 వేల టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 452 కోట్ల చెల్లింపులు కాగా మంచిర్యాల నియోజకవర్గంలో దాదాపు 270 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. ఈసారి ఐ.కె.పి. వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం కొనుగోలు కేంద్రాలు ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. కడెం కాలువ 42వ డిస్ట్రిబ్యూటరీ నుండి నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు.

# వరద నీరు ఎటు పోవాలి..!

▫ ప్రతి ఏటా మునుగుతున్న కాలనీలు
▫ అవస్థలు పడుతున్న ప్రజలు
▫ ఇది ఉరుసు బైపాస్ రోడ్డు దుస్థితి
▫ అధికారులు పట్టించుకోవాలంటున్న కాలనీవాసులు



**వరంగల్ ఈస్ట్, జూన్ 21 (జనం సాక్షి) :** ఏండ్లు గడుస్తున్నాయి.. కాలాలు వస్తున్నాయి పోతున్నాయి. కానీ సరైన ప్రాథమిక మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఇక్కడి ప్రజలు, రహదారి నుండి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. ఇదంతా అధికారులకు తెలుసు, ప్రజాప్రతినిధులకు తెలుసు కానీ వారు ఎవ్వరు పట్టించుకోరు. అప్పటికప్పుడు తాత్కాలికమైనటువంటి సేవలందించి చేతులు దులుపుకోవడం తప్ప చేసింది ఏమీ లేదు. వరంగల్ నగరంలోని 42వ డివిజన్ ఆర్టిఏ జంక్షన్ నుండి ఉరుసు బైపాస్ రోడ్డు వెళ్లే దారిలో వరద నీరు వల్ల కలిగే ఇబ్బందులను సంబంధిత మున్సిపల్ అధికారులు పరిశీలించాలని, ఈ విషయంలో గతంలో జరిగిన ఇబ్బందులను గమనిస్తూ ఈసారి అలాంటి ఇబ్బందులు సమస్యలు రాకుండా ఉండేందుకు కళ్ళు తెరవాలని స్థానిక కాలనీవాసులు, పలువురు వ్యాపారస్తులు కూడా డిమాండ్ చేస్తున్నారు. రంగసాయపేటలోని, తెలంగాణ కాలనీ, లెనిన్ నగర్, సాయి నగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, వాటర్ ట్యాంక్ మొదలైన ప్రాంతాల నుండి వర్షాకాలంలో వరద నీరు ఉరుసు బైపాస్ రోడ్డుకు చేరి తీవ్ర అంతరాయానికి గురి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా రోడ్డు పక్కన బాక్స్ డ్రెయిన్ లేదా కచ్చా కాలువ నిర్మించాలని అలా ఉన్నప్పుడే నీరు ఎక్కడ నిలవకుండా కాలువ ద్వారా సునాయాసంగా వెళ్ళిపోతుందంటున్నారు. కానీ కొందరు డ్రైన్ నిర్మించకుండా చిన్నచిన్న పైప్ లైన్లు వేసి తమకు వెళ్లేందుకు దారి చేసుకోవడం వల్ల వరద ఉధృతి వల్ల ఎక్కువ నీళ్లు నిలిచిపోయి ఇండ్లలోకి వస్తున్నాయన్నారు. దీనివల్ల ఉరుసు బైపాస్ రోడ్డు పూర్తిగా జలమయమై తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సమస్యను గత ఏడాది వర్షాకాలంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇతర అధికారులు స్వయంగా పరిశీలించినట్లు గుర్తు చేశారు. ఈ సమస్యపై సంబంధిత మున్సిపల్ అధికారులకు గతంలో విన్నవించామని అయినా కూడా ఈ ఏడాది కూడా ఆ సమస్య అలాగే ఉందని స్థానిక గృహవాసులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద నీరు, రోజువారి వాడుకునే నీరు ఉరుసు బైపాస్ రోడ్డు నుండి ఉరుసు గుట్ట వైపు మోరీ ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వరంగల్‌లో నీట్ ఎగ్జామ్ ప్రశాంతం





**వరంగల్ ప్రతినిధి, జూన్ 21 (జనంసాక్షి):** వరంగల్ జిల్లాలోని సీకేఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన నీట్--2026 (జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. ఆదివారం నగరంలో నిర్వహించిన నీట్ పరీక్షకు మొత్తం 480 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 431 మంది విద్యార్థులు హాజరయ్యారని, 49 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ పరీక్షను పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో పరీక్ష విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## హనుమకొండ లో ప్రశాంతంగా నీట్ పరీక్షల నిర్వహణ

**హనుమకొండ ప్రతినిధి జూన్ 21 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 4,196 మంది అభ్యర్థులకుగాను 3764 మంది హాజరయ్యారు. 432 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కాగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పరీక్ష కేంద్రానికి ఎంతమంది అభ్యర్థులకు గాను ఎంతమంది హాజరయ్యారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సాఫీగా పూర్తి కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, పోలీస్ సిబ్బంది కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రెడ్డి కార్పొరేషన్ హక్కులకై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

▫ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి



**దుగ్గొండి, జూన్ 21 (జనం సాక్షి):** ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కులస్తుల హక్కులు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని ఉద్యమించాలని, రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామ రెడ్డి పరస్పర సహకార సంఘం 19వ వార్షిక మహాసభ నరహరి రాజ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా రెడ్డి ప్రతినిధులు110 మంది సంఘ సభ్యులు హాజరైనారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి మాట్లాడుతు నిరుపేద రెడ్లు వారి హక్కులకొరకు ఉద్యమించలని ఐక్యతతో ఉండి సంక్షేమంతో పాటు మన సమస్యలు మనమే పరిష్కరించుకోవలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న రెడ్డి కార్పొరేషన్ పాలక వర్గానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చెపట్టమని రెడ్డి బిడ్డలు సమాయత్తం కావలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం పాలక వర్గంతో పాటు నర్సంపేట సంక్షేమ సంఘం అధ్యక్షులు కంది గోపాల్ రెడ్డి, ఎర్ర యాకుబ్ రెడ్డి, బొమ్మనపెల్లి కేశవరెడ్డి, గణకులు స్వప్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల మధ్య గొడవ

## భార్యకి తీవ్ర గాయాలు

**చెన్నారావుపేట, జూన్ 21 (జనం సాక్షి) :** మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన బరిగల రమేష్, స్వప్న దంపతులు ఇరువురు గొడవపడ్డారు.డబ్బుల విషయంలో ఇద్దరికి గొడవ కాగా భర్త రమేష్ భార్య స్వప్న పై చేయి చేసుకున్నాడు. దీంతో భార్య స్వప్నకు తీవ్రంగా దెబ్బలు తగలడంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా పైలట్ చల్ల రాజు, ఈఎంటి ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని బరిగల స్వప్నను 108 వాహనంలో చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై నియంత్రణ

▫ కలెక్టర్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ వినతి
▫ డీఈవోకు ఆదేశాలు జారీ



**ములుగు ప్రతినిధి, జూన్ 21(జనంసాక్షి) :** ములుగు జిల్లా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలు ఫీజుల వసూళ్లు, విద్యాహక్కు చట్టం ఉల్లంఘనలపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌జీఓ) తీవ్రంగా స్పందించింది. శనివారం జిల్లా కలెక్టర్ హేమంత్ భోర్ఖడే ను కలిసి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల నియంత్రణ పాటించడం లేదని, పేద విద్యార్థులకు 25% సీట్లు కేటాయించడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టడం లేదని, తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం 2009, తెలంగాణ విద్యా చట్టం 1982 నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ హేమంత్ భోర్ఖడే తక్షణమే స్పందించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు పారదర్శకంగా ప్రదర్శించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)కి ఆదేశాలు జారీ చేశారు. పేరెంట్ కమిటీలతో సమావేశాలు నిర్వహించి ఫీజులు నిర్ణయించాలని, 25% సీట్లను పేద పిల్లలకు తప్పనిసరిగా కేటాయించాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగపురి శ్రీకాంత్ గౌడ్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం కలెక్టర్‌ను కలిసింది. నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు ములుగు జిల్లా అధ్యక్షుడు నద్దునూరి రమేష్, భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం బిక్షపతి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి బొచ్చు అశోక్, గోవిందరావుపేట మండలం ఎన్ హెచ్ ఆర్ సి మండల అధ్యక్షుడు కళ్లెం రవీందర్ రెడ్డి, వెంకటాపూర్ మండలం రామప్ప మామిడి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ వ్యవహారంలో అడ్డుగా ఉన్నాడని హత్య

▫ ఆరుగురు నిందితుల అరెస్ట్ రిమాండ్
▫ సహకరించిన స్నేహితులపై హత్య కేసు నమోదు.
▫ ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే



**నెరడిగొండ జూన్21 (జనంసాక్షి):** ప్రేమ వ్యవహారంలో ఆరు గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని కుమారి గ్రామ నివాసి షేక్ సుమేర్ (24), నేరడిగొండకు చెందిన గంగాధరి సాయి కృష్ణ (23), కుప్తి గ్రామానికి చెందిన బొజ్జ విష్ణువర్ధన్ (22), బోథ్ గ్రామం ఇస్లాంపురా కాలనీ నివాసి షేక్ అక్రమ్ (22), బోథ్ గ్రామం సాయినగర్ కాలనీకి చెందిన అబ్దుల్ నెహెఫ్ (19), ఇదే కాలనీకి చెందిన సయ్యద్ నోమాన్ (19)లను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్ పేర్కొన్నారు. ఆదివారం ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నేరడిగొండ మండలం పెద్దబుగ్గారం గ్రామానికి చెందిన నాతరి సతీష్ (23), ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు,జూన్ 17న కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మొదట నేరడిగొండ పోలీస్ స్టేషన్ నందు మిస్సింగ్ కేసు నమోదు చేయగా,జూన్ 19న కరాత్‌వాడ చెరువులో మృతదేహం లభ్యమవడంతో కేసును హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్ తెలిపారు. దర్యాప్తులో 48 గంటల్లోనే కేసును ఛేదించి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని,ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమని వెలుగులోకి వచ్చింది.ప్రధాన నిందితుడు ఏ1 షేక్ సుమేర్ తన ప్రేమకు అడ్డు వస్తున్నాడనే కక్షతో మృతుడు సతీష్‌ను తన సహచరులతో కలిసి మద్యం పార్టీ పేరుతో కరాత్‌వాడ చెరువు వద్దకు పిలిపించి,బలవంతంగా మద్యం తాగించి అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులు శవాన్ని చెరువులో పడవేసి, మృతుడి బైక్‌ను ఆదిలాబాద్‌కు తరలించగా, మొబైల్ ఫోన్‌ను రైలులో పడవేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ప్రత్యేక బృందాల సహాయంతో కేసును ఛేదించి మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుండి 5 మొబైల్ ఫోన్లు,నేరానికి ఉపయోగించిన 2 ద్విచక్ర వాహనాలు,మృతుడి ద్విచక్ర వాహనం, సంఘటన స్థలంలో లభించిన 7 ఖాళీ బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మృతుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని తెలిసి నేరానికి పాల్పడినందున నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) సంబంధిత సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ (దౌర్జన్యాల నిరోధక) చట్టం సెక్షన్ 3(2)(వి) కింద కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

# కుంటాల అభివృద్ధికి రూ. 66 లక్షల నిధులు మంజూరు



**కుంటాల, జూన్ 21 (జనంసాక్షి) :** కుంటాల మండల కేంద్రంలో ప్రధాన కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ అవసరాన్ని కుంటాల సర్పంచ్ జక్కుల గజేందర్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అభ్యర్థన మేరకు, మండల కేంద్రానికి రూ. 66 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీని కుంటాల సర్పంచ్ జక్కుల గజేందర్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కుల గజేందర్ ఎమ్మెల్యే పవార్ రామారావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం
22 జూన్ 2026

## కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**కరీంనగర్ అర్బన్, జూన్ 21 (జనంసాక్షి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం రోజు యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రత్యేకతను వివరిస్తూ, ప్రస్తుత కాలంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా మనసుకు ప్రశాంతత, శరీరానికి దృఢత్వం లభిస్తాయని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది అందరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని, ప్రజల్లో ఆరోగ్యం పై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవి కుమార్, డాక్టర్ లోకేష్ (ఫిజీషియన్), ఆచార్య బి. రామకృష్ణ గౌడ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హెచ్ఆర్ ఈశ్వర్, దాసరి చంద్రశేఖర్, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ బస్సులో మంటలు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులు సురక్షితం



**తిమ్మాపూర్, జూన్ 21 (జనంసాక్షి) :** కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది.షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది.వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను దించేయడంతో పెను ప్రమాదం తప్పింది.ప్రయాణికులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ 2వ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు కరీంనగర్ నుండి హైదరాబాద్‌కు 40 మంది ప్రయాణికులతో బయల్దేరింది.బస్సు అల్గునూర్ శివారులో కి రాగానే షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. వెంటనే గమనించి డ్రైవర్ ప్రశాంత్ అప్రమత్తమై బస్సును రోడ్డు ప్రక్కన ఆపేసి బస్సు డోర్‌తో పాటుగా ఎమర్జెన్సీ డోర్ ని ఓపెన్ చేసి ప్రయాణికులను దింపేశారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపిన తర్వాత బస్సులోని అగ్నిమాపక పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పేందుకు డ్రైవర్ ప్రయ్నతించారు.కానీ అప్పటికే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో అదుపులోకి రాలేదు.దీంతో ఐదు నిమిషాల్లో బస్సు మొత్తానికి మంటలు వ్యాపించాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధం అయింది.అయితే ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## రాజన్న ఆలయ ఈవోపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 21 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయ ఈవో తో పాటు ఆలయ సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కేసు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర మోచీ సంఘం అధ్యక్షుడు కొండ్లెపు ముత్యం జాతీయ ఎస్సీ కమిషను కు ఆదివారం ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. భీమేశ్వర ఆలయం ఎదురుగా కొబ్బరికాయల దుకాణం నిర్వహిస్తున్న తనను గత నెల రోజులుగా దుకాణం తొలగించాలని ఆలయ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. జూన్ 18 న ఆలయ ఈవో ఆదేశాలతో సుమారు 30 మంది ఆలయ సిబ్బంది తన దుకాణం వద్దకు వచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు.తనను కులం పేరుతో దూషించడంతో పాటు అవమానించారని,అనుమతి లేకుండా దుకాణంలోకి ప్రవేశించి తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని ముత్యం ఫిర్యాదులో పేర్కొన్నారు. వారందరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ ఘటనపై ఇప్పటికే వేములవాడ పట్టణ సీఐ, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి,జిల్లా ఎస్పీలకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటన సమయంలో పలువురు ప్రత్యక్ష సాక్షులు ఉన్నారని, సంబంధిత ఆలయ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్‌ను కోరారు.

## నక్షాకు ప్రజల సహకరించాలి



రాజన్న సిరిసిల్ల జిల్లా, ప్రతినిధి జూన్ 21 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నక్షా కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు, ఆస్తుల సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు.సర్వే కొరకు వచ్చే అధికారులకు మి యొక్క ఇంటి వివరాలలో పూర్తి సహకారం అందించాలన్నారు. సర్వే సమయంలో ఇంటి యజమాని ఆధార్ కార్డు,ఆస్తి పత్రాలు, రెవెన్యూ రికార్డులు, పాస్‌బుక్‌లు తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సర్వే బృందం ఇంటి లేదా ఆస్తి వద్దకు వచ్చినప్పుడు వారికి పూర్తి వివరాలు అందచేసి నమోదు అయ్యేలా వారికి సహకరించాలన్నారు.ఆస్తుల విస్తీర్ణం,హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన వివరాలను సరైన విధంగా అందించడంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను కూడా తెలియజేయాలని,ప్రభుత్వ భూముల ఆక్రమణలు లేదా ఇతర ప్రత్యేక పరిస్థితులు ఉంటే వాటిని సర్వే బృందం దృష్టికి తీసుకురావాలన్నారు.అదేవిధంగా భూ వివాదాలు లేదా ఆస్తి యాజమాన్యానికి సంబంధించిన తగాదాలు ఉంటే వాటిని స్పష్టంగా తెలియజేసి సంబంధిత పత్రాలను మి వద్దకు వచ్చే సర్వే అధికారులకు సమర్పించాలన్నారు.వివాదాల పరిష్కారానికి అవసరమైన సమాచారం అందించడం ద్వారా సర్వే ప్రక్రియ సక్రమంగా పూర్తవుతుందని తెలిపారు.నక్షా కార్యక్రమం ద్వారా ఆస్తుల రికార్డులు మరింత ఖచ్చితంగా రూపొందించబడతాయని, భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత తదుపరి ప్రతి ఇంటి యజమానికి (యుపిసి) అన్ ప్రాపర్టీ కార్డు మున్సిపల్ ద్వారా అందజేస్తామన్నారు.

# నేటి జీవన శైలి వ్యాధులకు యోగా పరిష్కారం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి) :** భారతదేశం "యోగ భూమి"గా ప్రపంచ దేశాలన్ని గుర్తింపు ఇచ్చాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నేడు ప్రపంచమంతా ఒత్తిడి, ఆందోళనతోపాటు జీవన శైలి వ్యాధులతో బాధపడుతున్నారని, వీటికి సరైన పరిష్కారం నిత్యం యోగా చేయడమేనని చెప్పారు. ప్రతిరోజు దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ లో నిర్వహించిన యోగా వేడుకల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ... అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, అది మనిషి శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే జీవన విధానం, మన శరీరం, మనస్సు, ఆలోచనలు, ఆత్మ మధ్య సమన్వయం సాధించడమే యోగా ప్రధాన లక్ష్యం తెలిపారు. ఆదివారం రోజు నీట్ రీ ఎగ్జామ్ పరీక్ష రాయబోయే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్షకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు జరిగాయని, నీట్ ఎగ్జామ్ రాయబోయే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొద్దున్నే యోగా కార్యక్రమాలను పూర్తి చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.



## నీట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 21 (జనం సాక్షి) :** కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిజామాబాద్ జిల్లాలో ఆదివారం నీట్ పరీక్షను సాఫీగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేసి, నీట్ ఎగ్జామ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ. కెమెరాలు పని చేస్తున్నాయా అన్నది గమనించిన కలెక్టర్, వాటి ఫుటేజీల ఆధారంగా నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. బయో-మెట్రిక్ హాజరు సేకరణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాపీయింగ్, పేపర్ లీక్ కు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల వద్ద ఏర్పాటు చేసిన జామర్ లను, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స వసతులతో కూడిన ఏ.ఎన్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. అభ్యర్థుల అడ్మిట్ కార్డు, ఆధార్ వంటి గుర్తింపు కార్డులతో సరిచూసుకున్న మీదటే, మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించడం జరిగిందని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎగ్జామ్ హాల్లోకి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లలతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు.

## పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూన్ 21 (జనంసాక్షి) :** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత గూడు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని తంగేడుపల్లి అనుబంధ గ్రామమైన మడికట్టులో దేవుని మల్లేష్, మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో నిర్మించిన దండు ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల గృహావసరాలను తీర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన సంకల్పమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ సహాయం అందిస్తూ వారి జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇల్లు లేని కుటుంబాలను గుర్తించి సంక్షేమ పథకాలను చేరవేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం సురక్షితమైన నివాసంలో జీవించే పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సామాన్యుల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతోందని చెప్పారు. పేద ప్రజల



సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ పథకాల ఫలాలు అందేలా చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, మాధవి యాది రెడ్డి, కళ్యాణి యాదగిరి, గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, తంగడపల్లి సర్పంచ్ పామేన రాములు, నాయకులు గిరిధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పాండు, టేకులపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై అవగాహన అవసరం

**సంగారెడ్డి, జూన్ 21 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై అవగాహన అవసరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం ఆందోల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై ఆందోల్, వట్పల్లి, పుల్కల్, చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ ( బి ఎల్ ఏ)లతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్న మంత్రి గారు, ప్రతి ఓటరులో తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్



(సర్) ప్రక్రియపై ప్రతి ఏజెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, దాని ముఖ్య ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థలో సంపూర్ణంగా స్పెషల్ డ్రైవ్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 21 (జనం సాక్షి) :** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్ నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులను చక్కదిద్దేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుండి స్పెషల్ డ్రైవ్ ను ప్రారంభించడం జరిగిందని, ప్రతి రోజు సగటున రెండు నుండి మూడు డివిజన్లలో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. ఆయా డివిజన్లలో అర్బన్ ఎమ్మెల్యే, నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని అన్నారు. ఐదు జోన్ల పరిధిలో దాదాపు 23 కిలోమీటర్ల పొడవుతో కూడిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీలు ఉండగా, రూ. 68.96 లక్షల రూపాయల అంచనా వ్యయంతో డీసిల్టింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 17.22 కిలోమీటర్ల పొడవుతో కూడిన డ్రైనేజీల డీసిల్టింగ్ పూర్తయ్యిందని వివరించారు. మిగితా డీసిల్టింగ్ పనులను కూడా వారం పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 21 (జనం సాక్షి) :** గత నెల రోజుల నుండి 20 వరకు జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా , జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన , రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న ఐ.పి.సి ఢ బి ఎన్ ఎస్ ఢ ఎస్.ఎల్.ఎల్ 760 కేసులు,సైబర్ క్రైమ్ 165 కేసులు,ఇ-పెట్టి 2358 కేసులు,డి.డి ఢ ఎం వి యాక్ట్ 2193 మొత్తం 5458 కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందని ఇన్చార్జి కమిషనర్ రాజేష్ చంద్ర అన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా నిజామాబాదు జిల్లా కు సైబర్ క్రైమ్, వివిధ కేసులలో రాజీ మార్గం జరిగిందన్నారు.జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా ఉంచడంలో కృషి చేసిన అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, కోర్టు సిబ్బందిని జిల్లా పోలీస్ కమీషనర్ అభినందించారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్ అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసిన సి.సి.ఆర్.బి , కోర్ట్ డ్యూటీ , సైబర్ సెల్ సిబ్బందిని పోలీస్ కమీషనర్ అభినందించారు.

# మంత్రుల పర్యటనలను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేలు

**తుంగతుర్తి, జూన్ 21 (జనం సాక్షి) :** తుంగతుర్తి నియోజకవర్గంలో ఈనెల 22న 24న మంత్రులు పర్యటించనున్నారని వారి పర్యటనలను జయప్రదం చేయాలని స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు, ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుల పర్యటనలను విజయవంతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని అన్నారు జూన్ 22న నాగారం మండలం పణిగిరి గ్రామంలో రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారని తెలిపారు. అలాగే జూన్ 24న నూతనకల్ మండలంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పర్యటన కార్యక్రమం ఉన్నందున వాటిని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. ఈ



పర్యటనలకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణ, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను చారిత్రాత్మక విజయం గా నిలపాలని, అందుకోసం ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో ప్రజలను తరలించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సభకు కనీసం ఐదు వేల మందికి తగ్గకుండా ప్రజలను సమీకరించడానికి కార్యచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు. ఈ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలియజేస్తూ, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, గిరిధర్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగటి రవి, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నవీ ముంబయి నుంచి అబుధాబికి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తొలి విమానం

### వచ్చే నెల 15న ప్రారంభం



**ముంబయి:** కొత్తగా నిర్మించిన నవీ ముంబయి విమానాశ్రయం నుంచి అబుధాబికి ఎయిరిండియా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ జులై 15న అంతర్జాతీయ విమాన సర్వీసును ప్రారంభించనుంది. ఈ తొలి విమానానికి బుకింగ్‌లను త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది. నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ సీఈఓ బి.వి.జె.కె.శర్మ మీడియాతో మాట్లాడుతూ, జులై 15 నుంచి ప్రయాణికుల, సరకు రవాణా సేవల కోసం విమానాశ్రయం అంతర్జాతీయ కార్యకలాపాలను ప్రారంభించాలని చూస్తున్నట్లు తెలిపారు. అదానీ గ్రూప్ యాజమాన్యంలోని నవీ ముంబయి విమానాశ్రయంలో, మహారాష్ట్ర ప్రభుత్వ పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ అయిన సిడ్కో కూడా 26 శాతం వాటాను కలిగి ఉంది. గత ఏడాది అక్టోబరులో ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. 2025 డిసెంబరు 25న దేశీయ వాణిజ్య కార్యకలాపాలను ఇక్కడ ప్రారంభించారు.

# ఐపీఓలు వస్తున్నాయ్..

### వచ్చేవారం 3 పబ్లిక్ ఇష్యూలు




దిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సద్దుమణగడంతో పబ్లిక్ ఇష్యూల సందడి మళ్లీ మొదలవుతోంది. మెయిన్ బోర్డు కేటగిరీలో వచ్చే వారం మూడు కంపెనీలు ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. వాటర్‌వేస్ లీజర్ టూరిజం (కార్డెలియా క్రూయిజెస్), జైపూర్‌కు చెందిన ఆభరణాల తయారీ సంస్థ అద్వైత్ జువెల్స్, ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సీఎస్ఎం టెక్నాలజీస్ సంస్థలు ఐపీఓకు వస్తున్నాయి. ప్యాకింగ్ సొల్యూషన్స్ అందించే న్యాక్ ప్యాకేజింగ్ వచ్చేవారమే ప్రైస్ బ్యాండ్‌ను నిర్ణయించనుంది.వాటర్‌వేస్ లీజర్ టూరిజం సంస్థ ఐపీఓలో భాగంగా రూ.585 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.769–808గా నిర్ణయించింది. జూన్ 23 నుంచి 25 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉండనుంది. పూర్తిగా షేర్లను ఫ్రెష్ ఇష్యూ ద్వారా జారీ చేయనున్నారు.అద్వైత్ జువెల్స్ సంస్థ ఐపీఓ ద్వారా రూ.165.16 కోట్లు సమీకరించనుంది. జూన్ 23న సబ్‌స్క్రిప్షన్ తెరుచుకోనుంది. 25న ముగియనుంది. ధరల శ్రేణిని రూ.130–138గా కంపెనీ నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా 1.20 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. అప్పులు తీర్చడానికి, నిర్వహణ ఖర్చులకు ఈ మొత్తాలను వినియోగించనుంది. ఇక సీఎస్ఎం టెక్నాలజీస్ సంస్థ రూ.146 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.107–113గా నిర్ణయించింది. జూన్ 24న ప్రారంభమై 27న ముగియనుంది. ఇది కూడా పూర్తి ఫ్రెష్ షేర్ల జారీ ద్వారా జరగనుంది.క్విక్‌కామర్స్ సంస్థ జెప్టో ఐపీఓ ద్వారా రూ.10 వేల కోట్లు సమీకరించాలని చూస్తోంది. దీంతో పాటు ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ రూ.13వేల కోట్ల ఐపీఓకు రానుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఔఇ), రిలయన్స్ జియో సంస్థలు ముసాయిదా పత్రాలను సమర్పించాయి. దీంతో ఈ ఏడాది తొలి అర్ధభాగం స్తబ్దుగా ఉన్న ఐపీఓ మార్కెట్.. రెండో అర్ధభాగంలో వేగం పుంజుకోనుంది.

## బ్యాంక్ ఖాతాలు, యూపీఐ లావాదేవీలపై ప్రభావం ఉండదు

### వాలెట్ నిష్క్రియా రుసుములపై ఫోన్‌పే వివరణ

**దిల్లీ:** డిజిటల్ వాలెట్లు ఎలా పని చేస్తాయనే దానిపై కొంత మంది వినియోగదార్లకు పంపిన నోటిఫికేషన్లు గందరగోళానికి దారి తీయడంతో, ఫోన్‌పే వివరణ ఇచ్చింది. ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఫోన్‌పే వాలెట్లపై విధించే నిష్క్రియా రుసుములు వినియోగదార్ల అనుసంధానిత బ్యాంకు ఖాతాలు లేదా యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం చూపవని పేర్కొంది. ప్రీపెయిడ్ చెల్లింపు సాధనమైన (పీపీఐ) ఫోన్‌పే వాలెట్‌కు మాత్రమే ఇవి వర్తిస్తాయని తెలిపింది.




ఫోన్‌పే ఖాతా, యూపీఐ ఖాతా, ఫోన్‌పే వాలెట్ అన్నీ ఒకటేనని వినియోగదార్లలో ఉన్న సాధారణ అపోహ వల్లే ఈ గందరగోళం ఏర్పడిందని తెలిపింది. వాస్తవానికి ఇవి స్వతంత్రంగా పని చేస్తాయని, వేర్వేరు నిబంధనలకు లోబడి ఉంటాయని వెల్లడించింది. వినియోగదార్ల వాలెట్ బ్యాలెన్స్ సరిపోనప్పుడు, వారి బ్యాంక్ ఖాతాల నుంచి నిష్క్రియా రుసుములను వసూలు చేయొచ్చా అనేది యూజర్లలో ఒక ప్రధాన ఆందోళనగా ఉందని పేర్కొంది. లింక్ చేసిన బ్యాంక్ ఖాతాల నుంచి లేదా యూపీఐ ద్వారా ఎలాంటి మొత్తాలూ మినహాయించమని, అలాగే వాలెట్ బ్యాలెన్స్ నెగెటివ్‌గా మారదని ఫోన్‌పే తెలిపింది.

# వాడని డేటాకు రూ.20,000 కోట్లు చెల్లించాలా?

**న్యూఢిల్లీ:** వినియోగదారుల హక్కుల సంఘాల ఆవేదన
కాల్స్ కోసమే ప్రత్యేక పథకాలు తేవాలి: ట్రాయ్
సాధ్యం కాదంటున్న టెలికాం సంస్థలు



దేశంలో మొబైల్ వినియోగదారులు వినియోగించుకున్నా, లేకున్నా.. డేటా కోసమూ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. వారికి ఈ అనవసర ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) కీలక ప్రతిపాదన చేసింది. ఇంటర్నెట్ (డేటా) అవసరం లేని తక్కువ ఆదాయ వర్గాలు, వృద్ధులు, గ్రామీణుల కోసం/ ఫీచర్ ఫోన్లు వినియోగించే వారి కోసం కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవలతో కూడిన అత్యంత చౌకైన 'స్టాండలోన్' ప్లాన్లను విధిగా తీసుకురావాలని ప్రతిపాదించింది. దేశీయ టెలికాం దిగ్గజాలైన జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా(వీఐ) ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. టారిఫ్ నిర్ణయాలను మార్కెట్‌కే వదిలేయాలన్న పాలసీకి ఇది విరుద్ధమని, ప్రస్తుత టారిఫ్ విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా, యథాతథ స్థితి కొనసాగించాలని టెల్కోలు కోరుతున్నాయి.ఒక్కో వినియోగదారునిపై వచ్చే సగటు రాబడి (ఆర్పు) పెంచుకునేందుకు టెలికాం సంస్థలకు డేటా ఛార్జీలు అధికంగా ఉపయోగపడుతున్నాయి. కొన్నేళ్లుగా తమ వినియోగదారులను బేసిక్ ఫీచర్ ఫోన్ల నుంచి 4జీ, 5జీ స్మార్ట్‌ఫోన్ల వైపు మళ్లించడం ద్వారా, డేటా వినియోగం అధికం చేసి, లాభాదాయాలు పెంచుకునేందుకు టెలికాం కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ తరుణంలో తక్కువ ధరకే 'వాయిస్ ఓన్లీ' పథకాలు తెస్తే, తమ ఆదాయ వృద్ధికి విఘాతం కలుగుతుందని కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. అందుకే ట్రాయ్ ప్రతిపాదనకు అంగీకరించడం లేదు.

ఏటా అనవసరపు భారం

టెల్కోల తీరును వినియోగదారుల హక్కుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. డేటా వాడని వినియోగదారుల నుంచీ వసూలు చేస్తున్న డబ్బును, డేటా వాడేవారికి సబ్సిడీ ఇస్తున్నట్లుగా టారిఫ్‌లు ఉంటున్నాయని ఈ సంఘాలు వాదిస్తున్నాయి. దేశంలో సుమారు 30–35 కోట్ల మంది ఫీచర్ ఫోన్లు (కీప్యాడ్ ఫోన్లు) వాడుతుండగా, వారిలో 10 నుంచి 15 కోట్ల మందికి అసలు ఇంటర్నెట్ అవసరమే లేదన్నది వినియోగదారుల సంఘాల అంచనా. అయితే అన్ని ప్రీపెయిడ్ పథకాల్లో డేటాను తప్పనిసరి చేయడంతో.. డేటా వాడని వారూ ఏటా సుమారు రూ.15,000–20,000 కోట్ల వరకు టెల్కోలకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని ఆయా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రారంభస్థాయి పథకాల్లో ఒక్కో గిగాబైట్ డేటాకు రూ.94–99 ఛార్జీ వసూలు చేస్తున్నారని, ప్రీమియం పథకాల కంటే, ఇవే భారంగా మారుతున్నాయన్నది వాదన. కొండ, మారుమూల ప్రాంతాల్లో డేటా సేవలు అందుబాటులో లేకున్నా.. వినియోగదారులు బలవంతంగా డేటా ప్లాన్లు కొనాల్సి వస్తోందనే ఆవేదన ఉంది. రెండు మొబైల్ కనెక్షన్లు ఉన్నవారు.. రెండింటిలోనూ డేటా కోసం చెల్లిస్తూ, డబ్బు వృథా చేసుకుంటున్నారని ఈ సంఘాలు తెలిపాయి.

కంపెనీలు ఏమంటున్నాయంటే

ఆధునిక 4జీ, 5జీ నెట్‌వర్క్‌లు పూర్తిగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ ఆధారితమైనవని టెలికాం సంస్థలు పేర్కొంటున్నాయి. ఇందులో వాయిస్ కాల్స్ అనేవి డేటా నెట్‌వర్క్‌పైనే, ఒక అప్లికేషన్‌లాగా పనిచేస్తాయని, అందువల్ల నెట్‌వర్క్ స్థాయిలో వాయిస్‌ను, డేటాను వేరు చేయడం సాంకేతికంగా అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా పేర్కొంటున్నాయి. అతి తక్కువ కాలపరిమితితో చౌక ప్లాన్లు ఇస్తే, స్కామర్లు, మోసగాళ్లు సులభంగా నెట్‌వర్క్‌లోకి ప్రవేశించి, స్పామ్ కాల్స్ పెరిగేందుకు అవకాశం ఉంటుందంటున్నాయి. ఇప్పుడు దేశమంతా డిజిటల్ వైపు పరుగులు తీస్తున్న నేపథ్యంలో.. డేటా లేని ప్లాన్లను తీసుకొస్తే, సమాజంలో ఒక వర్గాన్ని డిజిటల్ వ్యవస్థకు దూరం చేసినట్లే అవుతుందని పేర్కొంటున్నాయి. వినియోగదారులకు డేటా లేని ప్లాన్లు ఇచ్చి, వాడినప్పుడే బిల్లు అనే విధానం తీసుకొస్తే.. గతంలో మాదిరే భారీ బిల్లులు వస్తాయనీ వివరిస్తున్నాయి. అందరికీ తక్కువ ధరలో మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ట్రాయ్ లక్ష్యానికీ, డేటా ఆధారిత మౌలిక సదుపాయాలకు పెట్టుబడులు పెడుతూ – వాటిపై ఆర్జనను ఆశిస్తున్న టెలికాం కంపెనీల ప్రయత్నాలకు మధ్య అంతరం ఎలా భర్తీ అవుతుందన్నదే వేచి చూడాల్సిన విషయం.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |


**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# ఏఐని మరింత వాడేస్తాం

### పాలన, కార్యకలాపాలపై కంపెనీల దృష్టి
### నిపుణుల నియామకాలకూ సన్నద్ధత
### క్వెస్‌కార్ప్ నివేదిక




**ముంబయి:** పాలనా వ్యవహారాలు, కార్యకలాపాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని భారత కంపెనీలు కోరుకుంటున్నాయని ఓ నివేదిక తెలిపింది. ఏఐ నిపుణుల నియామక ధోరణి ప్రయోగ దశ నుంచి అమలు దిశగా మళ్లుతోందనే విషయాన్ని ఇది తెలియజేస్తోందని పేర్కొంది. కంపెనీలు తమ ప్రధాన వ్యాపార కార్యకలాపాల్లో ఏఐ సొల్యూషన్లను అమలు చేయగలిగే, నిర్వహించగలిగే, అనుసంధానించగలిగే నిపుణులను ఎక్కువగా కోరుకుంటున్నాయని పేర్కొంది. 3.5 లక్షల ఉద్యోగ ప్రకటనల ఆధారంగా క్వెస్‌కార్ప్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం.. భారత్‌లో సుమారు 9,20,000 మంది ఏఐ వృత్తి నిపుణులు ఉన్నారు. వీరిలో 2,57,000 మంది కీలక ఏఐ బాధ్యతల్లో ఉండగా; 6,63,000 మంది ఏఐ ఎంబెడెడ్ రోల్స్‌ను నిర్వహిస్తున్నారు. ఉద్యోగ స్వరూపంలో వ్యత్యాసాలు ఉన్నట్లు కూడా నివేదిక గుర్తించింది. పునర్వినియోగ ఇంటర్నల్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, ఎంటర్‌ప్రైజ్ ఇంటిగ్రేషన్, గవర్నెన్స్ కోసం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లు (జీసీసీలు) నియామకాలు చేపడుతుండగా... క్లయింట్ ప్రోగ్రామ్‌ల్లో ఏఐని వాడేందుకు ఐటీ సేవల సంస్థలు నియామకాలు చేపడుతున్నాయి. ఫైనాన్స్, రిస్క్, ఆపరేషన్స్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, ఉద్యోగుల సిస్టమ్‌లకు ఏఐని అనుసంధానించేందుకు సంస్థలు ఎంపిక ఆధారంగా నియామకాలు చేపడుతున్నాయని నివేదిక తెలిపింది. 3.5 లక్షల యాక్టివ్ ఉద్యోగ ప్రకటనల్లో సుమారు 66–68% మేర గిరాకీ కోర్ ఏఐ రోల్స్‌కు ఉండగా.. 32–34% వరకు డిమాండు ఏఐ-ఎంబెడెడ్ రోల్స్‌కు ఉందని వెల్లడించింది. అయితే ఈ గిరాకీ నిష్పత్తి సప్లయ్ బేస్‌కు విరుద్ధంగా ఉందని, మొత్తం 9,20,00 మంది ఉద్యోగులలో 72–74 శాతం మంది ఏఐ ఎంబెడెడ్ రోల్స్‌లో ఉండగా.. కేవలం 26–28 శాతం మంది మాత్రమే కోర్ ఏఐ రోల్స్‌లో పనిచేస్తున్నారని నివేదిక తెలిపింది. ఏఐ వృద్ధికి మూడు విభిన్న చోదకాలు..: 'ఏఐ వృద్ధికి మూడు విభిన్న చోదక శక్తులు అవతరించినట్లు మా అధ్యయనంలో తేలింది. జీసీసీలు పునర్వినియోగ ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, గవర్నెన్స్ సామర్థ్యాలను నిర్మిస్తున్నాయి. ఐటీ సర్వీసెస్ పెద్దయెత్తున ఏఐ విస్తరణను పారిశ్రామికీకరిస్తున్నాయి. ఇక సంస్థలు ఏఐని నేరుగా వ్యాపార కార్యకలాపాల్లో, నిర్ణయ ప్రక్రియల కోసం వాడుతున్నాయి. ఇవన్నీ కలిసి ప్రయోగాల కంటే అమలు సామర్థ్యానికే ఎక్కువ ప్రాధాన్యం ఉన్న ఒక కొత్త నైపుణ్య వ్యవస్థను సృష్టిస్తున్నాయ'ని క్వెస్‌కార్ప్ ఐటీ స్టాఫింగ్ సీఈఓ కపిల్ జోషి అన్నారు. ప్రస్తుతం భారత్‌లోని ఏఐ సిబ్బందిలో 70 శాతం మందికి పైగా సంప్రదాయ ఏఐ నిపుణుల పరిధి వర్తించని రోల్స్‌లో ఉన్నారని తెలిపారు. అదే సమయంలో మొత్తం ఏఐ గిరాకీలో దాదాపు మూడింట ఒక వంతు ఆపరేషన్స్, కస్టమర్ సర్వీస్, మార్కెటింగ్ ఫైనాన్స్, గవర్నెన్స్, వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ లాంటి వ్యాపార విభాగాల నుంచి వస్తోందని ఆయన అన్నారు.

# ఎన్ఎస్ఈ ఐపీఓ..

- ముసాయిదా పత్రాల్లో సమస్యలు వివరించిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్
- నియంత్రణ, సాంకేతికత, సైబర్ దాడులు, ఏఐ సంబంధిత నష్టాలపై హెచ్చరిక
- డెరివేటివ్స్ ట్రేడింగ్ ఆదాయాలపై ఆందోళన

**దిల్లీ:** నియంత్రణ మార్పులు, సాంకేతిక వైఫల్యాలు, సైబర్ దాడులు, ఏఐ సంబంధిత నష్టాలు, వీటికి తోడు డెరివేటివ్స్ ట్రేడింగ్ ఆదాయాలపై గణనీయంగా ఆధారపడటం వంటివి తమ ఆర్థిక పని తీరు, వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేయొచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) హెచ్చరించింది. ఇటీవల దాఖలు చేసిన ఐపీఓ ముసాయిదా పత్రాల్లో (డీఆర్‌హెచ్‌పీ) పలు విషయాలను ప్రస్తావించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో తమ నిర్వహణ ఆదాయంలో లావాదేవీల రుసుముల వాటా 78.65 శాతంగా ఉందని పేర్కొంది. ఇందులో కేవలం ఆప్షన్స్ ట్రేడింగ్ నుంచే మొత్తం నిర్వహణ ఆదాయంలో 60.22 శాతం లభించిందని తెలిపింది. ఈక్విటీ డెరివేటివ్స్ ఫ్రేమ్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ ఇటీవల ప్రవేశపెట్టిన నియంత్రణ చర్యలు.. క్యాష్, డెరివేటివ్స్ విభాగాల్లో ట్రేడింగ్ కార్యకలాపాలు మందగించడానికి ఇప్పటికే దారి తీశాయని, ఫలితంగా 2025–26లో ట్రేడింగ్ రాబడి తగ్గిందని ఎక్స్ఛేంజ్ పేర్కొంది. నిబంధనలను మరింత కఠినతరం చేయడం, లావాదేవీల పన్నులు పెంచడం, మదుపర్ల ప్రాధాన్యతల్లో మార్పులు, ప్రత్యామ్నాయ అసెట్ క్లాసెస్ వైపు వారు మళ్లడం వంటివి ట్రేడింగ్ పరిణామాలు, లాభదాయకతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని ఎన్ఎస్ఈ హెచ్చరించింది. సెబీ నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు, అమలు చర్యలకు లోబడి ఉండటం వంటి విస్తృతమైన నియంత్రణపరమైన రిస్క్‌లను కూడా ఎక్స్ఛేంజ్ ఎత్తిచూపింది. కార్యకలాపాలు, పాలన, సాంకేతికత, నిబంధనల పాటింపునకు సంబంధించిన విషయాలపై సెబీ నుంచి తమకు షోకాజ్ నోటీసులు, హెచ్చరిక లేఖలు, లోపాల లేఖలు, సలహా కమ్యూనికేషన్‌లు అందినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. ట్రేడింగ్ యాక్సెస్ పాయింట్ (టీఏపీ) ఆర్కిటెక్చర్, నెట్‌వర్క్ కనెక్టివిటీకి సంబంధించిన విచారణల విషయంలో 2024 అక్టోబరులో రూ.643 కోట్లకు పైగా చెల్లించడంతో పాటు ఇటీవల తాము గణనీయమైన పరిష్కార ఖర్చులను భరించామని స్టాక్ ఎక్స్ఛేంజ్ తెలిపింది. నియంత్రణ తనిఖీ ఫలితాలకు సంబంధించి ఒక పరిష్కార ఉత్తర్వు కింద 2025 జులైలో రూ.40.35 కోట్లు కూడా చెల్లించినట్లు పేర్కొంది. కో-లొకేషన్, డార్క్ ఫైబర్ వ్యవహారాలకు సంబంధించిన వాటితో పాటు న్యాయపరమైన, నియంత్రణపరమైన ప్రక్రియలు ఇంకా పరిష్కారం కాలేదని, వీటివల్ల తమ ప్రతిష్ఠ, ఆర్థిక పరంగా ప్రభావాలు పడే అవకాశం ఉందని ఎన్ఎస్ఈ పేర్కొంది. ట్రేడింగ్ పూర్తిగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరుగుతున్నందున.. టెక్నాలజీ వైఫల్యాలు, సైబర్ సెక్యూరిటీ సంఘటలను కీలక కార్యాచరణపరమైన నష్టాలుగా ఎక్స్ఛేంజ్ గుర్తించింది.

## మన సాగర తీరం మరింత శత్రుదుర్భేద్యం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమ వల్లే వీటి నిర్మాణం సాధ్యమయ్యిందన్నారు.

ఐఎన్ఎస్ దుణగిరి

భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్‌డ్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్‌లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా నిర్మించిన ఈ నౌక బ్రహ్మోస్ యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను కలిగి ఉంది.

ఐఎన్ఎస్ సంశోధక్

భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై నివేదికల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది. 2023 జూన్ 13న జలప్రవేశం చేయించారు. పోర్టులు, లోతైన సముద్ర మార్గాలు, మారిటైం పరిధిలో సముద్ర అధ్యయనం, నావిగేషన్ విధుల కోసం ప్రత్యేక హెలికాప్టర్, విపత్కర పరిస్థితుల్లో మానవీయ సాయానికి, రక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా సంశోధక్ నిర్మాణం చేశారు.

# రష్యాలోకి చొచ్చుకెళ్లి.. చమురు క్షేత్రాలను బుగ్గి చేసి..

**మాస్కో:** రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు క్షేత్రాలపై ఉక్రెయిన్ గురిపెట్టింది. తాజాగా రష్యాలోపలికి దాదాపు 2,000 కిలోమీటర్లు చొచ్చుకెళ్లి మరీ ఉరల్ ప్రాంతంలోని ట్యూమెన్ చమురు క్షేత్రాన్ని ధ్వంసం చేసింది. ఇందుకోసం దీర్ఘశ్రేణి డ్రోన్‌లను వాడింది. కాకపోతే ప్రధాన ప్లాంట్ మాత్రం ఈ దాడిలో దెబ్బతినలేదని ఉరల్స్ గవర్నర్ అలెగ్జాండర్ మూర్ పేర్కొన్నారు. ఈ చమురు క్షేత్రం ఉక్రెయిన్ సరిహద్దు నుంచి దాదాపు 2,000 కిలోమీటర్ల దూరంలో ఉండటం విశేషం.మరోవైపు ఈ దాడుల వేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. తాము లాంగ్ రేంజ్ డ్రోన్లను అభివృద్ధి చేసినట్లు ప్రకటించారు. ఇవి దాదాపు 3,000 కిలోమీటర్ల మేరకు ప్రయాణించగలవన్నారు. రష్యాలోని అతిపెద్ద ప్రైవేటు రిఫైనరీల్లో ట్యూమన్ కూడా ఒకటి. ఇక్కడ రోజుకు 1,51,000 బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తుంది. రష్యాకు దేశీయంగా భారీగా చమురును సరఫరా చేస్తుంది. ఇటీవల కాలంలో రష్యా చమురు క్షేత్రాలను ఉక్రెయిన్ ధ్వంసం చేస్తోంది. గత వారం మాస్కోలోని రిఫైనరీపై రెండు సార్లు భారీగా దాడి చేసింది. ఈ వరుస దాడులతో రష్యాలోని పలు ప్రాంతాల్లో చమురు కొరత ఏర్పడింది. పెట్రోల్ ధరలు కూడా పెరిగాయి. తాజాగా ఉక్రెయిన్ డ్రోన్లు ఉరల్స్ పర్వతాల వరకు చేరుకొన్నాయి. శనివారం ఈ ప్రాంతంలోని పలు విమానాశ్రయాలను మూసివేశారు.



## అయోధ్యను వీడి వెళ్లొద్దు

ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి.రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు భూములను ట్రస్ట్ కొనుగోలు చేసిందనే ఆరోపణల నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంలోని నిఘా వ్యవస్థలు, భద్రత నిర్వహణను సిట్ బృందం ఇప్పటికే పరిశీలించింది. అయితే, 45 రోజుల ఫుటేజీ మాత్రమే అందుబాటులో ఉండటం సవాల్‌గా మారింది. సీసీటీవీ ఫుటేజీలను తారుమారు చేశారనే ఆధారాలను కూడా అధికారులు గుర్తించారని.. డిలీట్ చేసిన, మార్చిన డేటాను తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై యూపీ ప్రభుత్వం ఈ నెల 13న సిట్ ఏర్పాటు చేసింది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ఆలయ సిబ్బంది తదితరులను దర్యాప్తు అధికారులు ఇటీవల ప్రశ్నించారు. విరాళాల మొత్తాలను గురించి, ఆలయంలో వాటి నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. విరాళాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వాంగ్మూలాల్లో అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

## నా సీటు చోరీ జరిగింది

అక్కడి నుంచే సీటు కోరుకుంటా. నా కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలు ఇచ్చారనేది పచ్చి అబద్ధం. భాజపా కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తోంది. కేసు ఉన్నంత మాత్రాన నామినేషన్ తిరస్కరణ కాలేదు. భాజపా నేతలను నామినేషన్ రూమ్‌లోకి ఎందుకు అనుమతించారు?" అని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు.



# నిద్రమత్తులో మైనింగ్ శాఖ అధికారులు..!

**అక్రమ క్రషర్ కంపెనీలపై చర్యలు తీసుకోని మైనింగ్ శాఖ అధికారులు?**

- సహజ సంపదను కొల్లగొడుతున్న క్రషర్ మిషన్లు
- మహేశ్వరం నియోజకవర్గంలో జోరుగా మట్టి దందా



**మహేశ్వరం,జూన్21(జనం సాక్షి):** మహేశ్వరం నియోజకవర్గంలో ప్రకృతి సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను, కొండలను, ప్రకృతి సహజ సంపదను కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. క్రషర్ కంపెనీల నిర్వాహకు లు, అక్రమ మట్టి వ్యాపారం చేసే వారు గోరంత అనుమతులు తీసుకొని కొండలను, గుట్టలను, భూములను పాతాళంలోకి తోవ్వుతున్నారు. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 315లో, రావిర్యాల, కొంగర ఖుర్దూ, ఉప్పుగడ్డ తండా, నాగిరెడ్డిపల్లి, కల్వకోల్, దుబ్బచర్ల, నాగారం, మండలంలోని పలు గ్రామాలల్లో,కందుకూరు మండలంలోని రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని ర్యాంక్స్ సిలికాన్ క్రషర్ కంపెనీ,స్టార్ కే రాక్ స్టాండ్ క్రషర్ కంపెనీలు, అన్నోజిగూడ,మీర్కాన్ పేట్ గ్రామాలల్లో క్రషర్ కంపెనీలు దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ కంపెనీలు తవ్వకాలు జరుపుతున్న మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. లేమూరు, కొత్తూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, నేదునూరు, దాసర్లపల్లి, గూడూరు, అన్నోజీ గూడ, గ్రామాలతో పాటు కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో మట్టి వ్యాపారం జోరుగా నడుస్తుంది. టిప్పర్లల్లో అధిక లోడుతో మట్టిని,కంకర,పలుగు రాళ్లతో వెళ్తున్నాయి.దీంతో రోడ్డుపైన ప్రయాణించే ప్రయాణికుల కళ్లలో దుమ్ము పడుతుంది.మరికొన్ని క్రషర్ కంపెనీల సంబంధించిన టిపర్ల నుంచి రోడ్డుపైన కంకర పడుతుంది.దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఇటీవల మట్టి టిపర్ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

### ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు...?

కందుకూరు మండలంలోని రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని ర్యాంక్స్ సిలికాన్,స్టార్ కే రాక్ స్టాండ్ క్రషర్ కంపెనీలపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గతంలో పలుమార్లు కటికపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేసిన మైనింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కటికపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ర్యాంక్స్ సిలికాన్,స్టార్ కే రాక్ స్టాండ్ క్రషర్ కంపెనీలు పాతాళంలోకి గుట్టలను సుమారు 1000 అడుగుల లోతు తవ్వకాలు జరుపుతున్నారు.అక్రమ క్రషర్ కంపెనీల యజమానులతో మైనింగ్ శాఖ అధికారులు కుమ్మక్కయ్యారు అనే ఆరోపణలు వస్తున్నాయి.

### సహజ సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు

ప్రకృతి సహజ సిద్ధంగా ఉన్న కొండలను,గుట్టలను,వాగులను కొల్లగొడుతూ అక్రమార్కులు కోట్లు సంపాదిస్తున్నారు.రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని ర్యాంక్స్ సిలికాన్ క్రషర్ కంపెనీ యాజమాన్యం కటికపల్లి గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం చెరువుకు వెళ్ళే వాగును మట్టితో మూసి వేశారు.పచ్చని చెట్లు,పక్షులతో కళకళలాడే గుట్టలను,కొండలను,అడవులను అక్రమార్కులు పిండి చేస్తున్నారు.అక్రమ క్రషర్ కంపెనీలపై,మట్టి తవ్వకాలను జరుపుతున్న వారిపై మైనింగ్ శాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### అసైన్డ్ భూములల్లో తవ్వకాలు...ప్రైవేట్ కంపెనీలకు అమ్మకాలు

మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం,కందుకూరు మండలాల్లో భారీ పరిశ్రమలు రావడంతో ఎర్ర మట్టికి ,పలుగు రాళ్లకు, మొరానికి చాలా డిమాండ్ వచ్చింది.దీంతో అక్రమార్కులు ఎటువంటి అనుమతులు తీసుకోకు ఒడానే రాత్రి పగలు అని తేడా లేకుండా విచ్చలవిడిగా మట్టి వ్యాపారం చేస్తున్నారు.రాత్రి పూట మట్టి తవ్వకాలు జోరుగా నడిపిస్తున్నారు.బాలాపూర్, మహేశ్వరం,కందుకూరు మండలాలోని అసైన్డ్ మెంట్ భూములు, ప్రభుత్వ, ప్రైవేట్ భూములలో మైనింగ్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మట్టి తవ్వకాలను జరుపుతున్నారు.అక్రమంగా మట్టి తవ్వకాలను జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు సొంతింటి కల

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య
- కాశీంబౌలి, నదీమనగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం



**మొయినాబాద్,జూన్21, జనంసాక్షి:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోని కుటుంబ సభ్యులు ఆనందంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాశీంబౌలి, నదీమ్నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న అర్హులైన లబ్ధిదారుల ఇళ్లను ఎమ్మెల్యే పాల్గొని గ్రామ సర్పంచ్ రాజేందర్రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సొంతింటి కల అని అన్నారు. ఎంతో మంది నిరుపేదలుగా ఉండి కిరాయిలు కట్టలేక అద్దె భవనాలలో మగ్గుతున్నారన్నారు. అలాంటి వారిని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి సొంతింటి కల నెరవేర్చేందుకు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐదు లక్షలు అందజేస్తు నాణ్యతతో నిర్మిచుకునేందుకు కమిటీ అధికారులను నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు సొంతింటి కల నెరవేరిందని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ముర్తుజాగూడ విక్రమ్ రెడ్డి, పెద్దమంగళారం వనజాక్షి, అమ్డాపూర్ సర్పంచ్ మద్యపాగ కృష్ణ, నాయకులు మన్నె ప్రభాకర్రెడ్డి, నదీ మనగర్ మహేష్యాదవ్, హనుమంతుయాదవ్, అశోక్ యాదవ్, నరేష్యదవ్ పాల్గొన్నారు.

## టిక్కి తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శిగా బాణావత్ మోతిలాల్

**యాచారం, జూన్ 21(జనం సాక్షి)**

ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గా యాచారం మండలం, మంతన్ గౌరెల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ బాణావత్ మోతి లాల్ నాయక్ నియమితులయ్యారు. టిక్కి రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మోతిలా ల్ నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన యువతను పారిశ్రామిక రంగం వైపు నడిపించడం, వారిలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే 'టిక్కీ యొక్క ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. లీగల్ సెల్ కార్యదర్శిగా మోతిలాల్ నాయక్ నియామకం సంస్థ బలోపేతానికి, గిరిజన పారిశ్రామికవేత్తలకు చట్టపరమైన సహాయం అందించడానికి ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తన నియామకంపై బాణావత్ మోతిలాల్ నాయక్ స్పందిస్తూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షునికి మరియు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన యువత పారిశ్రామికంగా ఎదగడానికి మరియు సంస్థ ఆశయాల సాధనకు తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?.. మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల సవాల్

- 14 ఏళ్ల పాలనతో రెండున్నరేళ్ల అభివృద్ధిని పోల్చాలని డిమాండ్
- రైతు రుణమాఫీ అమలులో కాంగ్రెస్ చరిత్ర సృష్టించిందని వ్యాఖ్య
- ఆరుట్ల పాఠశాల అభివృద్ధిని స్వయంగా వచ్చి చూడాలని సూచన
- అసత్య ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు హెచ్చరిక

ఇబ్రహీంపట్నం, జూన్ 21 (జనంసాక్షి): మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. 14 ఏళ్ల కాలంలో ఎమ్మెల్యేగా కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఎంత, రెండున్నరేళ్లలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీసుకొచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి ఎంత అనే అంశాలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసి చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. గతంలో నియోజకవర్గంలో కేవలం 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం వాటిని 15కు పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఫార్మాసిటీ స్థానంలో నియోజకవర్గ భవిష్యత్తును మార్చే విధంగా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, దీనిని కూడా బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకించడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాలకు నిధులు కేటాయిస్తు న్నారని, దీనిపై బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్‌లనే అడిగి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు, రాజకీయ విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై తప్పుడు ప్రచారం కొనసాగిస్తే కాంగ్రెస్ శ్రేణులు తగిన విధంగా స్పందిస్తాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎద్మ నరేందర్‌రెడ్డి, లింగం ముదిరాజ్, టౌన్ అధ్యక్షుడు గౌస్‌పాషా, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజాయితీతో కూడిన ఆలోచనలకు మద్దతు

## ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

- 'ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు' అనే నినాదంతో హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్
- ఐదు వందల మందికి పైగా హాజరు



**హైదరాబాద్, జూన్ 21 (జనంసాక్షి):** నిజాయితీతో కూడిన ఆలోచనలకు మద్దతు అందించనున్నామని ముఖ్య అతిథి ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు తెలిపారు. ప్రపంచంలోని అగ్రగామి ఆర్థిక, ఆవిష్కరణల హబ్‌లలో ఒకటిగా నగరాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఖాజాగూడలోని ఎస్ఏఎస్ ఐటవర్లో మొట్టమొదటి 'హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ 2026' నిర్వహించారు. 'ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు' అనే నినాదంతో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సరికొత్త ఆలోచనలతో తెలంగాణకు రండి. ప్రతి ఆలోచన విజయవంతమవుతుందని గ్యారెంటీ ఇవ్వలేకపోవచ్చు, కానీ నిజాయితీతో కూడిన ప్రతి ఆలోచనకు ఇక్కడ మద్దతు, అవకాశం, ఎదిగేందుకు కావాల్సిన నమ్మకం లభిస్తాయని హామీ ఇవ్వగలం' అని చెప్పారు. 20వ శతాబ్దం వనరులు, పరిశ్రమలు, పెట్టుబడుల కోసం పోటీ పడేవని, కానీ 21వ శతాబ్దం సరికొత్త ఆలోచనలు, ప్రతిభ, ఆవిష్కరణలను ఆకర్షించగల దేశాలదేనని అన్నారు. గత దశాబ్ద కాలంలో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో భారతదేశం 81వ స్థానం నుంచి 39వ స్థానానికి చేరడం, అద్భుతమైన వృద్ధిని సాధించడం ఈ ప్రపంచ మార్పును ప్రతిబింబిస్తోందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న ఆవిష్కరణల సామర్థ్యాన్ని ఇది చెప్తుందన్నారు. ఈ పరివర్తనను ముందుండి నడిపించేందుకు తెలంగాణ దృఢ నిశ్చయంతో ఉందని చెప్పారు. ఈ రోజు భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ 'స్టేట్స్ స్టార్టప్ ర్యాంకింగ్స్'లో తెలంగాణ అత్యంత డైనమిక్ ఇన్నోవేషన్ హబ్‌లలో ఒకటిగా అవతరించిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా చైర్మన్ డాక్టర్ జీవీ రావు మాట్లాడుతూ సాంకేతికత, లైఫ్ సైన్సెస్, రిటైల్, రియల్ ఎస్టేట్, క్రీడలు, వినోదం వంటి పలు రంగాలలో ఏకకాలంలో రాణించగల సామర్థ్యం హైదరాబాద్‌కు ఉండటమే అసలైన బలమన్నారు. నగర భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అందరిని ఒక తాటిపైకి తీసుకురావడానికి, భవిష్యత్తులో అర్థవంతమైన చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ ఫోరమ్ ఏర్పాటు చేశామన్నారు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు మోసపోయారు

- ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం : కేటీఆర్
- నిరుద్యోగ భృతి చెల్లిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- మహిళలకు నెలకు రూ.2,500 జమ చేయాలని డిమాండ్
- బీఆర్ఎస్ కార్యకర్తలు ఓటరు జాబితా సవరణలో చురుకుగా పాల్గొనాలి



**శంషాబాద్, జూన్ 21 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను పూర్తిగా మోసం చేసిందని, రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆరోపించారు. ఆదివారం శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైన కేటీఆర్, అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి బిడ్డ కాంగ్రెస్ పాలనలో దగా పడ్డారని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణలో భూ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని, కోట్లాది రూపాయల విలువైన భూములు వివాదాల్లో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలు గుప్పిస్తూ, ప్రభుత్వ వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రజలు సినిమా ట్రైలర్ చూసి సినిమా ఫలితాన్ని అంచనా వేయగలరని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ప్రజలకు ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని అన్నారు. ఒక ప్రభుత్వం వైఫల్యం చెందితే దాని ప్రభావం కోట్లాది ప్రజలపై పడుతుందని వ్యాఖ్యానించారు. శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన పూర్వీకుల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తనకు ఫిర్యాదు చేశాడని కేటీఆర్ తెలిపారు. భూముల విషయంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు, 13 డిక్లరేషన్లు ప్రకటించిందని, రైతు రుణమాఫీ, రెండు లక్షల ఉద్యోగాలు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, మైనార్టీలకు ఇచ్చిన హామీలు సహా అనేక అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ఆ ఉద్దేశంతో ఉంటే నెలకు రూ. 2,500 చొప్పున మహిళల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగులకు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని కోరారు. ఐదేళ్లపాటు నిరుద్యోగ భృతి పూర్తిస్థాయిలో చెల్లిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అర్హులైన కొత్త ఓటర్ల పేర్ల నమోదు, బోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, ఆసరా పింఛన్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు చేరాల్సిన నిధులు అవినీతి, కమిషన్ల రూపంలో దారి మళ్లుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థిగా మారిన గురువు

- ప్రభుత్వ బడి కోసం వినూత్న పోరాటం
- ప్రభుత్వ విద్య పరిరక్షణకు వెంకటేశ్వర్లు వినూత్న కృషి
- బడిబాట కార్యక్రమంతో ఇంటింటికీ చైతన్యం
- సేవాభావానికి నిదర్శనంగా నిలిచిన ఉపాధ్యాయుడు




**మర్రిగూడ, జూన్ 21 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఓ ఉపాధ్యాయుడు చేపట్టిన వినూత్న కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంటోంది. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు లెంకలపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం చేస్తున్న కృషి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ప్రైవేట్ విద్యాసంస్థల వైపు తల్లిదండ్రుల మొగ్గు పెరుగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లోని అనేక ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల కొరతను ఎదుర్కొంటు న్నాయి. ఈ నేపథ్యం లో "మా ఊరి బడి బతికితేనే గ్రామ భవిష్యత్తు బాగుంటుంది" అనే లక్ష్యంతో వెంకటేశ్వర్లు వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. సాధారణ ఉపాధ్యా యుడిగా కాకుండా స్వయంగా విద్యార్థి యూనిఫాం ధరించి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటు లో ఉన్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ తరగతులు, నాణ్యమైన విద్య వంటి సౌకర్యాలను ప్లకార్డుల ద్వారా తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు తన పాఠశాల అభి వృద్ధి కోసం ఇంతటి అంకితభావంతో ప్రజల్లోకి వెళ్లడం అరుదైన విషయమని గ్రామస్థులు అభిప్రాయపడు తున్నారు. విధి నిర్వహణను కేవలం ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తూ వెంకటేశ్వర్లు చేపట్టిన 'బడిబాట' కార్యక్ర మం పలువురికి స్ఫూర్తినిస్తోంది. సాధార ణంగా తరగతి గదులకే పరిమితమయ్యే ఉపాధ్యాయ వృత్తికి ఆయన కొత్త అర్థం తీసుకొచ్చారని విద్యావేత్తలు పేర్కొం టున్నారు. ఒక గురువు సంకల్పం, చిత్తశు ద్ధి, సేవాభావం ఉంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన కార్యాచరణ స్పష్టం చేస్తోంది. సమాజ నిర్మాణానికి విద్యే పునాది అయితే, ఆ విద్యకు బలమైన పునాదిని వేసే గురువులే నిజమైన జాతి నిర్మాతలు. అలాంటి జాతి నిర్మాతగా వెంకటేశ్వర్లు నిలుస్తూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. ఆయన చేస్తున్న కృషి ఇతర ఉపాధ్యాయులకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాకుండా సమాజం మొత్తానిదేననే సందేశాన్ని వెంకటేశ్వర్లు తన కార్యాచరణ ద్వారా చాటి చెబుతున్నారు.

ప్రస్తుతం ఆయన చేపట్టిన ఈ వినూత్న 'బడిబాట' కార్యక్రమం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి విశేష ఆదరణ పొందుతోంది. ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం ఒక ఉపాధ్యాయుడు చేస్తున్న ఈ ప్రయత్నం విద్యా రంగంలో స్ఫూర్తిదాయక అధ్యాయంగా నిలుస్తోంది.

# ఆచార్య జయశంకర్ సార్ చూపిన మార్గంలోనే పయనించాలి

**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**తాండూరు జూన్ 21(జనంసాక్షి) :** ఆచార్య జయశంకర్ సార్ చూపిన మార్గంలోనే పయ నించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి కి ఘన నివాళులు అర్పించారు. 28వ వార్డ్ కౌన్సిలర్ నాగా రం మల్లేశం ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ పటేల్ విజయ్ కుమార్ బంటారం భద్రేశ్వర్ 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్ 33వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి ఇందుర్ రాములు కోకట్ సర్పంచ్ పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ బోధనలు వారు చూపిన బాటలో నడవాలని తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపే ఏకైక పార్టీ బిజెపి అని కుటుంబ పార్టీ నుంచి స్కాము పార్టీ నుంచి తెలంగాణ ప్రజలను కాపాడే ఏకైక పార్టీ బిజెపి అని అప్పులల్లో కూడికపోయినా ధనిక రాష్ట్రాన్ని రెండు ప్రభుత్వాలు చాలా రాశాయని నిజమైన అభివృద్ధి జరగాలంటే కేవలం బిజెపితోనే సాధ్యమని అటు కేంద్రంలో ఇటు తెలంగాణలో అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందే అది కేవలం బిజెపితోనే సాధ్యమని చెప్పేసి తెలియజేయడం జరిగింది అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, రాష్ట్రం మరింత విలసిల్లాలని, అందుకు ఆచార్య జయశంకర్ చూపిన మార్గంలోనే పయనించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# శంకరపట్నంలో మంత్రి పొన్నం పర్యటన

- ఇసుక బుకింగ్ సమస్య పరిష్కారానికి హామీ
- ఎక్స్‌ప్రెస్ బస్సుల రిక్వెస్ట్ స్టాప్‌లపై సానుకూల స్పందన
- పార్టీ బలోపేతం, అభివృద్ధి పనులపై కార్యకర్తలతో చర్చ
- ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచన

**శంకరపట్నం, జూన్ 21:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మానకొండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు గాజుల వెంకటేశ్వర్లు నివాసాన్ని సందర్శించిన మంత్రి స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించి న ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా పనిచేయాలని మంత్రి కార్యకర్తలకు సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా స్థానికులు సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇసుక బుకింగ్ సక్రమంగా జరగకపోవడంతో అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు.

దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని మూలగూరు, తాడికల్ తదితర గ్రామాల ప్రజలు ఎక్స్‌ప్రెస్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రవాణా శాఖ అధికారులతో చర్చించి సమస్యను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మంచినీరు ఉన్న లేనట్టే...

## పేరుకుపోయిన మురికి నీరు..

- పట్టించుకోని అధికారులు పాలకవర్గం
- కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి.. సురేష్

**గంభీరావుపేట జూన్ 21(జనం సాక్షి);** తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్నటువంటి అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇల్లు నిర్మాణం చేపట్టింది, ఇండ్లు లబ్ధిదారులకు పంపిణీ చేసిన తర్వాత పట్టించుకున్న నాథుడు లేదంటూ కాలనీవాసులు వాపోతున్నారు, వివరాలో కెళితే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని కెసిఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్‌లో మురికి కాలువలు నిండిపోయి మురికి నీరు బయటకు వస్తుంది అంటూ కాలనీవాసులు వాపోతున్నారు, చాలా సార్లు గ్రామ పంచాయతీ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ, కాలనీవాసులు వాపోతున్నారు,డబుల్ బెడ్ రూమ్‌లో నివసించాలంటేనే దుర్వాసన వస్తుంది, వారన్నారు, ఈ దుర్వాసన వల్ల అనేక రోగాల బారిన పడుతున్నామని అసలే వర్షాకాలం, మలేరియా, డెంగ్యూ, రోగాలు వస్తున్నాయని ఇప్పటికైనా అధికారులు పాలకవర్గం పట్టించుకోని, పైపులను క్లియర్ చేసి దుర్వాసన రాకుండా చూడాలని కాలనీవాసులు కోరారు.

నీరు ఉన్న లేనట్లే...

కెసిఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ లో దాదాపు కాలనీలో 400 పైగా మంది నివసిస్తున్నారు ఆ ఇళ్లలో నీటి సమస్య ఉన్నదని కాలనీవాసులు అన్నారు,"



నీరు ఉన్న లేనట్లే"కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ నిధులతో డబుల్ బెడ్ రూమ్లో బోరు వేసినప్పటికీ దానిలో చిన్న మోటారు ఉండడంతో నీరు అందలేకపోతుందని దాన్ని కాస్త పెద్ద మోటార్ బిగించి ప్రతి బ్లాక్ లోకి అందే విధంగా చూడాలని వారు కోరారు. తెలంగాణ రక్షణ సేన నాయకులు కూర సురేష్ మాట్లాడుతూ వెంటనే ఈ కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని పాలకవర్గం పట్టించుకోని వారికున్నటువంటి సమస్యలు తీర్చాలని కోరారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు కూర సురేష్ తో పాటు పల్లె బాలయ్య, మేరా బాల శంకర్, కొత్తపెల్లి అమృత, సత్తమ్మ, దండ వేణి రాని, శ్రావణి, మమత, మంజుల, సంధ్య, కల, మహమ్మద్ జమీన్ కాలనీవాసులు ఉన్నారు

# జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతం

- పలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, పోలీస్ కమిషనర్
- 3,001 మంది అభ్యర్థులకు గాను 2,661 మంది హాజరు
- భద్రతా చర్యలు, సమన్వయంతో సజావు నిర్వహణ
- జిల్లాలో ఏడు కేంద్రాల్లో పరీక్ష



**కరీంనగర్ బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి):** జిల్లాలో నిర్వహించిన నీట్ 2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సంయుక్తంగా పర్యవేక్షించారు.

జిల్లాలోని కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, ద్విస్థాయి భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయ గా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. పరీక్ష ప్రశాంతమైన వాతావరణం లో జరిగేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులకు గాను 2,661 మంది హాజరుకాగా, 340 మంది గైర్హాజరయ్యారు. కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో 744 మందికి గాను 662 మంది హాజరు, 82 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో 720 మందికి గాను 651 మంది హాజరు, 69 మంది గైర్హాజరయ్యారు. అలుగునూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 408 మందికి గాను 359 మంది హాజరు, 49 మంది గైర్హాజరు. కేంద్రీయ విద్యాలయంలో 361 మందికి గాను 316 మంది హాజరు, 45 మంది గైర్హాజరు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 312 మందికి గాను 278 మంది హాజరు, 34 మంది గైర్హాజరు. మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో 288 మందికి గాను 251 మంది హాజరు, 37 మంది గైర్హాజరు. టీజీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల, చింతకుంటలో 168 మందికి గాను 144 మంది హాజరు, 24 మంది గైర్హాజరు. పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత హక్కుల కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది

- యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి) :**

దేశ యువత భవిష్యత్తుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ విమర్శించారు. శనివారం డీసీసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఉద్యోగ నియామకాలలో జాప్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే పలు పోటీ పరీక్షల్లో తరచూ అవకతవకలు చోటుచేసుకోవడం వల్ల యువతలో నమ్మకం సన్నగిల్లుతోందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిన్న రాజస్థాన్ రాష్ట్రంలోని కోటాలో జరిగిన మహా ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యోగులతో జరిగిన సమ్మేళనం యావత్ దేశాన్ని కదిలించిందని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు, ఎల్ఓపీ రాహుల్ గాంధీ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తన సమస్యలుగా ఎలుగెత్తారని, ఈ సభ ద్వారా దేశంలో మార్పు కోరుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన విధానాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య, పరిశోధన రంగాలకు మరింత నిధులు కేటాయించి యువతకు మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉద్యోగాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శులు ఇమ్రాన్, దేవేందర్, శ్రీధర్ రెడ్డి, అనిల్, కార్యదర్శులు మనోజ్, హరీష్, అరుణ్, గని, కోశాధికారి వసీం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హైమద్ అలీ పాల్గొన్నారు.



# ఈ-బస్సులో అగ్నిప్రమాదం

## డ్రైవర్ ప్రశాంత్‌కు మంత్రి పొన్నం ప్రశంసలు

### డ్రైవర్ అప్రమత్తతతో 39 మంది ప్రయాణికులు సురక్షితం

**కరీంనగర్ టౌన్, జూన్ 21 ( జనం సాక్షి) :**అలుగునూర్ సమీపంలో టీజీఎస్ఆర్టీసీకి చెందిన ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సు అగ్నికి ఆహుతైన ఘటనలో డ్రైవర్ బి. ప్రశాంత్ సమయస్ఫూర్తి, ఆర్టీసీ ఉద్యోగుల అప్రమత్తతతో 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి డ్రైవర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్-2 డిపోకు చెందిన ఈ-సూపర్ లగ్జరీ బస్సు (టీజీ 02టి 1138) ఆదివారం ఉదయం అలుగునూర్ వద్ద ప్రయాణిస్తుండగా బ్యాటరీ విభాగంలో సాంకేతిక లోపం తలెత్తి మంటలు చెలరేగాయి. పరిస్థితిని వెంటనే గుర్తించిన డ్రైవర్ బి. ప్రశాంత్ బస్సును సురక్షిత ప్రాంతంలో నిలిపి ప్రయాణికులను, వారి సామాన్లను క్షేమంగా కిందకు దింపారు. అనంతరం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు తీవ్రరూపం దాల్చడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది.

ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, పోలీసులు, ఆర్టీసీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. టీజీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఓ, ఈ అండ్ ఎం) ఆర్. వెంకన్న, కరీంనగర్ జోన్ ఈడీ పి. సోలమన్, రీజినల్ మేనేజర్ బి. రాజు తదితరులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాద కారణాలపై విచారణకు ఆదేశించారు.

అనంతరం కరీంనగర్ డిపోను సందర్శించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డ్రైవర్ బి. ప్రశాంత్ ధైర్యసాహసాలను అభినందిస్తూ రూ.10 వేల నగదు పారితోషికాన్ని అందజేశారు. టీజీఎస్ఆర్టీసీ అధికారులు కూడా డ్రైవర్ సేవలను గుర్తిస్తూ రూ.5 వేల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బి. జానిరెడ్డి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ వి. శ్రీకృష్ణ, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) పి. మల్లేశం, డిపో మేనేజర్ ఐ. విజయ మాధురి, జేబీఎం సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాముకాటుతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**గోదావరిఖని, జనంసాక్షి :** పెద్దపెల్లి జిల్లా గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన మావునూరి పందరి సింగరేణి సంస్థ ఓసిపి త్రీ ఫేస్ టూ లో సింగరేణి కోల్ లారీ లోడింగ్ అన్ లోడింగ్ టార్పాలిన్ హమాలి వర్కర్‌గా పనిచేస్తుంటాడు. బొగ్గు లోడింగ్ పనులు నిర్వహిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు గమనించిన తోటి కార్మికులు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు.

# చేవెళ్ల సొసైటీ గోదాంలో యూరియా, డిఎపి

## ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలి : సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి

చేవెళ్ల, జూన్ 21 (జనంసాక్షి) : చేవెళ్ల సొసైటీ గోదాంలో యూరియా, డిఎపి ఎరువులు తగిన నిల్వలతో చేవెళ్ల సొసైటీ గోదాం లో అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులు తమ పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఎరువులు పొందేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా నమోదు చేసుకుని యూరియా, డిఎపి ఎరువులను పొందవచ్చని తెలిపారు. అవసరమున్న రైతులు తమ ఆధార్ సంబంధిత వివరాలతో (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని సొసైటీ గోదాంలో ఎరువులను పొందాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించేందుకు సొసైటీ అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి తెలిపారు.

# యువజన హక్కుల కోసం ఉద్యమిద్దాం

- రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నిటిని వెంటనే భర్తీ చేయాలి
- గ్రామ గ్రామాన యువజన సంఘాన్ని బలోపేతం చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




**హుజురాబాద్, జూన్ 21(జనం సాక్షి) :**

యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై, హక్కుల సాధనకై అనునిత్యం పోరాటాలు చేయాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హుజురాబాద్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలసమావేశం ఇందిరానగర్ లో పోలోజు రంజిత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎన్నికల ముందు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు అన్ని వెంటనే భర్తీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మేము వస్తే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ పార్టీపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం గత 12 సంవత్సరాలకు పైగా యువతను మోసం చేస్తూ వస్తుందని ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ మాట ఎత్తకపోవడం సిగ్గుచేటు అన్నారు.

ఏటా కోటి ఉద్యోగాలన్న మోడీ నేటికీ దాని అమలు పరచకపోవడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే యువజన వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని యువతకు పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్ల పెల్లి యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. గతంలో నిరుద్యోగులకు ఉపాధి చేసుకోవడం కోసం లోన్లు ఇచ్చి ఉపాధి కల్పించేవారని ఇప్పుడు ఆ పథకాన్ని పూర్తిగా నీరు కార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివినటువంటి యువతకు ఉద్యోగం,ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా యువతను మరిచిపోయిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిపించేందుకు అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని యుగంధర్ అన్నారు. ఏఐవైఎఫ్ ను హుజురాబాద్ నియోజకవర్గం లో గ్రామ గ్రామాన బలోపేతం చేసి ప్రతి గ్రామంలో యువతను ఐక్యపరచి సంఘటిత పోరాటాలకు సిద్ధం చేయాలని యుగంధర్ కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు రత్నాకర్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు జెట్టి లావణ్య, మొడెం శివకుమార్, ప్రశాంత్, రాకేష్, మహేందర్, శివకుమార్, సదానందం, ఫర్హానా, రామంచ శ్రావణ్, అకినపల్లి సందీప్, కోల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**మొయినాబాద్, జూన్ 21, జనంసాక్షి:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సౌకర్యార్థం రోడ్ల అభివృద్ధే ధ్యేయంగా ఎంతో కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిని ఆనుకోని కనకమామిడి గ్రామం నుంచి హెచ్ఎండిఏ నిధుల రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్ శ్రీదివ్య మురళీధర్రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీఠ వేసిందన్నారు. రహదారులతోనే గ్రామాలకు అనుసంధానం అభివృద్ధి జరుగుతు ందని పేర్కొన్నారు. కనకమామిడిలో సర్పంచ్ శ్రీదివ్యమురళీధర్రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి సన్మానించారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు సేవ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంగౌడ్, రాంరెడ్డి, గణేష్ రెడ్డి, నాగమల్లారెడ్డి, రాంరెడ్డి, మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా కోర్ట్‌లో అంతర్జాతీయ యోగ కార్యక్రమం



**కరీంనగర్ లీగల్, జూన్ 21 (జనంసాక్షి ) :**

కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ చంద్రపాటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ... అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, అది మనిషి శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే జీవన విధానం, మన శరీరం, మనస్సు, ఆలోచనలు, ఆత్మ మధ్య సమన్వయం సాధించడమే యోగా ప్రధాన లక్ష్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి శివకుమార్ ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గడ్డం లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ చంద్రపాటి కిరణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బండ శివకుమార్ జాయింట్ సెక్రటరి సుంకె దేవకిషన్, స్పోర్ట్స్ మరియు కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్, న్యాయవాదులు డి. మల్లయ్య, ఎంఆర్కె చారి, ఎర్రం రాజారెడ్డి, పెరుక రాజయ్య, ముత్యాల తిరుపతి రెడ్డి, టి. వేణుగోపాల్, ముద్దసాని సంపత్, ఇతర సీనియర్ జూనియర్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మామూళ్ల మత్తులో ఆర్మూర్ అబ్కారీ శాఖ

- ఫోన్ చేసిన స్పందించని సిఐ
- విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణ
- ప్రతి మద్యం షాపు నుండి నెల నెల 25-30 వేల నజరానా



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(ఆర్మూర్), జూన్ 21 జనం సాక్షి :**

ఆర్మూర్ అబ్కారి శాఖ మామూళ్ల మత్తులో తూగుతుంది. ఆర్మూర్ పట్టణంతో పాటు సర్కిల్ పరిధిలోని పలు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నప్పటికీ అబ్కారి శాఖ నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తుంది. ఆర్మూర్ పట్టణంలోని కింది బజార్, జిరాయత్ నగర్ వెళ్లే రోడ్డుతో పాటు మామిడిపల్లి, పెరికిట్ లలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులలో మద్యం అర్ధరాత్రి వరకు విక్రయిస్తున్నారు.కింది బజార్ సమీపంలో కిరాణా దుకాణాలలో ఉప్పు,పప్పు తో సమానంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు పట్టణంలో గంజాయి విక్రయాలు కూడా జోరుగా సాగుతున్న ఏరోజు కూడా ఒక కేసు నమోదు చేసిన దాఖలాలు లేవు.సాయంత్రం ఏడు దాటిందంటే యువత గంజాయి మత్తులో గల్లీ గల్లీలో అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తూ గలాటా సృష్టిస్తున్న అబ్కారీ శాఖ తనిఖీలు చేపట్టకపోవడం పలు అనుమానాలను తావిస్తుంది. ఇదిలా ఉంటే ఆర్మూర్ సర్కిల్ పరిధిలో సుమారు 25 మద్యం షాపుల నుండి సరాసరి నెల నెల 25 వేల నుండి 30 వేల వరకు నజరాణాలు అందుతున్నట్లు సమాచారం.మద్యం దుకాణాల నుండే కాకుండా బెల్ట్ షాపుల నుండి సుమారు 2000 నుండి 5000 వరకు నెలనెలా మామూలు అందుతున్నట్లు తెలిసింది. ఈ నజరానాలను స్థాయికి తగ్గట్లుగా సీఐ నుండి కానిస్టేబుల్ వరకు పంపిణీ జరుగుతున్నట్లు సమాచారం.ఇంత భారీ స్థాయిలో ముడుపులను తీసుకుంటున్న అధికారులు అక్రమ మద్యం దారులపై ఎలాంటి చర్యలు చేపడతారో ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.పోలీస్ శాఖ వారు మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారే తప్ప, అబ్కారి శాఖ ఏనాడు కూడా కేసులను నమోదు చేసినట్లు చూపడం లేదు. నిత్యం యువత గంజాయి, మద్యం మత్తులో పట్టణంలో అర్ధరాత్రి వరకు గలాటాలు సృష్టిస్తున్నారు. ఒకప్పుడు పట్టణంలోని టీచర్స్ కాలనీలో అద్దె భవనంలో అబ్కారీ శాఖ కార్యాలయం కొనసాగుతూ ఉండేది, కానీ ఇప్పుడు పట్టణానికి దూరంగా ప్రభుత్వం అబ్కారీ శాఖకు సొంతభవనాన్ని నిర్మించింది.పని నిమిత్తం ఆబ్కారి శాఖ కార్యాలయానికి వెళ్లే వారి సంఖ్య తగ్గిపోయింది.దీనికి తోడు ఏదైనా విచారణ నిమిత్తం అధికారులకు ప్రజలకు వారధిగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం అధికారులకు సెల్ ఫోన్ లను అందించగా ఆ సెల్ ఫోన్ లకు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించకపోవడం తో ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. అవసరం ఉండి ఏదైనా ఫిర్యాదు నిమిత్తం ఫోన్ చేస్తే సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫోన్ లేపడం మహాభాగ్యంగా తయారయింది. ఇప్పటికైనా ఆబ్కారి శాఖ మేల్కొని పనిచేస్తే బావుంటుందని ప్రజలు కోరుతున్నారు.



# నాలుగు వరసల రహదారి బాధితులకు న్యాయం చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సుందరగిరి గ్రామ పాలకవర్గం వినతి
- ప్రభుత్వం తరపున బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి హామీ

**చిగురుమామిడి జూన్ 21(జనంసాక్షి):** నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా ఇండ్లు, విలువైన ప్లాట్స్ కోల్పోతున్న బాధితులను ప్రభుత్వం తరఫున తప్పకుండా ఆదుకోవాలని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను సుందరగిరి గ్రామ గ్రామపంచాయతీ పాలకవర్గం,బాధితులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాలుగు వరసల రహదారి నిర్మాణంలో భాగంగా ఇండ్లు,విలువైన కాళీ స్థలాలను కోల్పోతున్న తమకు తీవ్ర నష్టం జరుగుతోందని బాధితులు మంత్రి ముందు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న ఇండ్లను రోడ్డు విస్తరణ పేరుతో కోల్పోతుండటం వల్ల తాము రోడ్డున పడే పరిస్థితి వస్తుందని మంత్రికి వివరించారు.ప్రభుత్వం స్పందించి మార్కెట్ ధర ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించాలని,ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు ప్రత్యామ్నాయ పునరావాసంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు కోరారు.బాధితులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని,ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకట రమణారెడ్డి, ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,నాలుగు వరసల రహదారి బాధితులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
22 జూన్ 2026

# తెలంగాణపై దాడి చేసేవాడు ఇంటోడైనా, బైటోడైన ఇడవం

## బహుజన ఉద్యమ కవి జూలూరు గౌరీ శంకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే వాళ్ళు ఇంటి వారైనా, బయటి వారైనా, ఎవరినైనా ఈ నేల క్షమించదని తెలంగాణ బహుజన ఉద్యమకవి జూలూరు గౌరీ శంకర్ అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం ఖానాపురం కరెంట్ ఆఫీస్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ అనేది నిరంతరం కొనసాగే సాంస్కృతిక విప్లవమని చెప్పారు. స్వరాష్ట్ర సాధనలో గెలిచామని, అయితే అస్తిత్వ పరిరక్షణ అనేది నిరంతర ఉద్యమంగా కొనసాగించవలసిందేనని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వ భావోద్వేగాలతో ఆటలాడుకుందామనుకునేవాళ్లు చేదు ఫలితాలను అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఈనేల ఎవరినైనా అక్కున చేర్చుకుంటుందని, తన అస్తిత్వం జోలికొస్తే మాత్రం తిప్పికొట్టే తిరుగుబాటుగా మారుతుందని హెచ్చరించారు. మలి దశ రాష్ట్ర సాధన ఉద్యమంపై విషం గక్కిన ద్రోహులు ఎవరో, కుట్రదారులు ఎవరో ఈ నేలకు బాగా తెలుసునని, వాళ్లు ఏ రూపాల్లో ఉన్న, ఏ వేషాల్లో వచ్చినా తెలంగాణ ఎరక పడుతుందని తెలిపారు. అధికారాన్ని కోల్పోతే మళ్లీ తిరిగి సంపాదించుకోవచ్చునని సాంస్కృతికంగా మనల్ని మనం కోల్పోతే తిరిగి కోలుకోలేమని డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ చెప్పిన విషయాన్ని మననం చేసుకుని ప్రతి తెలంగాణ పౌరుడు అస్తిత్వ పరిరక్షకుడు కావాలన్నారు. తెలంగాణ అస్తిత్వం అంటే బహుజన హితం కోరేదని, అదే సకల జన హితమని జూలూరు తెలియజేశారు. బీసీ రచయితల సమైక్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు ములూక సురేష్ మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం కోసం తిరిగి ఉద్యమించవలసిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈ సమావేశంలో రచయితలు చింతకింది ఆంజనేయులు, ములకలపల్లి సంగమేశ్వర రావు, బుక్కా సత్యనారాయణ, కామిశెట్టి శ్రీనివాస్, ఎన్ఎస్ దశరథ రామ్ లక్ష్మీనారాయణ, పుల్లయ్య చారి లక్ష్మి నారాయణ, వెంకట్ సోమయ్య నాగరాజు రఘు పాషా పురుషోత్తం సత్యేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటం

- గుడిసెల స్థానాల్లో పేదలకు ఇండ్లు కట్టివ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



హైదరాబాద్ (జనంసాక్షి) : నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గుండ్ల సింగారం, గోపాల్ పూర్ తొలగించిన గుడిసెల స్థానాల్లో పేదలకు ఇళ్ల కట్టించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్‌లో కలిసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగి పడేసి అడ్డు వచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ప్రశ్నించారు. గోపాల్ గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరం తోపాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శు లు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషా మియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసీపీఐ నాయకులు సుధాకర్, ఎస్ నాయకులు భరత్ పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టం అమలు సాధ్యం కాదు

- గ్రామీణ ఉపాధి, రాష్ట్రాల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- విపక్ష పాలిత రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం
- న్యాయపరంగా, రాజ్యాంగపరంగా సవాల్ చేసే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయం
- వీబీజీ రామ్‌జీ చట్టం-2025పై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ



హైదరాబాద్, జూన్ 21 (జనంసాక్షి) : వీబీజీ రామ్‌జీ చట్టం అమలు సాధ్యం కాదని క్యాబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. వీబీజీ రామ్‌జీ చట్టం-2025 అమలుతో ఏర్పడే ప్రభావాలు, రాష్ట్రాలపై పడే ఆర్థిక భారం, గ్రామీణ ఉపాధి హామీ పథక భవిష్యత్తు తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శనివారం జరిగింది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు డా.దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, డా. వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరై వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

వీబీజీ రామ్‌జీ చట్టం-2025 అమలుతో గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై సబ్ కమిటీ విస్తృతంగా చర్చించింది. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించింది. ముఖ్యంగా ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాల్సిన అవసరంపై సభ్యులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాక్టికల్‌గా అమలు చేయడం సాధ్యం కాదని సమావేశంలో అభిప్రాయపడింది. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలీ రేట్లపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవన భద్రతకు ఇది విఘాతం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సముచితం కాదని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. దేశ గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును అందించిన చారిత్రాత్మక పథకానికి గాంధీజీ పేరు కొనసాగాలని సభ్యులు పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం అప్రజాస్వామికమని సమావేశంలో అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సభ్యులు పేర్కొన్నారు. అర్టికల్ 258(3) ప్రకారం..రాష్ట్రాలపై కేంద్రం అదనపు భారం మోపే పక్షంలో..రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాల్సి ఉంటుందని రాజ్యంగం స్పష్టం చేస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. 16 ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులు, రాష్ట్రాల ఆర్థిక హక్కులు హరించే విధంగా ఉన్నాయని, మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాలకు నష్టం చేసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళుతున్న ప్రతి రూపాయికి తిరిగి 40 పైసలే వెనక్కి వస్తుందని..అలాంటప్పుడు వీబీజీ రామ్ జీ పేరుతో 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రంపై మోపడం ఆమోదయోగ్యం కాదన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టాన్ని న్యాయపరంగా, రాజ్యాంగపరంగా సవాల్ చేసే అవకాశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ విషయంలో న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు విపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. కర్ణాటక, కేరళ, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలతో మాట్లాడి ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

వీబీజీ రామ్‌జీ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రాలు విడివిడిగా కాకుండా ఉమ్మడిగా తమ నిరసనను వ్యక్తం చేయాలని, అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాల వారీగా అధ్యయనం కొనసాగించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించనున్నట్లు వెల్లడించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీ ఎస్ దానకిషోర్, కమీషనర్ దివ్యా దేవరాజన్, స్పెషల్ కమీషనర్ శ్రీ లక్ష్మీ, జాయింట్ కమీషనర్ నరసింహులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో బొగ్గు చోరీ అవాస్తవం

- సింగరేణిలో అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా
- ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ
- అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక రవాణా వ్యవస్థ
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణి బొగ్గు చోరీకి గురైందని, కనిపించడం లేదంటూ కొన్ని మీడియా సంస్థల్లో ఇటీవల వస్తున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ స్పష్టం చేస్తోంది. సంస్థలో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతున్నాయని పేర్కొంది. సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాలను వెల్లడించింది. 'గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్‌గా నమోదవుతోంది. బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా చేయడం జరుగుతోంది. బొగ్గు కేటాయింపులు ఎస్ఏపీ ఆధారిత సమగ్ర వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయి. విని యోగదారుడు, గని, పరిమాణం, సరఫరా తేదీ తదితర వివరాలు ముందుగానే డిజిటల్‌గా నమోదవుతాయి. ప్రతి టన్ను బొగ్గుకు సంబంధించిన సమాచారం కోల్ నెట్, ఎస్ఏపీ, ఇతర ఆన్‌లైన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని" సింగరేణి ఆపరేషన్స్ విభాగం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. "రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనం ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌ల వద్ద తూకం వేయడం జరుగుతుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) ఆధారిత బూమ్ బ్యారియర్లు, జీపీఎస్ / జీపీఆర్ఎస్ ట్రాకింగ్, జియోఫెన్సింగ్ వ్యవస్థల ద్వారా వాహనాల కదలికలపై రియల్ టైమ్ లో పర్యవేక్షణ కొనసాగుతోందని" ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు పేర్కొన్నారు. "రైల్వే మార్గంలో కూడా ప్రతి వ్యాగన్ లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్‌గా నమోదవుతున్నాయి. గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు (సీహెచ్‌పీ)లు, వెయిబ్రిడ్జ్ లు, రైల్వే సైడింగ్‌లు, స్టాక్ యార్డులు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయిం ట్ల వద్ద సీసీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు" బొగ్గు రవాణా విభాగం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అలాగే ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక గస్తీలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. ఇంత పకడ్బందీగా ఆర్ఎఫ్ఐడీ, జీపీఎస్, సీసీటీవీ, కోల్‌నెట్ ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌లు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థల మధ్య జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి-రవాణా ప్రక్రియలో బొగ్గు చోరీకి గురికావడం, కనిపించకపోవడం వంటి ఆరోపణలు అవాస్తవమని సింగరేణి యాజమాన్యం పేర్కొంది.

# పెళ్లికి వెళ్లి వచ్చేసరికి బీరువా ఖాళీ

**4.25 తులాల బంగారం చోరీ**

తాండూరు జూన్ 21(జనంసాక్షి) : తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ చోటుచేసు కుంది. పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బీరువా లాకర్‌లో ఉన్న సుమారు 4.25 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడు పట్టణంలో ని పుటాన్ గల్లికిచెందిన మామిడి రాజన్న మరియు అతని భార్య జూన్ 19న ఇంటికి తాళం వేసి చించో లిలో తెలిసినవారి పెళ్లికి వెళ్లారు. మరుసటి రోజు, అంటే జూన్ 20, 2026 ఉదయం తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన తర్వాత బీరువాలోని లాకర్‌ను తెరిచి చూడగా అందులో దాచిన బంగారు ఆభరణాలు కనిపించక పోవడంతో వారు షాక్‌కు గురయ్యారు. చోరీకి గురైన ఆభరణాల్లో 4 తులాల బంగారు నెక్లెస్ మరియు నెక్లెస్ కమ్మలు, 1.5 గ్రాముల పుస్తె, 1 గ్రాము చెవి దుద్దులు ఉన్నాయి. మొత్తం 4 తులాల 2.5 గ్రాముల బంగారం మాయమైనట్లు బాధితుడు తెలిపారు. ఎవరో గుర్తు తెలియని దుండగులు తాము ఇంట్లో లేని సమయంలో బీరువా లాకర్‌ను తెరిచి బంగారు ఆభరణాలను దొంగిలించారని మామిడి రాజన్న తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పెళ్లికి వెళ్లిన ఒక్క రాత్రిలోనే చోరీ జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వేలిముద్రల నిపుణులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## నేడు ఉప్పల్ స్కైవాక్‌లో విద్యుత్ నిర్వహణ పనులు

హైదరాబాద్ (జనంసాక్షి) : వార్షిక నిర్వహణ కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ స్కైవాక్ లో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు హెచ్ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు తెలిపారు. ఈ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ సమయంలో ఉప్పల్ స్కైవాక్ లోని లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు పనిచేయవని అధికారులు తెలిపారు. నిర్వహణ పనులు ప్రజల భద్రత, సౌకర్యాల మెరుగుదల కోసం చేపడుతున్నందున ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కారణంగా కలిగే అసౌకర్యానికి హెచ్ఎండీఏ అధికారులు చింతిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు పేర్కొన్నారు.

## తండ్రి సమ్మయ్యను సత్కరించిన మంత్రి సీతక్క



ములుగు (జనంసాక్షి) : ఫాదర్స్ డే సందర్భంగా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తన స్వగ్రామమైన ములుగు మండలం జగ్గన్నపేటలో తండ్రి దనసరి సమ్మయ్యను కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తండ్రికి శాలువా కప్పి సత్కరించి, ఆయన పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తన జీవితంలో తండ్రి సమ్మయ్య పాత్ర ఎంతో గొప్పదని, చదువు లేని సాధారణ రైతు అయినప్పటికీ క్రమశిక్షణ, కష్టపడే తత్వం, విలువలను చిన్న నాటి నుంచే నేర్పించారని గుర్తుచేశారు.

# నీట్ పరీక్షకు 73,058 మంది విద్యార్థుల హాజరు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- నీట్ యూజీ 2026 స్టేట్ కంట్రోల్ రూమ్ పరిశీలన



హైదరాబాద్ (జనంసాక్షి) : నీట్ పరీక్షకు 73,058 మంది విద్యార్థుల హాజరైనట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులో ఇంటర్మీడియట్ డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నీట్ యూజీ 2026 పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేసిన సీసీ టీవీ సర్వేలైన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తుతో కలిసి పరిశీలించారు. నీట్ యూజీ 2026 పరీక్ష ను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు పరీక్షా కేంద్రాలకు అనుసంధానం చేసిన నీట్ యూజీ స్టేట్ కంట్రోల్ రూంను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. నీట్ యూజీ 2026 పరీక్ష కోసం తీసుకున్న ఏర్పాట్లపై స్టేట్ కంట్రోల్ రూమ్ ఇంచార్జి అధికారులు రాష్ట్ర డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, కేంద్ర విద్యా శాఖ డైరెక్టర్ రవీందర్, డీఐజీ నాయక్‌తో చర్చించారు. నీట్ యూజీ 2026 పరీక్ష ఫేర్‌గా, పారదర్శకంగా, భద్రంగా జరగాలని ఆదేశించారు. పరీక్ష విజయవంతం పై అధికారులు తీసుకున్న జాగ్రత్తలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... రాష్ట్రంలో 24 జిల్లాలలో 208 పరీక్ష కేంద్రాలలో 73058 మంది విద్యార్థులు నీట్ యూజీ 2026 పరీక్ష కోసం హాజరయ్యారని మంత్రి వెల్లడించారు. నీట్ యూజీ పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేసిన సీసీ టీవీ సర్వేలైన్స్‌తో స్టేట్ కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్ష కేంద్రాలను నిరంతరం అధికారులు మానిటరింగ్ చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా ఏర్పాటు చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

# 'సర్' విధానం పట్ల 15 లక్షల మంది గల్ఫ్ కార్మికుల ఆందోళన

- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ గల్ఫ్ ప్రతినిధుల భేటీ
- స్వయంగా గల్ఫ్‌లో పర్యటించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్ణయం



హైదరాబాద్ (జనంసాక్షి) : గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల ఓటు హక్కుల పరిరక్షణపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ ప్రతినిధులు ఆదివారం చర్చించారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో వారు చర్చించారు. తెలంగాణ రాష్ట్ర 'గల్ఫ్ కాంగ్రెస్' ప్రతినిధి సుతారి సత్యనారాయణ పటేల్, తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి ఆదివారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్న తెలంగాణకు చెందిన గల్ఫ్ కార్మికులు, ఎన్నారైలు తమ ఓటరు నమోదును కొనసాగిం చుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవస రాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆన్‌లైన్ జూమ్ సమావేశాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రతిపాదనలను మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్వీకరించినట్లు వారు తెలిపారు. అలాగే తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు, గల్ఫ్ కార్మికులతో ప్రత్యక్షంగా మమేకమయ్యేందుకు గల్ఫ్ దేశాలను పర్యటించాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు. స్వయంగా గల్ఫ్ దేశాల్లో పర్యటించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సుముఖత వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ వాసుల పాత్ర ఎంతో కీలకమని, వారి సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370